ప్రపంచాన్ని ప్రేమిద్దాం...

(యువతకు జీవిత పాఠాలు)



నేను... నా సమాజం

M.మంగళ, ఎడిటర్, : 9848302972

స్వర్ణపుష్పం

జాతి జాగృతికి శంఖారావం

3-10-21/సి, గోకుల్ నగర్, రామంతాపూర్, హైదరాబాద్-500013

ప్రపంచాన్ని ప్రేమిద్దాం...!

(నేటి యువతకు జీవిత పాఠాలు)

M. మంగళ

Cell :9848302972

ప్రకాశకులు :

స్వర్ణపుష్పం

3-10-21/C గోకులే నగర్, రామంతాపూర్, హైదరాబాద్.

సెల్ : **7995897324,7995897325.**

Email:Swarnapushpam.2013@gmail.com

వెల : **45-00**

©

ప్రపంచాన్ని ప్రేమిద్దాం...!

యం.మంగళ,
Cell : 9848302972,
పబ్లిషర్స్
వెల : 45-00
డిటిపి : స్వర్ణపుష్పం, హైదరాబాద్.

పంపిణిదారులు :

శైలి ప్రచురణలు
7-52. మేడపైన, మండపాక రోడ్డు, పైడిపర్రు, తణుకు.
Cell : 98850 45360, E-mail : sailiprachuruanalu@facebook.com

ముఖ చిత్రం : కళాకృతి
విజయవాడ, సెల్ : 8885 288882
ప్రింటింగ్ :
రమణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, గాంధీనగర్, విజయవాడ

పబ్లిషర్స్ :

స్వర్ణపుష్పం
3-10-21/C గోకులే నగర్,రామంతాపూర్, హైదరాబాద్.
సెల్ : 7995897324,7995897325.
Email:Swarnapushpam.2013@gmail.com

అంకితం

సమాజ శ్రేయస్సుకై ప్రతిక్షణం తపిస్తూ...

దేశమాత సేవకై జీవితాలనే త్యాగం చేస్తూ...

ప్రగతి పథంకై ప్రతినిత్యం కృషిచేస్తూ..!

కర్తవ్య పాలనకై ప్రాణాలను అర్పిస్తూ..!

జీవనాన్ని సాగించే ఋషులు, వీరులు, త్యాగమూర్తులను కన్న వేదగర్భ, అన్నపూర్ణ, భాగ్యరాశి ఈ అవనికే తలమానికం అయిన భరతమాత పాదపద్మాలకు ఈ ప్రపంచాన్ని ప్రేమిద్దాం అనే అక్షర చైతన్య సుమాలు వినమ్రతతో అంకితం.

జైహింద్

-మక్కపాటి మంగళ

రచయిత్రి పరిచయం

1. పూర్తిపేరు : మక్కపాటి మంగళ
2. విద్యార్హత : M.Sc, B.Ed, M.C.J. P.G.D.W.M.MT
3. వృత్తి : రచయిత,స్వర్ణపుష్పం మాసపత్రిక ఎడిటర్ & పబ్లిషర్
4. పురస్కారాలు : మదర్ థెరిస్సా ఎక్సలెన్స్అవార్డు
స్త్రీ శక్తి పురస్కారం, కళానిలయం
స్త్రీ శక్తి పురస్కారం, కమలాకర భారతి మెమోరియల్ ట్రస్టు
మహిళా పురస్కారం, రాగసప్తస్వరం
అడవి బాపిరాజు పురస్కారం,చైతన్య మహిళా పురస్కారం,
నవరత్న మహిళా పురస్కారం, జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ట్రస్ట్
యింకా ప్రముఖులచే మరెన్నో పురస్కారాలు, సత్కారాలు...
5. ప్రచురణలు : మహోన్నత పుష్పాలు (దేశభక్తిగీతాలు) గేయసంపుటి
మార్గగామి (వ్యక్తిత్వవికాసంపై)
స్వర్ణపుష్పాలు (ఆడియో సి.డి)దేశ భక్తి గీతాలు
ప్రపంచాన్ని ప్రేమిద్దాం(సమాజంలో మన బాధ్యత)
ప్రేమవర్షం (ప్రేమ మరియు స్నేహంపై కవితలు)
6. ఆశయం : స్వర్ణపుష్పం సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికై పాఠశాల విద్యార్థులలో "భక్తి - దేశభక్తి" అనే అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేస్తున్నాం. సామాజిక స్పృహను పెంచి , భారతీయతలోని విశిష్ఠతను,యువశక్తిని వెలికితీసే పలు కార్యక్రమాలు నిర్వహించడం.

విషయ సూచిక

1. మదిలోని మాట... 6,7
2. జాతి జాగృతికి శంఖారావం ...8,
3. జననీ జన్మభూమిశ్చ...10,11
4. అన్నదాత వందనం-12
5. ఇది స్వేచ్ఛాభారతమా..!..14,15
6. మహాత్ములారా మౌనాన్ని వీడండి-16
7. అమ్మే కినుక వహిస్తే ...18
8. మహనీయులకు వందనం...20
9. మాతృభూమి శ్రేయస్సుకై పాటుపడుదాం..22
10. ఎన్నాళ్లీ కీచక వృత్తి..?.24
11. పుట్టిన రోజు...26, 27
12. ప్రగతి పథం వైపు సాగుదాం..! 28
13. ఈజగతికి చాటిచెబుద్దాం....30
14. వేద గర్భ బిడ్డలమేనా..!-31
15. ఏం చేద్దాం ...33
16. పండగొస్తుందంటే..!-35
17. వైద్యోనారాయణా హరీ..!-37
18. హృదయ బాషే మాతృబాష...39
19. చదువు కొనే దెలా...41,
20. ఎటుపోయింది సహజగుణం-43
21. ఇదీ మన బాధ్యతే .-45,
22. ఎందెందు వెతికినా.-46
23. తప్పెవరిది... ...48
24. నేటి భారతం ...50
25. ఆలోచించండి ఇలా?-52
26. జీవన జ్యోతి-54
27. సంబరాలలో మనము-56
28. యువశక్తే... నిజసంపద -58
29. కలుపు మొక్కలను పీకేద్దాం....59
30. ఋణం తీర్చుకుందాం....61
31. తర్వాత ఏంటి? ...64
32. పలుకరిద్దాం ఇలా ...66
33. హ్యాట్సాఫ్... టెక్నాలజీ ...68
34. వృద్దాప్యం శాపమా!...70
35. అమ్మను మరుస్తామా... ...72
36. అమ్మా నన్ను కనొద్దు..! ...74
37. మీకిది తెలుసా (కర్మేయజ్ఞం) ...78
38. పుణ్యభూమి నాదేశం ...81
39. ప్రపంచాన్ని ప్రేమిద్దాం...86
40. ఈలోకం చిరునామా ... 88

- నీ దేశం ..
- నీ సమాజం ..
- నీ కుటుంబం ..
- నీ సంస్కృతి ..
- నీ వైభవం ...
- నీలో నీవు...
- నీకై నీవు...
- ప్రపంచానికై నీవు ...
- నీవు.. నీసమాజం...
- ప్రపంచాన్ని ప్రేమిద్దాం.

మదిలోని మాట

మంగళకర, మృదు మంజుల సస్యశ్యామల శోభలతో నిత్యం అలరారే మా ఊరిలో స్వచ్ఛమయిన వాతావరణం, నిర్మలమైన హృదయాలు, అనుబంధాలతో అల్లుకుపోయిన అనురాగాలు, కల్మషం ఎరుగని మనుషులు, మమతలతో నిండిన మనసులు ఇలాంటి వాతావరణంలో నా బాల్యం గడిచింది. పైచదువులకై నేను పట్టణానికి (హైద్రాబాదుకి) వచ్చాను, యిక్కడ నివాసాలతో పాటు వారి హృదయాలు ఇరుకే, ఎందుకంటే అథితులెవరైనా ఇంటికొస్తే...మా అమ్మ నాన్నలు ఇంట్లో వున్నదంతా వాళ్లకు పెట్టాలన్న తపన, ఆ ఆత్మీయత, ఆ మర్యాద గూర్చి ఎంత చెప్పినా తక్కువే, మరిక్కడ పెట్టింది తినకుండా వెళ్తే..బాగుందు అని చూస్తూ, పొడి పొడి మాటలతో సాగనంపడం, అన్నింట్లో ఎంతో తేడా జీవన విదానంలో ఒకరికి ఒకరు పట్టరు.

ఊరులో అలాకాదు ఎవరింట్లో వాళ్లున్నా అందరి సమస్యలు వారివే, ఏదేమైనా కాలం మారింది హృదయాంతరాలలో స్వార్థం అనే తుప్పు పేరుకుపోయింది బాధ్యతలు, బందాలు, అన్నీ కుదించుకుపోయాయి నేను... నాది... అంతే నా దారి, సంపాదనకే కాలం సరిపోదూ యిక సామాజిక దృక్పదం ఎక్కడుంటది చెప్పండి, పైసాకై ఆరాటం ప్రతిదినం పోరాటమే విలాసాలు, జలసాలు, విచ్చలవిడితనాలు, ప్యాషన్‌లు, మోసాలు మనకు సంపాదన మొదలయితే కన్నవారిని మరుస్తున్నాం, తోబుట్టువులయితే యిక ఎవరో అన్నట్లే, ప్రకృతిపై మనసు లేదు, సామాజిక స్పృహ అసలే లేదు. ఎవరేమైన నాకెందుకనే అస్తవ్యస్థ దోరణి, టెక్నాలజీ పెరిగింది యంత్రాల్లా మారాము, సమాజం నుండి ఎన్నో తీసుకుంటున్నాం , ఎంతో గొప్ప సంస్కృతిని సాంప్రదాయాలను వారసత్వంగా పొందాము మనం. మనపూర్వీకులు మన జీవనానికి చుక్కానిలా...ఎన్నో మార్గగాములను మనకిచ్చారు. అమోఘమైన వేదసంపద,యజ్ఞ జీవనం,యోగ,ఆయుర్వేదం, జ్యోతిష్యం, ఆలయాలు, అర్చనలు, దయ, దానం, యిలా ఎన్నెన్నో... మన మేంటో తెలుసుకుని మన మనుగడ సాగిస్తూ దేశ మాత ఖ్యాతిని పెంచి సమాజ శ్రేయస్సుకు జీవనాన్ని సాగించమని, అయితే మనమేం చేస్తున్నాం ఆహారంలో... విహారంలో... ఆలోచనల్లో... ఆంతర్యంలో మనకు మచ్చ తెచ్చి హాని కలిగించే మార్పులనన్నింటిని ముసుగుగా వేసుకుని అయోమయంలో, వెలితితో జీవనాన్ని సాగిస్తున్నాం... ఈ వెలితి లేకుండా వుండాలంటే నేటి సమాజంలో పేరుకు పోయిన ఈ కల్మషాలను గుర్తించి అవి కృళ్లిపోకముందే మనం

జాగరూకులమై శ్రేష్టమయిన ఆలోచనలతో, ప్రతిభను ప్రోత్సహిస్తూ, పాండిత్యాన్ని గౌరవిస్తూ, మన సంస్కృతులను ఆచర్తిసూ, సాంప్రదాయాలను పాటిస్తూ... సమస్యలను ఎదురిస్తూ... సమాజాన్ని ఉద్ధరిస్తూ, ప్రపంచాన్ని ప్రేమిస్తూ... జీవనాన్ని సాగిస్తే! భరతావనిలో పుట్టిన పుణ్యచరితుల వారసులమని గర్వంగా చెప్పుకొనేలాగ జీవించొచ్చు...నేటి సమాజంలో వున్న సమస్యలను నేటితరానికి వివరించాలన్న తపనే ఈ "ప్రపంచాన్ని ప్రేమిద్దాం" అన్న నా హృదయ బావ అక్షర సుమాంజలి...

సహృదయులారా..! నేటి రేపటి తరాలను నడిపే సారథులారా ! మన జాతి ఔన్నత్యాన్ని తెలుసుకుని, నేటి మన సమాజంలోని సమస్యలను ఆకలింపు చేసుకుని... ఆదిలోనే విష సంస్కృతులను తుంచి వేసి... మన పూర్వవైభవంతో, విశాలమైన హృదయంతో నేటి ఆధునిక హంగులతో ఆనంద కరమైన జీవనాన్ని ప్రతి ఒక్కరు సాగించాలని ఆశిస్తూ..! త్యాగధనుల వారసులమై **"నేను, నా సమాజమంటూ జీవనాన్ని సాగిద్దాం." మదిలో విరబూసిన చైతన్య సుమాలతో సమాజాన్ని అర్చించాలన్న తపనకు స్ఫూర్తిని కలిగించిన స్నేహితులకు, సన్నిహితులకు, ఆత్మీయులకు,కృతజ్ఞతాబి నందనలతో హృదయపూర్వకంగా నమస్కరిస్తూ...మీ ఆశిస్సులకై ఆశిస్తూ... భరతమాత పాదపద్మాలకు వినమ్ర నమస్కారములతో.**

-జైహింద్

మక్కపాటి మంగళ

మన సంస్కృతిని ప్రేమిస్తూ
మన సాంప్రదాయాలను గౌరవిస్తూ
ఆర్థిక వనరులను కాపాడుకుంటూ
మన ప్రతిభకు మెరుగులు దిద్దుతూ..
ప్రపంచానికే తలమానికమైన
మన చరిత్ర గొప్పదనాన్ని.. నలుదిశలా
చాటుతూ.. బాధ్యతగల పౌరులుగా
కన్నవారికి దేశమాతకు వన్నెతెస్తూ...
అందరికీ ఆదర్శంగా నిలవాలని వుందా..!
అయితే "ప్రపంచాన్ని ప్రేమిద్దాం " అనే
ఈ చిన్న పుస్తకాన్ని చదవండి..! ప్రగతి పథంవైపు నడవండి
విజయాన్ని సాధించండి.

జాతి జాగృతికి శంఖారావం

ఆది ప్రణవ నాథం
అనంతకోటి తేజం
దివ్యఋషుల జ్ఞానం
ఈ జగానికే శుభోదయం
నా దేశం భారతదేశం
నాజాతి భారత జాతి

అన్న తలంపు నా స్మరణ లోకి వస్తేచాలు ఆనందపు తరంగాలు చుట్టుముట్టి అలా తన్మయంలో ఓలలాడిస్తాయి.

తపస్సులో పుట్టి, జ్ఞానంతో చరిస్తూ, ధర్మంలో విహరిస్తూ ధైర్యంతో నడిచి, త్యాగంతో జీవించి... సత్యంతో బాషించి,యశస్సుతో శోభించి, జ్ఞానసుధాసాగరంలో అమృతమై నిలిచి అనంతమై వెలుగొందిన అద్భుత జాతిమనది. ఈ అవనిలో లేనిది ప్రపంచంలో ఏమీ లేదని గర్వంగా చెప్పుకోవచ్చు.

వెలుగారని దీపము భానుడు వెలుతురు తానైనవాడు జీవుడు అని శాసనంగా చెప్పింది మన ఆర్షసంస్కృతి. ఆసేతుహిమాచల సస్యశ్యామల జీవదాత్రికి జేజేలు అంటూ నిండుహృదయంతో ఉప్పొంగే భక్తితో పరవశించారు మన కవులెందరో..!

ఈ ధాత్రిలో నివసించే మనమంతా ఒకేజాతి, అదే భారత జాతి, కులం, మతాతీతం, ధనిక పేదరికం అంటని వారం మనం భారతీయులం. అందుకే ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవమంటూ ఎలుగెత్తి చాటారు. సాహనానికి మారుపేరు, సౌమ్యానికి ప్రతిరూపం, సత్యానికి నిధర్శనం సహనానికి నిజరూపం, శౌర్యానికి ప్రతిబింభమై, సామరస్యాన్ని కలబోసుకొని సౌభ్రాతృత్వాన్ని యిమిడించుకొని, త్యాగధనాన్ని కూడబెట్టుకొని, ధర్మానికి కట్టుబడి, దేశభక్తికై జీవిస్తూ జ్ఞానంతో శోబించే అపురూప అమూల్య రత్నం మనజాతి యశస్సు, అదే భారత జాతి ఘణత. కళలకు నిలయం కర్తవ్యానికి ప్రతిరూపం,రత్నగర్భ మనదేశం ప్రకృతి రమనీయ సౌదం అన్నపూర్ణ మన ఇల్లు యిన్ని వున్న మనకులేని సంపదేంటి..?

అవినీతి, బద్ధకం, నిర్లక్ష్యం, అవిధ్య, కుటిల కుతంత్రాలు, అసాంఘీకాల లాంటి కాలుష్యపు కోరల బారినుండి రక్షించి ప్రగతిబాటలో సాగిపోవడానికై జాగృతి చేయడానికే ఈ శంఖరావం. మన సంస్కృతి సాంప్రదాయాలకు వారసులై పాడిపంటలతో విరాజిల్లుతూ... సిరిసంపదలతో తులతూగి దేశప్రగతికి పట్టుకొమ్మలైన మన గ్రామసీమలు కూడా విదేశీ వ్యామోహంలోపడి ఆ సంస్కృతి మోజులో మత్తులో తేలుతూ, భద్దకంతో తూలుతూ, మన జాతి ఘణతను నిర్వీర్యం చేస్తున్న మన గ్రామసీమల జాగృతికై శంఖారావం పూరించాలి. అన్నపూర్ణ మనదేశం స్వర్గసీమలు మన పల్లెలు... ఎక్కడ పోయాయి మన వృత్తులు, మరుగున పడ్డాయి మన కళలు... మన సంస్కృతి కాశికి, సాంప్రదాయాలు కంచికి వెళ్ళాయి. విదేశీ వ్యామోహం ధనార్జనకై పరిగెత్తి, విధ్య వ్యాపారమై, విజ్ఞానం పరులకు ధారపోసి... **జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ** అన్న **మన గుండెలయ కన్న వారిని అనాదలను చేసి**... మాతృభూమిని చిన్నచూపు చూసి డాలర్లకై పరుగెడుతున్న మన యువతరం యొక్క జాగృతికై శంఖారావం పూరించాలి. మేధస్సు మన సొంతం అది మన జాతి శ్రేయస్సుకే అంకితం అని చాటాలి. కాలుష్యం నీడలో, దళారుల కాఠిన్యపు కోరల్లో క్షీణించిపోతున్న మన వనరుల పరిరక్షణ జాగృతికై శంఖారావం పూరించాలి.

వెన్నముక నీరసించింది,అవినీతి అందలమెక్కింది,కళలు కాస్త మెరుగుపడినా..! అవి కలవారి సొంతమే అయ్యాయి. చదువుకున్నవారి సంఖ్య పెరిగినా అవి విదేశాలలో అమ్ముకోవడడానికే పరిమితమయ్యాయి. ప్రజాశ్రేయస్సుకై పరితపించే నాయకులు కరువై ప్రజాస్వామ్యం పట్టు తప్పింది. అందుకే ప్రగతి బాటలో ప్రయణించడానికి ఈ జాతి జాగృతికై చేసే శంఖారావం, ప్రతి యిల్లు ఆలయం కావాలి అక్కడ నివసించే వారందరూ ఆనందంగా వుండాలి. అది అమ్మ మాత్రమే చేయగలదు. అందుకే ప్రతి మహిళ మహొూన్నతమైన సంస్కారాలను కలిగి మహిమాన్వితురాలు కావాలి. సంతోషకరమైన సమాజాన్ని నిర్మించడానికి అందరు చైతన్యవంతులు కావడానికే శంఖారావం. ఈ దేశ మాత పాదాలకు వినమ్రతతో చేసే ఈ అక్షర అర్చనే **"స్వర్ణపుష్పార్చనై"** నిలవాలని, ఆత్మీయులు ఆదరించాలని, ఆర్యులు అందుకోవాలని, ఋషులు ఆశీర్వదించాలని, భవదీయులు దీవించాలని, యువత ముందుకు రావాలని,ముందు తరాలకు సాగిపోవాలని, మనఖ్యాతిని ప్రపంచ మంతా వేనోళ్ళ కొనియాడాలి అని నా ఆకాంక్ష.

శుభం.- జై హింద్.

'జననీ జన్మభూమిశ్చ'

మాతృగర్భంలో నవమాసాలు ఆవాసముండి మన ఉనికికి కారణమైన ఈ దేహంతో మనం ఈ ప్రపంచంలోకి అడుగు పెడుతాము. మనకు జన్మ నివ్వడానికి మన తల్లి ఎన్నో ఇక్కట్లు పడుతుంది. తన ప్రాణాన్ని పణంగా పెట్టి మనకు జన్మనిస్తుంది. అందుకు ఆతల్లి ఋణం ఎలా తీర్చుకోగలం... అది అనంతమైనది అందుకే మాతృదేవోభవ అని దైవంగా, దైవ సమానంగా ఆమెకు మొదటి స్థానాన్ని ఇచ్చి గౌరవించాము గుండెల్లో గుడికట్టి అనుక్షణం నమస్కరి స్తున్నాం. "మరి మన జీవితానికి వెలుగులు పంచి సంస్కారపథంలో పయనింప జేస్తూ అనుక్షణం మన ఆనందానికై తపిస్తూ తాను కొవ్వొత్తిలా కరిగిపోతున్న మన కన్న తండ్రినీ పితృదేవోభవ అంటూ రెండవ స్థాన మిచ్చి గౌరవించి ప్రేమిస్తున్నాం.

మరి మన జీవితంలో విజ్ఞాన సుమాలు పూయిస్తూ విచక్షణా జ్యోతులను వెలిగిస్తూ... ఉన్నతమైన మార్గంలో నడిపించే మన గురువులను కూడా మనం ఆచార్య దేవోభవ అంటూ ఆరాధిస్తున్నాం. కాని మనం మాతృ గర్భంలో వున్నప్పటి నుండి ఈ తనువును చాలించే వరకు మనకు ఆశ్రయమిచ్చి పంచభూతాలతో సహా మనకు అన్ని అందించి చివరకు ఆ తర్వాత కూడా తనలో కలుపుకుని ప్రేమగా లాలించే అమృతమూర్తి మన దేశమాత.. ఆవాసానికి ఆశ్రయానికి ఏలోటులేకుండా మహోన్నతమైన సంస్కృతికి వారసులను చేసి ఘణచరిత్రను మనకు అందించిన ఈ తల్లిఋణం ఎలాతీర్చుకోగలం అందుకే "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అంటూ వేదాలు శ్లాఘించాయి. అంతేకాదు జన్మనిచ్చిన మన తల్లికన్న బిడ్డలందరిని సహోదరులుగా భావించి ఎలా అయితే వారి సుఖసంతోషాల కోసం ఆహర్నిషలు తపిస్తున్నామో... మరి ఈదేశమాత

బిడ్డంలదర్నీ కూడ తమస్వంత సహోదరులుగా... సమాజాన్ని దేశాన్ని తన కుటుంబంగా... ఆ తల్లి కలతలన్నింటి కొరకై తల్లడిల్లి తపించే బిడ్డగా జీవించాలి. ప్రగతి పథం వైపు నడిపించే పౌరులుగా ఎదగాలి. దేశమాత ముద్దుబిడ్డ అయి వెలగాలి ఆనాడు పరపీడనంలో తెల్లదొరల పాలనలో బందీ అయి తల్లడిల్లుతున్న భరతావని కోసం తల్లిడిల్లి...ఆ తల్లి కన్నీరును తూడ్చుటకు తపించి నడుంకట్టి ముందుకు నడిచి మన జాతినంతా నడిపించిన మహాత్ముడు మనబాపు, తన సర్వస్వాన్ని తనతల్లి (జన్మభూమి) సహోదరుల కోసం తన జీవితాన్నే అర్పించిన అమరుడు మన గాంధీజీ... నాడు పరపీడితులమై అల్లకల్లోల అస్థవ్యస్థ అజలజడులు దోపిడీ దురాగతులతో·ఆతలాకుతలమైన భరతావనిని రక్షించి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి దేశమాత కన్నీళ్లు తుడిచారు ఎందరో త్యాగమూర్తులు. కర్తవ్యపాలనలో కర్పూరంలా వెలిగి తాను కరిగిపోయి మన అందరికి ఆదర్శమయ్యారు. మరినేడు స్వయంపీడితంతో సతమతమవుతుంది మన సమాజం, అకృత్యాలు అఘాయిత్యాలు, అల్లకల్లోలాలు, దోపిడీలు, దౌర్జన్యాలు కరాళనృత్యం చేస్తున్నాయి. మరి నేడు మనకు పట్టిన .ఈ దౌర్భాగ్యపు తెగులును వదిలించడానికి ప్రతి భారతీయుడు ముందుకు రావాలి. **మహాత్ముల, వీరుల, త్యాగధనుల వారసులమైన మనకెందుకు ఈ మత్తునిద్ర, కన్నతల్లి కన్నీరుని తుడవలేని నిర్వీర్యులమా మనం, మనకు పట్టిన బూజును మనమే దులుపుకోలేని దుస్థితిలో వున్నామా..! కలవర పడుతుంది మన దేశమాత కదలిరండి... సొదరులారా..! మహ్మాతుల బాటలో నడుద్దాం.**

-జైహింద్

> **మాతృ గర్భంలో వున్నప్పటి నుండి ఈ తనువును చాలించే వరకు మనకు ఆశ్రయమిచ్చి పంచభూతాలతో సహా మనకు అన్ని అందించి చివరకు, ఆ తర్వాత కూడా తనలో కలుపుకుని ప్రేమగా లాలించే అమృతమూర్తి మన దేశమాత. ఆవాసానికి ఆశ్రయానికి ఏలోటులేకుండా మహోన్నతమైన సంస్కృతికి వారసులను చేసి ఘణచరిత్రను మనకు అందించిన ఈ తల్లిఋణం ఎలాతీర్చుకోగలం.**

అన్నదాత...వందనం

తేనెలూరు మనసుల మఖరందాలు
పల్లెలేను భరతావని భాగ్యసీమలు

అవును కల్మషం ఎరగని మనసులతో ప్రకృతి మాతను ఆరాధిస్తూ ...శ్రమే ఊపిరిగా.. రాత్రి పగలు తేడాలేకుండా భూమాత అనుగ్రహానికై తపిస్తూ అనుక్షణం ఈ ధరిత్రిని సస్యశ్యామలంగా మార్చి ధాన్య రాసులను కుప్పలు గాబోసి మనకు ఆహారాన్ని అందించుటకై నిత్యం ఆరాటపడేది మన రైతులే కదా! నిజానికి వారే మనదేవుళ్లు ..!

వారిలోని ప్రతి రక్తపు బొట్టును శ్రమైక స్వేదబిందువుగా మార్చి మనకు ఆహారాన్ని అందిస్తూ తానుమాత్రం ఎండలో ఎండుతూ వానలో నానుతూ ప్రకృతి ఆటుపోట్లను తట్టుకొంటూ ఉండి మనకు అన్నంపెట్టే అన్నదాతకే తినడానికి తిండి లేకపోతే నిత్యశ్రమలో నీరసించిన రైతు మనకేం పెడతాడు. కుటుంబ బాధ్యతలు కుదిపేస్తుంటే వీరు వలసకూలీలుగా మారి పట్టణాల్లో పడరాని కష్టాలు పడుతున్నారు. బిక్కుబిక్కుమంటూ వారి వృద్ధ తల్లిదండ్రులు...వీరి రాక కోసం పరితపిస్తూ ఎదురు చూపులతో గడుపుతున్నారు. 'చదివేస్తే ఉన్న మతిపోతుందా...అన్న చందంగా అందరికీ విద్య బాగానే ఉంది. మరి అన్నం పెట్టే విద్యను ప్రోత్సహించి గ్రామీణ జీవన బలోపేతానికి ఎందుకు తోడ్పడ లేకపోతున్నాం?

పునాదే సరిగ్గా లేకపోతే మన ఆర్థిక పరిస్థితి ఎలా! పండించే వాడే...లేకపోతే మనకు తిండి ఎలా...శాస్త్ర సాంకేతికాలలో విశ్వాంతరాలను మదిస్తూ.. యంత్రాలకే మన జీవితం అర్పిస్తే మరి ప్రకృతిమాత ఒడిలో ఓలలాడి మనకు అన్నం పెట్టే వారెవరు..? కృత్రిమ పద్ధతులను రైతులకు అందేలా అర్థమయ్యేలా చేసి ఎందుకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయలేక పోతున్నాం. అరకొర విద్యుత్ సరఫరాలతో నీరులేక రైతులు అల్లాడుతుంటే మరి పంటలు ఎలా పండుతాయి. నిత్యావసరాల ధరలు నింగినంటుతుంటే సామాన్యుడు ఎలా జీవించాలి.అంతేకాదు మన అన్నపూర్ణలు నిండుకుని వెలవెల బోయి నీరసిస్తున్నాయి.కడుపు నింపుకోవడానికి కుటుంబాలను వదులుకొని అనుబంధాలను దూరం చేసుకొని పల్లె జీవన పసితనపు మాధుర్యాన్ని కోల్పోతున్నాం. మనుషుల

మమతానురాగాలు బంధాలు బలహీనమై అవసరాలకై అర్రులు చాస్తున్నాం... భారతావనికి పల్లెసీమలే వెన్నెముకలు అని చెప్పుకునే మాటలు మన ప్రగల్భాలేనా..? ఇలా అయితే మనజాతి మనుగడ ఎలా..? ఆరుగాలం కష్టపడ్డ అన్నదాత శ్రమను దళారులు నిలువునా కొల్లగొడు తుంటే పరిష్కరించే పథకాలు మనకు దొరకడం లేదా..?

ఓ..విజ్ఞులారా..! మేథావులారా..! గ్రామీణ సౌందర్యాన్ని పునరుద్ధరించి వెలవెలబోయే వారి జీవన విధానాలను మెరుగుపరిచి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించి.. ధాన్యపు సిరులతో ఈ ధరిత్రిని పులకింపజేస్తేనే... మళ్లీ మన భరతావని అన్నపూర్ణ అనిపించుకుంటుంది. రైతే దేశానికి వెన్నెముక అన్న సత్యాన్ని గుర్తించి ప్రతి పౌరుడు ముందుకుసాగాలి. ఉమ్మడి కుటుంబాలతో గుండెల నిండా సంతోషపు సంబరాలు గల మనగ్రామీణ జీవనం ఆనందపు సుగంధపు పరిమళాలతో శోభించాలి. దీనికోసం ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలి. ప్రభుత్వాలు ఆ దిశలో యోచన చేయాలి. మన రైతన్నలు ముసిముసి నవ్వులతో మురిసిపోవాలి. అంటే వారి ధాన్యాన్ని నేరుగా వారి నుంచే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- **దళారులు, మధ్యవర్తుల బెడద నుంచి తప్పించాలి.అంటే విత్తనాలను ఎరువులను సబ్సీడీతో నేరుగా ప్రభుత్వం అందించి రైతులను ఆదుకోవాలి.**
- **రైతుకూలీలను ప్రోత్సహించాలి. వివిధ పథకాలతో సేధ్యం నుంచి మళ్లించ కూడదు.**
- **వ్యవసాయం ఎంత ఉన్నతమైనదో, ఎంత అవసరమో రైతన్నలకు అర్థమ య్యేలా వివిధ కార్యక్రమాల ద్వారా వివరించాలి.**
- **వ్యవసాయ కూలీలను ఉత్సాహపరిచి వారిని ప్రోత్సహించాలి.**
- **వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వారి పరిశోధనలను రైతులకు తెలిసేవిధంగా వారికి చేరువలో వివిధ కార్యక్రమాల ద్వారా వివరించాలి. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి.**

వాటికి తోడు పాడి పరిశ్రమాభివృద్ధి గొర్రెలు, కోళ్లు, ఈమూ పక్షుల పెంపకంలలో మెలకువలు మరియు వాటి అవసరాలకు కావలసిన ఏర్పాట్లను అందించి ఆర్థికంగా వారిని ఆదుకొని వారికి జీవన పరిపుష్టిని చేకూరిస్తే మన అన్నదాతల జీవితాలలో చిరునవ్వులు విరబూస్తాయి. ఆ సుగంధపరిమళాలు మన జీవితాన్ని నందన వనంగా మారుస్తాయి. అందుకే త్వరగా ఆరోజు రావాలని ఆకాంక్షిస్తూ అన్నదాతలకు ఆత్మీయతతో వందనం.

-జైకిసాన్, జైహింద్

యం.మంగళ

ఇది స్వేచ్ఛాభారతమా..!

అసలు ఎక్కడున్నాము, ఎక్కడికి పరిగెడుతుంది మన నాగరికత, ఎటుపోతుంది మన సంస్కృతి ఏమైపోయాయి మన సంస్కారాలు స్వేచ్ఛాభారతంలో స్త్రీ జీవితం దుర్భరంగా మారి క్షణక్షణం భయంతో బీతిల్లి వణకాల్సిందేనా? "ఎక్కడ స్త్రీలు గౌరవించబడితే అక్కడ దేవతలు నడయాడుతారన్న" మన పూర్వికుల అమృత వాక్కులు వెర్రి వెకిలి తనాలతో మూసుకుపోయిన మన చెవులలోకి చేరడం లేదా? లేక అస్తమానం అశ్లీల దృశ్యాలను చూసి కళ్లు... పొర లెక్కాయా?

టి.వి సీరియల్లో, అసాంఘీక చలన చిత్రాలలో అశ్లీలాలను చూసి మనసులు ఊహలతో ఊరేగి... అస్తవ్యస్త దోరణులతో అనుకున్నవి జరుగక పోతే ఉన్మాదంతో చెలరేగడమేనా!

"ఆడపిల్ల అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం అన్నాడు బాపూజీ... అర్థరాత్రి కాదు పట్ట పగలు వెళ్లి క్షేమంగా యింటికి తిరిగి వస్తేచాలు అని ఆదుర్ధాపడుతున్నారు ఆడపిల్లల తల్లిదండ్రులు, ఒకప్పుడు పరపీడనంలో అనుభవించాము నేడు నవీన భారతంలో కరాళ నృత్యం చేస్తుంది ఈ కీచక ప్రవృత్తి, **లోపమెక్కడుంది పెంపకంలోనా..? ఆహారంలోనా..? విహారంలోనా..? వ్యాపారంకోసం స్త్రీని వస్తువులా అశ్లీల దృశ్యాలతో ప్రేమదోమలతో వెకిలి వేషాలు వేస్తున్న వినోద సంస్థలలోనా?**

తప్పులు చేసేవారు నిర్భయంగా తిరుగుతారు. కాని వారిని ఎదురిస్తే మళ్లీ ఏం చేస్తారో అని, లేక అందరికి తెలుస్తే బాగుండదంటూ నీరసపడి కూర్చుంటూ మనమే పిల్లల్లోని ఈ నీచప్రవృత్తిని పెంచుతున్నాం. పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పించేది ఏమో కాని బ్రతికుండగానే క్షణ క్షణం నరకం చూపించే ఆవేదనలో తోయకుండా వుండాలంటే?

మగ పిల్లలున్న తల్లిదండ్రులారా! కాస్త జాగ్రత్తగా వారిని గమనించండి వాళ్లు ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారో... అసలు కాలేజీకి వెళ్తున్నారో లేదో... తలవంపులు తెచ్చే పనులలో తలదూర్చుతున్నారా! వ్యసనాలకు బానిసలయి ఆకతాయిగా

"ఆడపిల్ల అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం అన్నాడు బాపూజీ... అర్థరాత్రి కాదు పట్ట పగలు వెళ్లి క్షేమంగా యింటికి తిరిగి వస్తేచాలు అని ఆదుర్ధాపడుతున్నారు ఆడపిల్లల తల్లిదండ్రులు ఒకప్పుడు పరపీడనంలో అనుభవించాము నేడు నవీన భారతంలో కరాళ నృత్యం చేస్తుంది ఈ కీచక ప్రవృత్తి, లోపమెక్కడుంది పెంపకంలోనా..? ఆహారంలోనా..? విహారంలోనా..?

తిరుగుతున్నారా! కాస్త గమనించండి. మగ పిల్లలే కదా! అని వీరిని స్వేచ్ఛగా వదిలేస్తే అన్యం పుణ్యం తెలియని యింకొకరి బిడ్డల జీవితాలను కలవర పెట్టి కలతలతో నింపేస్తారు. వారి నూరేళ్ల జీవితాలను చిందర వందర చేస్తూ...వీరూ...ఎందుకు కాకుండా భూమికి భారంగా బ్రతకవలసి వస్తుంది.

అందుకే మంచి చెడు విచక్షణ చెప్పండి, మనుగడకు కావలసిన సంస్కారాలను వారి హృదయాలలో నింపండి, నిజమైన స్వేచ్ఛ యితరులకు కష్టం కలిగించకుండా ప్రగతి పథం వైపు సాగిపోవడమే అని ఉగ్గుపాలతోనే నేర్పించండి, కుటుంబ వాతావరణాన్ని కలివిడితనాన్ని ఆహ్లాదాన్ని వారు అనుభవించేలా చూడండి.

చట్టాలు నీరసపడి సంస్కారాలకు తెగులు తగిలి రక్షకులే రాక్షసులై, తల్లి దండ్రులేమో పరువంటూ ప్రాకులాడితే... ఈపైశాచిక వృత్తి దావానంలా చెలరేగు తుంది స్త్రీలు భయంతో ప్రతిక్షణం రోదించాల్సి వస్తుంది. **ఆలోచించండి విజ్ఞులారా ఈ ఆవేదనకు అంతంలేదా?లేకపోతే** మన సమాజంలో స్త్రీ జీవితం దుర్భరమవుతుంది.

-జైహింద్



ఓ జనని భారతి సద్గుణస్వరూపిణి !
ఆడాడ పిల్లవని మా తల్లిదండ్రులు,
ఇంటిలో యంత్రంగా మెట్టింటివారు,
సంతలో వస్తువుగా వ్యాపారకేంద్రాలు,
ఏమి మిగిల్చావంటు మేము కన్నవారు,
ఏమిటీ ఈజన్మవింత జన్మ, ఎపుడు వెలిగిస్తావు ఆనంద జ్యోతి.

మహాత్ములారా... మౌనాన్ని వీడండి

"కులంలోన ఒకడు గుణవంతుడుండిన
కులం వెలయు వాని గుణం చేత"

అన్నట్లు ఒక కుటుంబంలో ఒకడు మంచి గుణం కలిగిన వాడు వుంటే వారి వంశం మొత్తం కీర్తిప్రతిష్టలతో అలరారుతుంది ఎవరికి మేలు జరిగినా జరగకపోయినా వారి కులం మొత్తం అతన్ని ఆదర్శవంతంగా తీసుకుంటుంది. అలాగే ఒకడు దుర్మార్గుడు, దుష్టగుణములు, కౄరస్వభావం కలిగినవాడు వుంటే వాడిప్రభావం సమాజం మీద పడుతుంది. వాడి నుండి సమాజం దూరంగా వుండాలని ప్రయత్నిస్తుంది. అందరు వాడికి, వాడి ప్రవర్తనకు దూరంగా వుంటారు. వాడివలన కొందరికి నష్టముండవచ్చు కాని శ్రేష్టుడైన వాడు సద్గుణ వంతుడు ఉత్తమ లక్షణాలు కలిగిన వాడు కుటుంబంలో వుంటే ఆ కుటుంబమే కాదు ఆ సమాజమంతా అతనిని అనుసరిస్తుంది. అతనే కనక నాయకుడైతే అతని ప్రతి ఆలోచనను ప్రజలంతా ఆచరణలో పెడుతారు. స్వచ్ఛభారత్ పేరుతో మన ప్రధానమంత్రి గారి ఆలోచనను ప్రజలంతా ఆదరించి ఆచరించడం ఎంతో హర్షణీయం సమాజంలోని దుర్గందాలను తొలగించి పర్యావరణ పరిరక్షణకై మేము సైతం అంటూ ప్రతి ఒక్కరూ నడుం బిగించి, ఆరోగ్య భారతం కోసం అందరూ మేమున్నాం అంటూ చేయి కల్పడం ఎంతో హర్షణీయం బాహ్య దుర్గందాలను శుభ్రపరచి ఆహ్లాదకరమైన వాతావరణం పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాం.

సరే... మరి అంతరంగిక దుర్గందాలను పెంపొందించే ప్రకటనలను, యువతను పెడదారి పట్టించే పోస్టర్లను సినిమాలను మనం ఎందుకు చూసి చూడనట్లు పట్టించుకోనట్టు ఉంటున్నాం వ్యసనాలకు బానిసలను చేసి జాతిని దుర్గందపూరితంగా మార్చే అస్థవ్యస్థ పరిస్థితులను, కల్లోలపు కల్మష హృదయాలలో పేరుకుపోయిన మలిన దుర్గందాలను శుద్ధి చేసే కార్యక్రమాలకై ఎందుకు ఈ విషయంపై ఆలోచించరు, ఎందుకీ మౌనం.

అంతరంగలో అలజడులను రేపే అసుర స్వభావాలను ఎదుర్కొనే సద్గుణాలను,

సచ్ఛీలతను పెంపొందిచే లక్షణాలను అందరికి అందించి, సమాజ శ్రేయస్సును స్వచ్ఛతను తర తరాలకు అందించడానికి శ్రేష్టులైన మహాత్ములు ముందుకు రావాలి **"ఒక దుర్మార్గుని చేష్టల కంటే ఉత్తముని మౌనం ఎంతో ప్రమాదకరమైనదని"** ఆర్యోక్తి అందుకే ఓ మహాత్ములారా మౌనం ఎందుకు భరతమాత మీ ముద్దు మాటలు వినాలని, మీరు చేసే పవిత్ర కార్యాలను గాంచాలని ముచ్చట పడుతుంది. ప్రపంచం కల్లుతెరువక ముందే పరమార్థాన్ని వివరించి,మంజుల జీవనంలోని మధురిమను మన వేద సంస్కృతిలోని సచ్ఛీలతను వివరించి సమాజ శ్రేయస్సుకు అంతరంగం లోని సంస్కారాలు, బావ శుద్ధి ఎలా తోడ్పడుతాయో, భాద్యతా యుతమైన జీవనానికి ఉత్తమ గుణాలు ఎలా ఉపకరిస్తాయో మీరే చెప్పాలి, గుణశ్రేష్టులైన మీరు మౌనం వహిస్తే... మార్గగాములు ఎవరు? అందుకే మహాత్ములారా జ్యాతి ఖ్యాతిని నిలపండి మనపూర్వికుల హృదయాలలో ఆనందాన్ని నింపండి, మౌనం వీడండి.

-జై హింద్

తెలుగు తల్లి తేజోమయి

పల్లవి :
భరతమాత తేజోమయి
వెలుగు నింపు దివ్వెలం
నవభారత నిర్మాణపు
నాందికి తొలిమెట్టులం॥నాంది॥
మేమే చిన్నారులం
మేమే మీ నవ్వులం ॥2॥

చరణం1:
ప్రాజెక్టులు ఎన్నో కట్టి
పచ్చదనం నింపెదము
పల్లెలేను భరతావని
వెన్నెముకని చాటెదము॥మే॥ ॥భ॥

చరణం2 :
మానవతను మదిని నింపి
మహొన్నత శిఖరమెక్కి
అన్నిరంగములలో మాకు
మేమే సాటని చెప్పి
విజ్ఞానపు పందిరిలో
విశ్వజ్యోతులెలిగించే ॥2॥ ॥మేమే॥

చరణం3:
బాపూజీ కలలుగన్న
సామ్రాజ్యం నిర్మించి
నెహ్రూజీ కాంక్షించిన
జాతిని నెలకొల్పేటి
దీక్ష మేము పట్టినాము
దీవించుడీ పెద్దలారా !॥దీ॥
॥మేమే॥॥భ॥

అమ్మే కినుక వహిస్తే...

అవనిలోని దేవత అమ్మే ...

ఆ దేవుడు అందరికి అమ్మలా వచ్చి ఆలనా పాలన చూస్తాడని, ప్రతి ప్రాణికోటికి అమ్మ ఆరాధ్యదైవమని పురాణాలే కాదు పురాణపురుషులు కూడా చెప్పారు.

కంటికి రెప్ప వున్నా లేకున్నా పరవాలేదేమో కాని కన్న తల్లి కరువైన జీవితాలు కడలిలోని అలల్లాగ కల్లోల పడాల్సిందే, కన్నీటి సంద్రములో ప్రతి క్షణం కలవర పడాల్సిందే, అణుక్షణం కన్నవారి శ్రేయస్సుకై తపిస్తూ అన్నింటిని త్యాగం చేస్తూ... కష్టాలలో, కన్నీటిలో, కలతల్లో, కలవరాలలో కడుపుతీపిని నింపుకుని ఎంతటి దుఃఖ సాగరాన్నైనా గుండెల్లో దాచుకుని చిరునవ్వుతో తనబిడ్డల తలనిమురుతూ ఒడిలో దాచుకుని జోలపాడి నిదురపుచ్చే అనురాగ ఆత్మీయ దేవత అమ్మంటే! ఈమె అణుక్షణం చేసే త్యాగాలతో శిఖి,దధీచిని కూడ మించి పోయిందంటే సందేహం లేదు. అమ్మ ప్రేమకు, అమ్మఒడిలోని హాయికి వెలకట్టడం ఎవరి తరం ఆమె గోరుముద్దల రుచికోసం భగవంతుడు కూడా అవతారాలు ఎత్తుతాడు అంది అమృత కలం.

కన్న బిడ్డలకు కల్పవృక్షమయి, అయిన వారికి అమృతమూర్తి అయి గృహదేవతగా శోబిస్తూ ప్రతిక్షణం తన బిడ్డ అత్యున్నత స్థితిలో వుండాలని, అందరు మెచ్చే సంస్కార సుఘందంతో గుభాళించాలని, బిడ్డ తప్పటడుగులకు చేయూతనిస్తూ, తప్పులను దండిస్తూ...ఆశయాలకు ప్రాణం పోస్తూ ఆధర్శాలను ప్రోత్సహిస్తూ సంతసంతో సంబర పడి పోతూ, మన వల్ల కలిగిన అవమానాలను, చీదరింపులను గుండెల్లో దాచుకుని చిరునవ్వుతో పలుకరిస్తుంది అమ్మ, మనం కన్పిస్తే వేవేళ వుషస్సుల శోభ తనలో నిండినట్లు ఆనందంతో పొంగి పోతుంది.

బిడ్డ తప్పటడుగులకు చేయూత నిస్తూ, తప్పులను దండిస్తూ... ఆశయాలకు ప్రాణం పోస్తూ ఆధర్శాలను ప్రోత్సహిస్తూ సంతసంతో సంబర పడి పోతూ, మన వల్ల కలిగిన అవమానాలను, చీదరింపులను గుండెల్లో దాచుకుని చిరునవ్వుతో పలుకరిస్తుంది అమ్మ, మనం కన్పిస్తే వేవేళ వుషస్సులశోభ తనలో నిండినట్లు ఆనందంతో పొంగి పోతుంది.

యం.మంగళ

మరి యిలాంటి అమ్మను ఆరాధ్యదేవతగా పూజించాల్సింది పోయి అవసరం తీరినాక రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరిపోయి ఆసరాగా ఉండవలసిన సమయంలో అనాదలను చేసి, ఏమిచ్చావు ఏది నీసంపాదన అంటూ నిలదీస్తూ నిందల పాలు చేస్తే బిడ్డల్లారా... **అమ్మె కనక కినుక వహిస్తే నీకు నిలువ నీడ వుండదు. ఆమె మమతల సరోవరంలో కల్లోలం సృష్టిస్తే నీ భవిష్యత్తు అల్లకల్లోలం కాదా..!**

ఆలోచించండి ఆమె మీ మదిలో ఆనందాన్ని నింప డానికి చేసిన త్యాగాలను ఒక్క సారి గుర్తు చేసుకోండి. మీ ఆకలి దప్పులకై అనారోగ్యాన్ని కూడా లెక్కపెట్టని అమ్మ సహనాన్ని... లెక్కచేయని రోగబాదలోని ఆమెప్రేమను ఒక్కసారి గుర్తుచేసుకోండి. రాజ్యానికి రాజైనా తల్లికి బిడ్డే కదా..! ఆ మమతలో తేడా ఎక్కడుంది నీ స్థాయి పెరిగినంత మాత్రాన అమ్మను మరుస్తావా... నీ సంపాదనలో అమ్మ బారమయిందా...కన్న తల్లిని కన్నీరు పాలు చేసి ఆమె మనస్సును చివుక్కుమనిపిస్తే... ఓ బిడ్డల్లారా! మీకు మనగడే లేదు ముందు తరాలు మీకూ స్వాగతం పలుకుతాయి తస్మాన్ జాగ్రత్త !

- జైహింద్

మధురమైన మమత అమ్మ

మల్లి మల్లి మనసు పలికే
మధురమైన మమత అమ్మ
కొసిరి కొసిరి కల్లు కనే
కమ్మనైన కలయె అమ్మ
వేచి వేచి చెవులు వినే
యింపైన సరాగం అమ్మ
తలచి తలచి మది పరవశించే
మధురమైన తలపే అమ్మ
గుండె గుడిలో జ్యోతి అమ్మ
మండటెండలో వెన్నెల అమ్మ
అకలేస్తే అన్నం అమ్మ
కోపమొస్తే శాంతి అమ్మ

నా శ్వాసలోన ప్రాణం అమ్మ
నా ద్యాస లోన రూపం అమ్మ
నా మాటలోన మంత్రం అమ్మ
నా ప్రగతిలోన దీపం అమ్మ
నా బాధలో ఓదార్పు అమ్మ
నా పెదవిపై చిరునవ్వె అమ్మ
క్షణ క్షణంతో అమ్మ కలిసి
అల్లిన అందమైన నా జీవన
సుమహారమె అమ్మ
అందుకే ఆ అమ్మకు
అంకితం... నాజీవన ప్రతిక్షణం.

మహనీయులకు వందనం

ఎందరో మహాత్ములు, ఎందరెందరో త్యాగధనులు స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు అందరూ... అందరూ నడుం కట్టారు. ఏక తాటిపై నడిచారు. ఆనాడు మన జాతిని 200సం॥ పట్టి పీడించిన పిశాచంను పారద్రోలడానికి రవి దూరని గాఢాందకారం నుండి విముక్తిని పొందడానికి ఆ బ్రిటీష్ పరిపాలనను తరిమి కొట్టడానికి, జాతికి స్వేచ్ఛను ప్రసాదించడానికి, ఎంతో త్యాగం చేసారు మన వీరులు, త్యాగమయులు. ఆ పీడకలను మరచి వారు పీల్చిపిప్పిచేసిన మన వ్యవస్థను ఎంతో శ్రమ, కృషి పట్టుదలతో పునర్జీవింపజేసి, అన్నింటిలో భారతజాతి మేటి అనిపించుకునేలా నిలబడ్డాము. మన వెలుగులు విశ్వవ్యాప్తం చేసాము.

కాని యింతలోనే కలికాలం కోరలు విప్పింది కల్మష హృదయాలు కల్లోలాలను సృష్టిస్తున్నాయి. తలదించుకునేలా చేస్తున్నాయి. మన సంస్కృతికి మచ్చ తెచ్చే ఈ స్వయం పీడితం నుండి విముక్తిని పొందడం ఎలా? ఈ అవినీతి అత్యాచారాలను కూకటివేళ్ళతో పెరికి పారేయలేమా!

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో యింతటి దౌర్భాగ్యస్థితి ఎందుకు ఏర్పడింది. ఈ పక్షపాత గాఢాందకార మేఘాలు ఎందుకు అలుము కున్నాయి.

ఎందుకంటే మనలో చైతన్యం లేకపోవడమే కారణం, అంతేకాదు నాకెందుకులే అని ఊరుకోవడమే అసలు కారణం, ఐక్యమత్యం లేకపోవడం ముఖ్యకారణం, కారణాలను ఎదురించి అందరూ నిలదీయక పోవడం అత్యంత ముఖ్యకారణం కాదా...!

మనజాతిని నిర్వీర్యం చేస్తూ మనకు తలవంపులు తెచ్చే ఈ కుటిల కీచక ప్రవృత్తులను ఎదుర్కొవడానికి మనమంతా నడుం బిగించాలి. అహర్నిశలు వారి సర్వస్వాన్ని త్యాగం చేస్తూ మనకు స్వేచ్ఛా వాయువులను అందిస్తున్న మన రక్షక వ్యవస్థను చూసైనా... ఆలోచించైనా...! మనం ముందుకు నడవాల్సిన బాధ్యత వుంది.

"కలికంటికంట కన్నీరొలికిన సిరియింట వుండనొల్లదు" అని ఢంకా వాయించి ధన పిశాచాలను సైతం హెచ్చరించి చెప్పారు మన పూర్వీకులు.

కన్నీరు కాదు గుండెలు పగిలేలా స్త్రీలు రోదించినా ఈ కరడుకట్టిన సమాజంలో కరుణ పుట్టడం లేదు. చైతన్యం రావడం లేదు.

రాజారామ్మోహనరాయ్, కందుకూరి వీరేశలింగం గార్లు తదితరుల స్ఫూర్తి మళ్ళీ రావల్సిన ఆవశ్యకత నేటి సమాజంలో వుంది. మనమంతా ముందుకు నడిచి జాతికి పట్టిన ఈ రుగ్మతలను రూపుమాపాల్సిన అవసరం చాలా వుంది అన్న సత్యం ప్రతి భారతీయుడు విధిగా భావించి తక్షణమే కర్తవ్య దిశగా సాగాలి. అప్పుడే ఈ భరతమాత కళ్ళల్లో తృప్తిని చూడవచ్చు భారతీయునిగా తల ఎత్తుకుని జీవించవచ్చు. అందుకే తక్షణ కర్తవ్యంగా మనమంతా ఈ యజ్ఞ నిర్వహణలో ముందుకు నడుద్దాం మనజాతి గౌరవాన్ని నిలబెడుదాం. అవినీతి అక్రమాలు విలయతాండవం చేస్తున్నాయి. కాసులలోనే కలికాలం కూరుకుపోయింది - విద్య కాసులే... వైద్యం కాసులే, తిండికి కాసులే (బతుకు భారమే) యిలాంటి రుగ్మతలలో ఎలా ఎగురుతుంది (మన జెండా) త్రివర్ణ పతాకం రెపరెపలాడుతూ..! స్వేచ్ఛా జీవనం ఎక్కడుందని భారతీయునిగా ఎగురవేయాలి మన జెండా... చెప్పండి. నారోజు బాగుంటే చాలనిపించే వ్యక్తిత్వమా భారతజాతిది? కాని అలాంటి పిశాచమే పిట్టింది నేడు మనజాతికి... ఎలా తరి మేయాలి... ఎవరు మొదలుపెడుతారు, ముందు తరాలకు...



ఏమిస్తారు. ఏం మిగిలిస్తారు... వాతావరణ కాలుష్యమే కాకుండా విదేశీ వ్యామోహాలతో మన జాతి గౌరవాన్ని కించపరిచే సంస్కృతి సాంప్రదాయ కాలుష్యాన్ని... ఆహారపు కొరతనే కాకుండా...? ఆత్మీయులకు ప్రేమను పంచలేని... హృదయ దౌర్భాగ్యాన్నా...? అవినీతి అక్రమాలతో కూరుకుపోయిన - అధర్మ రాజనీతినా, వేదగర్భ అయిన మన జనని వెలవెలబోతుంది. ఆమె గౌరవ చిహ్నమయిన త్రివర్ణ పతాక చిహ్నంలోని గౌరవాన్ని ఎలా కాపాడాలో...ఆలోచించండి... భారతీయులారా... ఒక్కక్షణం,ఒక్కక్షణం ఆలోచించండి. **ఆ తర్వాతే ఎగురవేయండి మన జెండా..!**

జై హింద్!

మాతృభూమి శ్రేయస్సుకై పాటుపడుదాం

ఆగష్టు మాసం రాబోతుందంటనే భారతీయుల హృదయాలలో తెలియని ఆనందం ఆహ్లాదాన్నిస్తుంది. స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలకై చిన్నలు, పెద్దలు అందరం సన్నద్ధుల మవుతాం ముచ్చొన్నెల పతాకాన్ని నింగిలోకి ఎగురవేసి గుండెనిండా భక్తితో వందనం సమర్పిస్తాము. మనకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించి స్వేచ్ఛావాయువులను ప్రసాదించిన త్యాగదనులకు కృతజ్ఞతతో ప్రణామాలు అర్పిస్తాం. బ్రిటీష్ వారు ఆశ్రితులై వచ్చి మనసంపదను, సౌభాగ్యన్ని చూసి, విషపు నాగులై అదను చూసి మనలో మనకే చిచ్చురేపి పరిపాలనను చేతుల్లోకి తీసుకున్నారు మన జీవన విదానాలను అస్థవ్యస్థం చేసి, అరాచకాలను సృష్టించి,మన సంపదలను కొల్లగొట్టి, అఘాయిత్యాలతో, అక్రమాలతో వారి ఉక్కుపాదాలతో నలిపేసారు, 400 సం॥ రక్తపిశాచాల్లా పట్టి పీడించారు, రత్నగర్బ వేదమాత అయిన మన భరతావనిని దోపిడీ దొంగల్లా దోచుకున్నారు ఆ రాక్షసులు, కాని **ప్రఛంఢంగా ప్రజ్వలించే ప్రభాకరున్ని మేఘాలు అడ్డుకుంటాయా... సాగర జలాలను అరచేతిలో భందించడం ఎవరితరం ,వీరమాత, భాగ్యరాశి అయిన భరతావని బందీగా వుండడమా... శౌర్య, ప్రతాపవంతులైన బిడ్డలనుకన్న తల్లికి బానిసత్వమా... అందుకే యోగాగ్నిలా ప్రజ్వరిల్లారు సామ,దాన,బేద,దండోపాయాలతో ఉద్యమించారు, ప్రతిఘటించారు.**

మహాత్ముని నాయకత్వంలో అహింసామార్గంలో తిరుగుబాటు మొదలయితే, ఆక్రోశం కట్టలుతెగిన భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, సుభాశ్ చంద్రబోస్ తమదైన రీతిలో వారి గుండెలో ఫిరంగులు పేల్చారు వారి కంటికి కునుకు రానీయకుండా... మర్యాధగా యిస్తారా... తరిమికొట్టాలా అన్న విదంగా తెల్లదొరలను నినాదాలతో, సత్యాగ్రహాలతో ర్యాలీలతో నిద్రాహారాలు మాని **స్వాతంత్ర్యం మాజన్మ హక్కు** అని అందరూ తీర్మానించుకొని మరీ నడుం బిగించారు, ఎన్ని మారణహొమాలు, బలిదానాలు జరిగినా వెనకంజ వేయలేదు, వారి పైశాచిక కోరలనుండి విముక్తిని పొందేవరకు ఆగని పోరాటంలా సాగించారు, క్విట్ యిండియా అంటూ వారిని తరిమేసి మనకు స్వేచ్ఛా వాయువులను అందించారు. ఆ మహానీయుల త్యాగనిరతి నిర్విరామ, నిరంతర కృషి, శ్రమ ఫలితమే నేటి మన స్వేచ్ఛా జీవనం, అల్లకల్లోలం చేసిన మనజాతిని ఒక కొలిక్కి తీసుకువచ్చి మనకు యిలాంటి సౌకార్యాలు అందించడానికి వారు పడిన శ్రమకు ఏ విలువ

కట్టగలం. మరినేడు మనమూ... నిరంతరం శ్రమ పడుతున్నాం, కాని ప్రతిక్షణానికి పైసా రూపంలో విలువకడుతున్నాం నాకేం వస్తుంది, నేనెలా సంపాదించాలన్న స్వార్థపూరిత సంస్కారాలతో కుల్లిపోయి, మాటలకు కూడ విలువ కట్టి మూటలకై తపిస్తున్నాం, వ్యసనాలకు భానిసలమై హృదయాలను కుచింపజేసుకుని అవినీతి అక్రమాలతో ఊరేగుతున్నాము... ఆనాడు పరపీడితులమై విలవిలాడుతే , నేడు స్వయం పీడితులమై వికటాట్ట హాసం చేస్తున్నాం. ప్రతిక్షణం మనను మోసే మాతృభూమి ఋణం ఏమిచ్చి తీర్చుకోగలం. క్షణం ఆగితే సాగని మన ప్రాణదాత పవమానుని(వాయువు) నిస్వార్థ సేవకు ఎంత విలువ కట్టిస్తావు. ఏమొస్తుంది? మాకెందుకు అన్న ఆలోచన ఆనాడు మన వారికుంటే ఈనాడు యిలా నేడు మనజీవనం సాగేదా...! నాడు మన పూర్వికుల హృదయాలలో నాదేశం, నాఊరు, మాకుటుంబం అనే బావన వుండేది. అందుకే వారి విశాల హృదయం విశ్వవ్యాప్తమై, ప్రగతి కొరకై, మాతృభూమి శ్రేయస్సుకై పాటుబడింది.

మరి నేడు..! నేను,మా కుటుంబం, పెళ్లయితే నా కుటుంబం అనే సంకుచిత బావనలతో హృదయాలు కుచించుకు పోయాయి స్వార్థ పూరితమై సమాజ శ్రేయస్సు కుంటు పట్టిపోయింది. క్షణమొక గండంగా గడిపి మనకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించి యిస్తే... మనం స్థార్థంకై జీవినాన్ని సాగించడమా... అసలు మనం భారతీయుల మేనా..? భరతమాత బిడ్డల రక్తంలో యిలాంటి భావనలా... అని ఎవరికి వారే ప్రశ్నించుకుని వీరుల త్యాగాన్ని స్మరించుకుని,జవానుల ఆత్మార్పణను గుర్తుకుచేసుకుంటూ బాద్యతగా జీవిద్దాం, భరతావనిని భాగ్య రాశిగా మమతల మందాకినిగా ధర్మానికి ప్రతిరూపంగా న్యాయానికి ప్రతీకగా, ప్రతిభకు సాటిగా అన్నింటిలో మేటిగా నిలుపుదాం.

–జైహింద్

అంతరిక్షమున ఎగిరే ఓ స్వేచ్ఛావిహారిణి...
ఓ త్రివర్ణ పతాకమా
అందించుము సందేశము అమర వీరులందరికీ
...త్యాగ మూర్తులందరికీ
వినిపించుము మా దుస్థితి వీర పుత్రులందరికి
...వీరమాతలందరికి
కాపాడగ రమ్మను ఈ స్వయం పీడితం నుంచి



ఎన్నాళ్లీ కీచక వృత్తి..?

ఓ జననీ భారతీ సద్గుణ స్వరూపిణీ..
ఎందుకిచ్చావమ్మా.. ఈ జన్మ
ఎపుడు వెలిగిస్తావు.. ఆనందజ్యోతి
అని ప్రతి భారత స్త్రీ ఆర్తనాదాలు చేసే సమయం
ఆసన్నమయిందా.. అన్న ఆలోచనలు రాక పోలేదు..

"కలకంటి కంట కన్నీరొలికిన సిరియింట నుండ నొల్లదు" అని శాసనంగా పెట్టుకుని, స్త్రీని దేవతగా ఆరాధించే మన జాతియేనా.. యింతటి ఘోరాలకు పాల్పడింది. కలకంటి కన్నీరుతోనే తన దినచర్యను మొదలుపెడుతూ.. కర్కశహృదయులై కీచకుల్లా విలయతాండవం చేస్తున్నారు,భారత స్త్రీ జాతి మనుగడను దుర్భరం చేసి పైశాచికంగా చిందులు వేస్తున్నారు.

యిదేమి చిత్రమూ. మా జన్మ భూమిలో మేము తిరగలేము... మనుగడ సాగించలేము.. జన్మనిచ్చే మాకే యిలాంటి దౌర్భాగ్య స్థితి అయితే యిక ఈ జాతి మనుగడ ఎలా వుంటుందో.. ఆలోచించండి...!

హరి...హరీ..! అలనాడు ద్రౌపదిని అవమానించిన అదే నీచప్రవృత్తి యింతింతై అన్నట్లు సమాజంలో ప్రాకుకుపోయిన ఆ విషపు కోరలు స్త్రీ వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని చిదిమి నలిపి వేస్తున్నాయి. మరో భారతం ప్రతి స్త్రీకి ఎదురయ్యింది. ఈ దుర్భర సమాజంలో స్త్రీకి రక్షణ కొరవడింది. కారణాలు ఏవైనా ఈ కీచక వృత్తికి అంతం లేదా!

అయ్యో! కలికాలం అంటే యిదా! సమాజోన్నతికై అన్ని రంగాలలో అహర్నిశలు మేము చేసే కృషి అమోఘం అని చెప్పకనే చేసి చూపెడుతున్నామే. యిదా మీరు మాకిచ్చే సత్కారాలు.. ఓ పురుషాధిక్య సమాజమా! కళ్లు తెరువు, జాతి సిగ్గుపడేలా..! ప్రవర్తించకు. ధనార్జనకై విలాస వస్తువుగా స్త్రీని మార్చిన సినిమా రంగం, వ్యాపారంలో యంత్రంగా మార్చిన యజమానులు, స్వార్థానికై సెంటిమెంటు పేరుతో విలయతాండవం చేస్తున్న కుటుంబ వ్యవస్థ. విదేశీ సంస్కృతులతో వెర్రెక్కి ఊగుతున్న నేటి తరానికి ఈ సినిమా రంగం అగ్నిలో ఆజ్యం పోస్తున్నట్లుగా అశ్లీలాన్ని అందించి రెచ్చగొడుతోంది. దీంతో రాక్షస ప్రవృత్తులు విలయతాండవం చేసి అత్యాచారాలు - అశ్లీలాలతో మానవ మృగాలుగా మారుతున్నారు అన్నది నిత్య సత్యం కాదా! జాతిని తలదించుకునేలా చేసే ఈ పనులను ప్రోత్సహిస్తూ క్యాండిల్స్ పట్టుకుని తిరిగితే సరిపోతుందా! ప్రతి స్త్రీ తన యింట్లో ఆఫీసులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచే ప్రవృత్తిని ఎదురించే సాహసం చేస్తే అణగారదా..! ఈ ప్రవృత్తి. స్త్రీ సహజ

సౌందర్యాన్ని, విప్పి బజార్లో ఆరబోసే అశ్లీల దృశ్యాలను, ప్రొద్దున్నే శుభోదయం అంటూ మన యింటికి వచ్చే పత్రికల్లోని ప్యాషన్ అంటూ పలకరించే అశ్లీల దృశ్యాలను చూసి చూడనట్లు వదిలేయకుండా నిలదీయలేమా..! భారతీయతను తలదించుకునే ఈ భాగోతం గురించి ఎందుకు పట్టించుకోరూ..! మనమే కదా ప్రోత్సహిస్తున్నాం ప్రదర్శనలు కాదు, కారణాలను కూకటి వేళ్లతో పీకేద్దాం. కొవ్వొత్తులను యిలాంటి దృశ్యాలను అంతం చేయడానికి వాడుదాం. మహిళలు అధికారంలో వున్నంత మాత్రాన ఈ సమస్యలు తీరవు. సమాజంలో సమస్యలకు కారణాలైన (కలుపు) విషపు కలుపు మొక్కలను పీకి తగులబెట్టినప్పుడే కాస్త దారిలోకి వస్తుంది. యిది అందరూ చేయవలసిన పని. అందుకే ప్రతి ఒక్కరూ.. నా కెందుకులే అని కాదు, నేనెందుకూ చూస్తూ ఊరుకోవాలి అని ప్రశ్నించుకొని నిలదీయాలి. ఉద్రేకాలను, అశ్లీలతను, దుర్వ్యసనాలను ప్రోత్సహించే సంస్కృతి మనది కాదు. అలాంటి వేష, భాషలు మనజాతికి శోభ కాదు. జ్ఞానదృష్టితోనే సకల శాస్త్రాలు మనకందించిన మహనీయుల బిడ్డలం. వారి సంస్కృతుల్లో పయనించే బాధ్యత మనది. మన అందరిది. ఈ గాలిని పీల్చే ప్రతి బిడ్డడు ఆలోచించాలి. ఈసమస్య ఒక నిర్భయది కాదు.. ప్రతిరోజు జరిగే దౌర్భాగ్య సంఘటనలన్నింటికి కారణం మన జీవన విధానం, ఆలోచనా విధానంలో మార్పు మాత్రమే. సభ్య సమాజం తల ఎత్తుకోలేని విధంగా అభం,శుభం, తెలియని చిన్నారులని కూడా చూడకుండా అఘాయిత్యాలకు పాల్పడి, మన జాతి మనుగడకు తలవంపులు తెచ్చే ఈ నీచ ప్రవృత్తిని అంతం చేయడానికి అందరూ ముందుకు రావాలి. మూలాలను పెరికి దగ్ధం చేయాలి.

స్త్రీ అర్ధరాత్రి నిర్భయంగా తిరుగగలిగిన నాడే నిజమైన స్వాతంత్ర్యమని మన బాపూజీ ఆనాడే చెప్పాడు. కానీ అర్ధరాత్రి వచ్చింది స్వాతంత్ర్యం యింకా తెల్లవారనేలేదు. పైగా పగలు కూడా గాడాంధకారం నెలకొని స్త్రీ జీవితాన్ని చిందర వందర చేస్తుందే... ఏమిటీ దౌర్భాగ్యం. పరపీడన నుండి ఆనాడు మహనీయులు నడుం బిగించి విముక్తిని ప్రసాదించారు. మరి నేడు స్వయం పీడితం నుండి రక్షణ పొందడానికి ఉద్యమించాల్సిన అత్యవసరం వచ్చింది.

ఓ మహిళా..! లే ఉద్యమించు.. ఓ దేశ ప్రేమికులారా ప్రతిఘటించి ఈ సామాజిక జాఢ్యాల మూలాలను పెకిలించండి,ఈ అనాగరికతను తరిమి వేయండి, ఈ పైశాచిక ప్రవృత్తిని పాతర వేయండి. ఓ మహాత్ములారా రండి ముందుకు మన జాతి వైభవం వెల వెల పోతోంది. సంస్కారపు జ్యోతులను వెలిగించి, అకృత్యాలకు కారణమైన వాటిని ఎదిరిద్దాం. ఈ ప్రేమోన్మాదం, కామోన్మాదం, గృహ హింస, వరకట్నం, బానిసత్వం, వ్యర్థంలేని చలోక్తులు, అర్థంలేని సంభాషణలు స్త్రీని, ఆమె వ్యక్తిత్వాన్ని బంతి ఆడినట్లుగా ఆడుకుంటున్నారు.

ఓ భరతమాత ముద్దుబిడ్డలారా! ఆలోచించండి, వీటిని, ఈ ప్రవృత్తిని అంతం చేయలేమా..?

-జైహింద్

పుట్టిన రోజు...

భలే మంచి రోజు

పసందైన రోజు...వసంతాలు పూచే నేటి రోజు... అంటూ ప్రతి ఒక్కరు తమపుట్టిన రోజును ఎంతో పవిత్రంగా బావించి ఆనందంగా అందరి ఆశీస్సులను పొంది బందు మిత్రుల మధ్య భగవంతుని కృపను పొంది గడపాలనుకుంటారు. దీర్ఘాయుష్మంతులై దినదినాభివృద్ధితో యశోకీర్తి ప్రతిష్టలతో నిత్య సంతోషంతో వర్ధిల్లాలని ఆశిస్తారు. అందుకే ప్రాభాత సమయంలో మేల్కొని మంగళ స్నానంచేసి, యిలవేల్పుకు ప్రణమిల్లి, అతని పాదాలచెంత జ్యోతి వెలిగించి తన జీవితంలో, తమ బిడ్డల జీవితాలలో ఆనంద జ్యోతులను వెలిగించమని అర్చించి,పూజించి... నైవేద్యాలర్పించి... హారతులిచ్చి ఆశీర్వచనములు పొందే వారు, ఆ ఆహ్లాదం సంతోషంతో తమ జీవితంలో నూతన వసంతం లోకి అడుగు పెట్టేవారు, ధాన ధర్మాలు చేసి శోభిల్లేవారు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేవారు మన పూర్వికులు. వారు మన కందించిన పవిత్ర సంస్కృతి. యిది నాటి సంగతి మరి నేడు ప్రాశ్చాత్య సంస్కృతులనే పురుగులు మన పుర్రెలను తొలిచి మన ఆలోచనలను భ్రష్టు పట్టించి, మన అంతరంగాలలో తిష్టవేసాయి. యింకేం చేస్తాం మాడరన్ లైప్... దీపాలను ఆర్పి కత్తులతో కేక్‌లను కట్ చేసి అర్ధరాత్రి వెర్రి కుక్కల్లా ఎగురడం అదే సంబరం అనుకోవడం నేటితరం ప్యాషన్ .

అదేంటో సామాన్యులు సైతం కేక్ కోయక పోతే మా పిల్లల పుట్టుకకు సార్థకతే లేదు అనుకుంటున్నారు. అంతే కాదండోయ్ కాస్తపిచ్చి ముదిరితే ఈవెంట్ మేనేజర్స్‌కి చెప్పడం సాయంకాలం పార్టీ ఏర్పాటు చేయడం. అక్కడికి వెళితే ఆఈవెంట్ మేనేజర్స్ ఈవెంట్స్ గేమ్స్ ఎలా వుంటాయంటే... పిల్లలతో కుప్పిగంతులు మీనాన్న జేబులో సెల్ ఎవరు ముందు తెస్తే వారికి ప్రైజట, అమ్మ ప్యాకెట్‌లో రూపాయి బిల్ల తెచ్చిన వారికీ ప్రైజ్, యిలా రకరకాల పిచ్చి ఆటలు యిక ఆడవాళ్లకేమో యిష్టమయిన వంట ఏంటని, నీకు ఏ సీరియల్ యిష్టమని యిలా తలా తోక లేని ప్రశ్నలు అవన్నీ చూస్తూ మనం గడపాలి.

అసలు పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందించే విషయాలు ఏమీలేవా! మరుగున పడిపోతున్న మన సంస్కృతికి మెరుగులు పెట్టేవిదంగా ఈవెంట్స్ వుండేలా చేయవచ్చుకదా?

మహోత్కృష్ట చరిత్ర కలిగిన మన పురాణాల గురించి అడగొచ్చుకదా! నీతి కథలతో ఆలోచనా శక్తిని, పద్యాలతో యుక్తిని, మన సంస్కృతి సాంప్రదాయాల ఘణతను చాటి చెప్పే విధంగా ఎందుకు ఉండవు ఈ పార్టీలు. మహాత్ములను స్మరించి వారి దీవెనలు పొందే విదంగా చేసుకోవాలి. పిల్లలు సరే పెద్దలకు ఏమైంది తొంబై ఏళ్ళు వచ్చినా యిదే సరదా! పైగా గొప్పలు,కుప్పి గంతులు ఎటు పోతుంది మన నాగరికత ! ప్రపంచమంతా మనవైపు చూస్తుంటే మనమేంటి మన శ్రేయస్సును పెంచే శుభకరలక్షణాలను వదిలి యిలా ప్రాశ్చాత్యాలకై వెంపర్లాడటం మానేస్తే మనవునికిని కాపాడుకున్న వాళ్ళమౌతాం. మనఆనందానికి, ఆరోగ్యానికి శ్రేయస్కరం పుట్టిన రోజు మనకు నిత్యానందాన్ని యివ్వాలి, అందరి దీవెనలు పొందాలి.ఋషి బిడ్డలమై వెలుగాలి. -శుభం.

ఎటుపోతున్నాం మనం

ఎటుపోతున్నాం మనం
ఏమైపోతుంది మన సంస్కృతి
ఖండ ఖండాంతరాలలో కమనీయమై వెలిగిన
రమణీయ సంస్కృతి.
వెండివెన్నెలై అందరి హృదయాలలో
ఆనందమై విరబూసిన
ఆర్ష సంస్కృతి మనది.
ఈ కట్టు.. ఈ బొట్టుకై ఎన్నెన్నో దేశాలు
వేనోళ్ళ కొనియాడి అపురూప మనుకుంటూ
తన్మయంతో వస్తుంటే... ఆధునిక మనుకుంటూ
మనం వెర్రెత్తి పోతుంటే
నీ తల్లి భారతి భరియించునా...
మనల్ని క్షమించునా.
ఓ క్షణం ఇటు చూసి
నీ పూర్వ వైభవం.నీ జాతి ఘనతకు
మచ్చ తెచ్చే పనులు
మానుకో ఓ యువతా...
భారతి గర్వించేలా మసలుకో..!

ప్రగతి పథం వైపు సాగుదాం..!

ఫ్యాషన్‌లకన్నా మన దేశ అభివృద్దే ప్రాణంగా బావిద్దాం. దళారుల రాజ్యాన్ని తరిమేద్దాం, అవినీతి అక్రమాలను అణచి వేద్దాం, వ్యసనాలకు బానిసలమయి బాధ్యతలను వదిలేసి అయిన వారికి భారంగా జీవనాన్ని సాగించకుండా... జాగరూకులమై శుభ లక్షణాలతో ప్రగతి పథంపై పయనిద్దాం.

నవ భారత నిర్మాణానికి నాంది పలుకుతూ నడుం బిగించారు మన నాయకులు. యుద్ధ ప్రాతిపదికన సమాజాన్ని సంస్కరించి పురోభి వృద్ధిదిశలో నడిపించాలని దానికి ప్రజలందరు సన్నద్దులు కావాలని పిలుపునిచ్చారు కార్యోన్ముకులు, ఆనాడు బ్రిటీష్ వారిని పారద్రోలుటకు ఏవిధమైన స్ఫూర్తితో ప్రతిఘటించామో, పీల్చి పిప్పిచేసి మన మనుగడకు మసి పూయాలను కున్నవారిని ఎలా తరిమివేయాలనుకుని అహర్నిశలు మన నాయకులు శ్రమించారో... అదే స్ఫూర్తితో మన సమాజాన్ని పిశాచంలా పట్టి పీడిస్తున్న అవినీతి, అక్రమాలు, స్వార్థపూరితమైన దౌర్బల్యాలను తరిమివేద్దాం.

పైపైన మెరుగులు దిద్దే విదేశీ వస్తువులను బహిష్కరించి మన ఆర్థికవ్యవస్థను మనమే పునరుద్దరించుకోవాలన్న మహాత్ముల మహోన్నత ఆశయాలకై మనమూ పాటుపడుదాం, మన అవసరాలకు కావల్సిన నాణ్యతగల వస్తువులన్నింటిని మనమే తయారుచేసుకుందాం.

ఎంతో మేధో సంపన్నత కలిగిన మనబిడ్డలను విదేశీ సేవకులుగా మార్చకుండా వారి మేధస్సును పెంపొందించే శిక్షణాలయాలను, సౌకర్యాలను మనమే, మన దేశంలోనే ఏర్పరుచుకొని, ప్రపంచాన్ని తలదన్నే నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానము కలిగిన ఉత్పత్తులను మనమేతయారు చేసుకుందాం. ప్రకృతి వనరులను వృధా చేయకుండా విరివిగా వాడుకుందాం. ప్రభుత్వాన్ని పరిరక్షించుకుందాం. ప్రభుత్వ చేయూతను అందుకుని పరిశ్రమలను స్థాపిద్దాం. ప్రగతి పథం వైపు సాగుదాం. ఫ్యాషన్‌లకన్నా మనదేశ అభివృద్దే ప్రాణంగా భావిద్దాం. దళారుల రాజ్యాన్ని తరిమేద్దాం, అవినీతి అక్రమాలను అణచివేద్దాం,

యం.మంగళ

వ్యసనాలకు బానిసలమయి భాద్యతలను వదిలేసి అయినవారికి భారంగా జీవనాన్ని సాగించకుండా జాగరూకులమై శుభలక్షణాలతో ప్రగతిపథంపై పయనిద్దాం పనికివచ్చే, పనిచేసే పథకాలను, ప్రణాళికలను రూపొందించుకుని అన్నదాతలకు అండగా వుందాం. రైతే దేశానికి వెన్నెముక అయిన మన జాతి పటిష్టతను పెంచే రైతన్నకు చేయూతనిచ్చి భారతావనిని సశ్యశ్యామలం చేద్దాం. అన్నిరంగాలలో మనకు మనమే సాటి అని చాటి చెబుదాం. ప్రజాశ్రేయస్సు, దేశప్రగతిని కాంక్షించే నాయకుల ఆదర్శాలను, అభిప్రాయాలను గౌరవిద్దాం. వారి అడుగుజాడల్లో నడుద్దాం, నవభారత నిర్మాణానికి చేయి చేయి కలుపుదాం. ప్రపంచం మనను తల ఎత్తి చూసేలా... జీవిద్దాం.

– జై హింద్.

మెలుకో ఓ యువతా..!

ఓ యువత నీకిది తెలుసా...
తరతరాల మన ఘనత,
చాటి చెప్పి భరతావని...
భాగ్యాన్ని భావితరాలకందించే
భాధ్యత నీ మీదుందని...
ఎటో వెళ్లిపోతున్న...
మన సమాజాన్ని సంస్కరించి
త్యాగమయుల కలలన్ని
పండించే కర్తవ్యం నీదని,
వెర్రి పోకడలు పోయే...
వింత మృగాలను మార్చే
చింత నీవు చేయాలని,
రత్నాలన్నీ రాళ్లలోనే
దాగుంటాయని తెలుసుగదా
రాళ్లలోని రత్నాలని
జాతి రత్నములుగ చెసి
భరత మాత పాదాలకు
అందెలగా మార్చి
అందించే భాధ్యత
నీదే అని మరువకు...
నీవే ఓ కోయినూర్ వజ్రంగా మారి
భరత మాత గళసీమలో
నిలిసి జాతి ఖ్యాతిని
నిలబెట్టాలని మరవకు...
మెలుకో ఓయువతా...
నీవె మన దేశ భవిత
నీ వునికే... ఓ చరిత్ర
అది కావాలో ...నవభారత
భాగ్యానికి... ఓదివ్య జ్యోతి.

ఈ జగతికి చాటి చెబుదాం..

అమృత బాండంలో ఒక్క విషపు బిందువు పడినా ఆ అమృత మంతా ఎలా విషపూరితమై వ్యర్ధమవుతుందో ఎంతగొప్ప సంస్కారమున్న మనుషులైనా, వారి మనసులోని ఈర్ష్యాసూయలు, ద్వేశాలే, మనిషి మనుగడను నిర్వీర్యం చేస్తుంది. అశాంతి, అలజడులతో హృదయంలో సుడిగాలలను రేపుతాయి. అయిన వారికి ఆదుర్ధాను మిగిల్చి సమాజంలో సమస్యలను సృష్టిస్తాయి. నాది, నాకు, నీది,నీకు, అన్న పొగమంచు మన ఉనికిని కప్పివేసి కక్షలు, కార్పణ్యాలకు దారి తీస్తుంది. ప్రస్తుత మన సమాజంలో యిలాంటి దుర్భర పరిస్థితే నెలకొంది, ఒకే తల్లి ఒడిలో పెరిగిన బిడ్డలం ఒకే తల్లి స్తన్యం తాగి తెలుగు మధురిమను అనుభవించిన తెలుగు తల్లి బిడ్డలం మనం. ఉమ్మడి కుటుంబంలో తరతరాల మన వంశ వృక్షానికి వన్నెతెచ్చిన రత్నాలము. కారణాలేవైతేనేం మనం స్పర్థలతో కలిసుండ లేక వేరు పడ్డాం. అంతమాత్రాన మనం సోదరులం కాకుండా పోతామా... నీది నీవు నాది నేను అన్న ద్వేష బావాలను వదిలి ఒక్క పనిని యిద్దరు వేరు వేరుగా చేస్తే యింకా ఉన్నతంగా ఎలావృద్ధి అవుతుందో మనమే నిరూపిద్దాం. రాష్ట్రాలుగా విడిపోయినా మా అంతరంగాలు ఒక్కటే మా కుటుంబాన్నే మేము అభివృద్ధిలోకి తెస్తున్నాం. మా తల్లితెలుగు, తల్లి తేజస్సును యినుమడింప జేస్తాం. అన్ని రంగాలలో అన్నదమ్ములమై కలిసి చేదోడు, వాదోడుగా వుండి అంబరమంత ఎత్తు ఎదిగి మాకు మేమే సాటి అన్న విదంగా ఎదిగి చూపిద్దాం, ప్రపంచానికి మనఖ్యాతిని చాటుదాం... మరి యిలా అందరికి మనం (తెలుగు తల్లి బిడ్డలం) ఆదర్శంగా నిలవాలంటే మనకు పరిపాలనా దక్ష్యత, సేవాతత్పరత, సమాజాభివృద్ధికై అణుక్షణం తపించే నాయకులు మనకు కావాలి. రాష్ట్రాలుగా మనం విడిపోయినా యోగ్యడైన నాయకులను మనం ఎన్ను కోవాలి వారుపెట్టే ప్రలోబాలకు లొంగి అనాలోచితంగా ఓటు అనే మన అస్త్రాన్ని తాకట్టు పెడితే మనం సాదించేదేముంది కలిసున్నప్పుడు ఒక్క ముఠా ఒక యింటిని దోచుకు తింటే యిప్పుడు రెండు ముఠాలు రెండిళ్లను దోచుకుని మనను అద:పాతాళానికి తొక్కేస్తారు. సోదరులారా తల్లి యిద్దరు బిడ్డలు ప్రయోజకులు కావాలనే ఆశిస్తుంది, అన్నదమ్ములు అంతే అందరం బాగుండాలనే కోరుకుంటాం కదా అలాగే మనమంత స్పర్థలుమాని మన సమాజంలోని జాడ్యాలను వదిలిద్దాం, అవినీతి అక్రమార్కులపై కొరడాను ఝులిపిద్దాం. కీచక,ప్రవృత్తులపై ఆగ్నేయాస్త్రం వేద్దాం! పరసంస్కృతిని తరిమేద్దాం, పర్యావరణానికి పెద్దపీట వేద్దాం. వ్యసనాలను కడిగేద్దాం, కుటుంబ జీవనంలో ప్రేమను నింపుదాం. పవిత్ర జీవనానికి స్వాగతం పలుకుదాం. అన్ని రంగాలలో అభివృద్ధి చెందుదాం మనకు మనమే సాటి అని ,తెలుగు జాతికిమించిన మేటి ఎవరూ లేరని,విద్యావినయ,సాంస్కృతిక, సాంకేతిక పారిశ్రామిక,వ్యవసాయ, కళా, క్రీడా, రంగాలన్నింటిలో విజయ పతాకాన్ని ఎగురవేద్దాం భరతావనిలో తెలుగు తేజాన్ని మణి ద్వీపంలా నిలబెడుదాం,ప్రపంచానికి మన ఘనతను చాటిచెబుదాం. రాష్ట్రాలువేరైనా మాహృదయాలలో ప్రవహించే ఆత్మీయతా ప్రేమా మృతం తరగదని ఈ జగతికి చాటిచెబుదాం.

- జైహింద్.

వేద గర్భ బిడ్డలమేనా..!

కడుపులో నవమాసాలు దాచుకుని పెంచిన కన్నతల్లికి, కళ్లల్లో పెట్టుకుని కంటికి పాపలా కాపాడుతూ పెంచిన కన్న తండ్రికి కడుపునిండా తిండిపెట్టలేని అబాగ్యుల్లా ఎదిగిపోయాం మనం.

కుటుంబ వ్యవస్థలు కుదించుకు పోయాయి, రోజులు మారాయి అని మా నాన్నగారు చిన్నప్పుడు అంటుంటే ఆ...హో... అని అర్థమయ్యి, అర్థంకానట్లు తల పూపేది. కాని నేడు అర్ధమయ్యింది ఎంతగా కుచించుకు పోయాయంటే తల్లి దండ్రులను అనాదలను చేసే అంత ఎత్తుకు మన అనుభందాలు ఎదిగి, ఆత్మీయతలు కుచించుకు పోయాయి. అహర్నిషలు మన తపనలో తపించి, మనక్షేమానికై అన్నీ త్యాగం చేస్తూ.. మన ఆరోగ్యానికై నిద్రాహారాలు మానేస్తూ, మనశ్రేయస్సుకై అనుక్షణం శ్రమిస్తూ... మన మహోన్నత మనుగడకై అనునిత్యం ఆరాటపడుతూ... వారి జీవితాలను పణంగా పెట్టి మనకు సుఖసంతోషాలు అందించాలి అని ప్రతిక్షణం ఆకాంక్షిస్తూ హారతి కర్పూరంలా కరిగిపోయే అమ్మ నాన్నలు అందల మెక్కాక మనకు భారమయ్యారు.

వేద,పురాణాలతో పులకించి , వేదమాత మంగళాశాసనాలలో పునీత మయిన ఈ వేదగర్భ బిడ్డలమేనా మన మసలు, పుణ్య నదీమ తల్లులు సైతం ఎవరిసేవ చేసి వారికంటిన పాపాలను ప్రక్షాలన చేసుకుని తరిస్తాయో, ఎవరి మనగడను జగత్తంతా వేనోళ్ల కీర్తిస్తుందో... అలాంటి జీవనాన్ని గడిపే మాతా పితృసేవాతత్పరతలకు సేవచేసి తరిస్తాయి కదా! వారి జీవన విది మనకు నామోషీ కాని,వాళ్ల ఆస్తులు మనకు ప్రియం వాళ్లుమాత్రం మనకు బంధువులయ్యారు, కడుపులో నవమాసాలు దాచుకుని పెంచిన కన్నతల్లికి, కళ్లల్లో పెట్టుకుని కంటికి పాపలా కాపాడుతూ పెంచిన కన్న తండ్రికి కడుపునిండా తిండిపెట్టలేని అబాగ్యుల్లా ఎదిగిపోయాం మనం, మనకోసమై మరిగి కృశించి నీరసించిన వారి దేహాలు అనారోగ్యంతో అలమటిస్తుంటే ఆదరించలేని నికృష్టుల్లా నీవా నేనా అని పంచుకునేంత ఎత్తుకు ఎదిగిపోయాం (అన్నదమ్ములు) మనం, కాస్త నలత చెందితే కలవరంతో కంటికి కునుకు లేక అలమటించిన అమ్మ ఒడి గుర్తుకురాదా!

నాన్న ఆదుర్దా మన బండ బతుకులను స్పృశించదా! పెళ్ళికాగానే గాలి అత్తింటికి మళ్లితే తల్లిదండ్రులను పరాయివాళ్లలా అంటి ముట్టనట్లు... అసలు ఏం చేస్తున్నాం మనం? ముందు తరాలకు అ శిక్షణ యిస్తున్నామా! ఆత్మీయతలను అణచివేసే జీవనమే ప్యాషన్ అనుకుంటూ పరుగులు తీస్తే ముందు తరాలు మనను పురుగుల్లా చూస్తాయి... కుటుంబ జీవనాన్ని పాతరవేసి నేను నాకు అనే కుంచితత్వాన్ని పెంచి పోషించితే అవే ఫలాలు మనకూ అందుతాయి అలమటించాల్సి వస్తుంది.యిక తల్లిదండ్రులు అనాథ శరణాలయాలకై పరిగెడుతే మనమెందుకు (అవసరం తీరాకా) రెక్కలొచ్చాక ఎగిరి పోయే పక్షులమా! అవికూడా తన తల్లిదండ్రులు కన్పిస్తే తన్మయంతో సేదదీరుతాయి. ఒకరోజు గింజలేస్తే మరుసటి రోజు మనం కన్పించగానే అరుస్తూ దగ్గరకు వస్తాయి. మూగ జీవులలో వున్న అనురాగం కూడా మనలో లేదా !

సంబరాలలో మనకు గుర్తుకురారు, సంతోషాలలో వీరు అవసరం లేదు... వారి వేష బాషలు మనకు మోటు కాని అవసరాలకు (పిల్లల్ని పెంచడానికి) గుర్తుకొస్తారు... ఆ తర్వాత కరివేపాకులా తీసి పారేస్తాము.. ఏంటిది తల్లిదండ్రులంటే కదిలే దైవ స్వరూపాలని సేవించి తరించిన పుణ్యచరితుల వారసులం మనం, బిడ్డలకోసం సర్వస్వం త్యాగం చేసే అమ్మానాన్నలను మన సుఖ సంతోషాల కోసం అనాదలను చేయకండి. వారిని అప్యాయత కోసం అలమటించేలా చేసి వారి హృదయాలను ఆక్రోషానికి గురిచేస్తే మనం ఏస్థితిలో వున్నా నిజమైన ఆనందాన్ని అనుభవించలేము. వారి చల్లని దీవెనలు మనపై అమృత జల్లులై కురిసినప్పుడే నిత్య సంతోషం మనకు అఖండమై నిలుస్తుంది, ముందు తరాలు మనను ఆదర్శంగా తీసుకుంటాయి.

-జైహింద్.

మంగళకర శుభ నాదం
మదిని తాకి మురిపించగ
అరుణోదయ కిరణాలతో
ఆదిత్యుడు కరుణించగ
ఆత్మీయ స్పర్శఏదో
స్పర్శించెను సుతి మెత్తగ
అదే నీ చిరునవ్వు...
అల్లుకుంది సుఘందమై.

ఏం చేద్దాం?

యజ్ఞయాగాలతో పునీతమై ప్రేమామృతాలతో నిండిన రక్తం మనది. మారణహోమాలు, మాలిన్యాలు మన పూర్వికులలో లేవు. అందుకే యథారాజా తథా:ప్రజా అనే వారు. నాటి రాజుగారి అంతరంగం ప్రజల జీవన విధానంపై శోభిస్తుండేది. అందుకే రాజంటే పవిత్ర భావన. తనను ప్రాణంగా భావించే ప్రజలంటే రాజుకు చెప్పలేనంత ప్రేమ.

చరిత్ర పుటల్లోకి వెళితే మనదేశ చరిత్రలో ఎక్కడా స్వార్థం, మోసం, అవినీతి, దనదాహం, పదవీ వ్యామోహం, దండయాత్రలు, యిలాంటి వాటితో ప్రజలను యిబ్బంది పెట్టి పీడించుకుని సమాజాన్ని నిర్వీర్యం చేసినట్లు లేదు. కుటుంబ కలహాలు తప్ప పెద్దగా ప్రజలను యిబ్బంది పెట్టిన చరిత్రలేదు, ప్రజలు కూడా రాజును దైవంగా తండ్రిలా భావించేవారు. న్యాయం ధర్మం కోసం నిలదీసే వారు, అంతేకాదు, యోగ్యుడైన రాజుకోసం ప్రాణాలైనా అర్పించేవారు. అన్యదేశ చరిత్రలకు మన పవిత్ర భరతావని చరిత్రకు ఎంతో తేడా, యజ్ఞయాగాలతో పునీతమై ప్రేమామృతాలతో నిండిన రక్తం మనది. మారణహోమాలు, మాలిన్యాలు మన పూర్వికులలో లేవు. అందుకే **"యథా:రాజా తథ:ప్రజా"** అనే వారు.

నాటి రాజుగారి అంతరంగం ప్రజల జీవన విధానంపై శోభిస్తుండేది. అందుకే రాజంటే పవిత్ర భావన. తనను ప్రాణంగా భావించే ప్రజలంటే రాజుకు చెప్పలేనంత ప్రేమ, ఆత్మార్పన యిలా పొంగి పోరలేది మన దేశసంస్కృతి. మరి నేడు ఏమయ్యింది? అసలు మనం భారతీయులమేనా..! మన పూర్వికుల రక్తం మనలో వుందా..! లేక వ్యసనాలలో పడి ఆవిరయ్యిందా..! అందేంటి ప్రజాసామ్య వ్యవస్థలో యింకా పటిష్టమైన పాలకులను ఎన్నుకుని పరిపాలన అప్ప జెప్పాలి కదా..! నేటి వర్తమానమే రేపటి మన దేశం భవిష్యత్తు కదా..! ఎన్నో వందల సంవత్సరాలు బ్రిటీష్ వారి పైశాచిక కోరల్లో నలిగిన మనజాతి నిర్వీర్యమై రోదిస్తుంటే ధన,మన: ప్రాణాలను ఫణంగా పెట్టి రాత్రనకా పగలనకా శ్రమించి మనకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టారు. రత్నగర్భ అయిన మనదేశాన్ని దోచుకెళ్లి చెఱుకు పిప్పిలా నిర్వీర్యం చేసినా... పునర్జీవింప చేసి

అన్నిరంగాలలో సారాన్ని నింపి పటిష్టమైన పరిపాలన, సామాజిక స్పృహతో అభివృద్ధిలోకి తెచ్చారు మన నాయకులు. ప్రగతి పథంలో నడిచే... మన వర్తమానం ఏమైంది? ఒక్కసారిగా అవినీతి అక్రమాలతో పెల్లుబికింది. కారణం అవినీతి, నేర చరిత్రులను పాలకులుగా మనం ఎన్ను కోవడమే అసలున్న కారణం. అసలు ఏం చేస్తున్నాం మనం మనభవిష్యత్తును ఎవరి చేతులో పెడుతున్నాం.

నాడు న్యాయం ధర్మం ప్రజాబివృద్ధికై పాటుబడుతూ ప్రేమనుపంచే సహృదయుడు మన ఊరిలోవుంటే అతని అడుగుజాడల్లోనడిచేవారు అతని వాక్కేశాసనంగా ప్రేమించేవారు. మరి నేడు మద్యం ఎరజూపి, నోట్ల కట్టలు యిచ్చేవారిపై మక్కువ జూపుతున్నాం, మన ఆత్మాభిమానానికి ప్రతీక అయిన ఓటును అవినీతి పరులకు ధారబోసి మనకోసం ఏమో చేస్తారని భ్రమ పడుతున్నాం. గందరగోళ పరిస్థితులలో మంద మతుల్లా ధనం వున్న వాని ధనానికి అమ్ముడుపోయి ఓటు వేసి బానిస లవుతున్నాం.కోట్లు ఖర్చుబెట్టి గెలిచిన వారు అంతకు వెయ్యి రెట్లు అందిందంతా దోచుకోవాలని చూడరా..? మందు బాటిల్లతో గెలిచిన వాళ్ళు ఆ వ్యాపారాన్ని పెంచి పోషించి అంతకు వెయ్యి రెట్లు సంపాదించాలను కోరా! అది తాగి ఆనారోగ్యం పాలయి కుటుంబాలను క్షిద్రం చేసుకుని ఎలా బ్రతుకుతున్నామో తెలియని భవిష్యత్తునిచ్చే పాల కులను ఎన్ను కుందామా..!

ఓటర్లను ఆకర్షించే పథకాలతో, బద్ధకాన్నిపెంచి ఆహార ఉత్పత్తికి గండికొట్టి దళారుల చేతుల్లో బెట్టి నిత్యావసరాలకు కటకట లాడించే అవినీతి పరులను అందల మెక్కిద్దామా..! ఉద్యోగం కావాలంటే లంచమే, కార్యాలయాల్లో ప్రతిపనికీ లంచమే, లంచం యిచ్చి ఓట్లు వేయించుకుని ఈ లంచాలను పెంచే నాయకులకు పట్టం కడుదామా..! పన్నుల రూపంలో దోపిడీ చేసి, ప్రభుత్వ ఆస్తులను లూటీ చేసి, పథకాలను బంధువర్గాలకు పంచియిచ్చి భారతీయత అన్న పదానికే అపఖ్యాతి తెచ్చే నాయకులకు పట్టం కడితే... మన వీరుల త్యాగఫలానికి అర్థం వుందా...! అర్థకాముల దాహానికి బలి అయి అశాంతితో అరాచకాలకు గురిఅయి, అభద్రతతో అలమటించడ మేనా మన భవిష్యత్తు ఆలోచించండి.

అమ్ముడు పోదామా..! లేక మమ్మల్ని డబ్బులతో కొంటారా అని నిలదీద్దామా, లేక గెలిచాక నచ్చని నాయకున్ని తీసేసే చట్టం తెచ్చేందుకు పోరాడుదామా... ఏం చేద్దాం దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే వుంది. ఆలోచించండి మీ ఓటును ఓ స్వర్ణపుష్పంలా భావించి దేశమాత పాదాలను అర్పించండి.

-జైహింద్

పండగొస్తుందంటే..!

మంగళ స్నానాలతో, సన్నాయి వాయిద్యాలతో, దానంతో, దైవనామస్మరణంతో, తులసీతీర్థ పానంతో మొదలయ్యేవి మన పండుగలు. కాని నేడు పండుగలు, పర్వదినాలు పబ్బుల పాలయినాయి.

పండగొస్తుందంటేనే అదో నూతనోత్సాహం... పూర్వం ఉమ్మడి కుటుంబం సంబరాలలో.. బాధలు... సంతోషాలు అన్నింటితో పంచుకొనే ఆత్మీయులు అందరు కలిసి చేసుకునే సంతోషాలసంబరం ఎక్కడున్నా అందరు కలిస్తేచాలు... పండుగంటే ముందుగా పరమాత్ముని పూజ, కీర్తన, ఆయన సన్నిధికై పాదాలు పరుగెత్తేవి... భజన, సంకీర్తనలో నర్తించి తన్మయంతో... అలా మైమరిచిపోతాం.. ఆ తర్వాత ఆనందంతో విందుభోజనాలతో గడిపే వాళ్లం... మళ్లీ ఉదయాన్నే అంతే ఉత్సాహంతో మేల్కొని ఎవరి పనులు వారు చేసుకోనేవాళ్లం. ఆ జ్ఞాపకాలతో మళ్లీ కలిసే వరకూ... తర్వాత పండుగ కొరకు ఎదురు చూసేవాళ్లం. ఆ పవిత్రతనే వేరే ఆ వాతావరణం పుష్టిని, ఆరోగ్యాన్ని ప్రసాదించేది, శారీరక ఆరోగ్యాన్ని బంధువుల మద్య అనుభందాన్ని పెంచి, అయిన వారితో ఆత్మీయతను మమతాను రాగాలతో, దానంతో, దైవ నామస్మరణంతో, తులసీతీర్థ పానంతో మొదలయ్యేవి మన పండుగలు, కాని నేడు పండుగలు, పర్వదినాలు పబ్బుల పాలయినాయి... దీపాలు వెలిగించి జీవితాలలో వెలుగును నింపుకోవాలని ఆశించే పర్వదినాలు జ్యోతులు ఆర్పి, చాకులతో కేకులు కోసి కుప్పి గంతులేస్తూ మద్యం పొంగులు, మాంసాహారాలతో విందులు చేసుకుని ఆ మత్తులో ఏం మాట్లాడుతున్నారో ఎలా ప్రవర్తిస్తున్నారో తెలియక అయిన వారితో విభేదాలు, అరగని పదార్థలు ఆరగించి అస్వస్థతతో శరీర వ్యవస్థలను ఆ బద్ధకంతో అవస్థ పడడం పండగైంది.

మనం ఏం చేస్తున్నామో కూడా తెలియని పరిస్థితి ఏర్పరుచుకునే రోజు మనకు ప్రత్యేక దినం ఎలా అవుతుంది. ఆరోజు మనకు జ్ఞాపకంగా మిగిలి ముందు జీవితానికి దారి చూపుతుందా..! మనం చేసిన ప్రతి పనికి ఫలితం మనకు ఏదో తెలియని శక్తి మాత్రమే యిస్తుందని, మన అంతరంగంలో తెలిసి కూడా యిలాంటి జీవనంకై ఎందుకు ప్రయత్నంచి మరీ పరుగులు పెడుతున్నాం. అంతెందుకు మనం ఆత్మ పరీశీలిన చేసుకుంటే తెలియదా... ఎవరి వస్తువైనా..!వారికి తెలియకుండా మోసంగా తీసుకున్నప్పుడు మనకు ఎలా అన్పిస్తుంది. అదే ఎవరైనా ఆపదలో వున్నప్పుడు వారికి సహాయం చేస్తే అప్పుడు మన మనసులో ఎలా అన్పిస్తుందో మనస్సాక్షిని బట్టి మసులుకోవాలి.

ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలకు బ్రతుకుదెరువు నిచ్చే విద్యనే కాదు.. బ్రతుకు బాటలో దారి దీపాల్లాంటి పండగల విశిష్ఠిత పరమార్థాన్ని తెలిపి, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలలోని అంతరార్థాన్ని మరియు శుభ సంస్కారాలే జీవన మఖరందాలని, సద్గుణాలే జీవితంలో ఆనందాన్ని నింపుతాయని, మృదుత్వమే హృదయానందమని వివరించాలి. మన పూర్వీకుల జీవన విధానంలో ఆనందం, ఆరోగ్యం, అనుభందాల పటుత్వం ఎలా వెల్లి విరిసిందో తెలియ జెప్పాలి. ఈ అస్థవ్యస్థ జీవితాలకు స్వస్తి జెప్పి **ఆయుష్షును, ఆరోగ్యాన్ని పెంపొందించుకుని, "ఆనందంగా నిండు నూరేండ్లు పిల్లా పాపలతో జీవించండి."** అని దీవించే మన పెద్దల దీవెనలను సార్థకం చేసుకుందాం. పర సంస్కృతులకు స్వస్తి చెప్పి పవిత్ర జీవనంలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ జీవిద్దాం...

-జై హింద్.

ఏదీ ఆ పండుగ...

ఏదీ ఆపండుగ..మల్లెప్పుడు వస్తుంది
వారం రోజుల నుండే
గడియ గడియ కోసారి
ఏప్పుడొస్తవని అడిగే
మానాన్న లోని అమరప్రేమతో ....
పండుగ పనులలో నిద్రాహారాలు మరచి
మధ్య మధ్యలోయిది చేయన,
అదిచేయనా
అంటూ అడిగే మా అమ్మ.
అనంత ఆత్మీయతలో...॥ఏది॥
ముసిముసి నవ్వులతో
గుమ్మంలోఎదురు చూస్తూనిరీక్షించే
మా బామ్మ పండ్లు పలాలు తెచ్చి
తినుతను మని కొసిరే మాతాత మమతతో ॥ఏది॥
పలకరింపులతో మా హృదయాలను
పరవశింప చేసేటి మా పనివాల్లు,
సన్నిహితులు, మాఊరి పసిమనసులు,
అత్తల రాకతో యింటిలో
కొత్త వెలుగు సంతరించ...॥ఏది॥
ముగ్గుముంగిల్లతో,తోరణాల శోభలతో
వ్రతాలు, నోములు, పూజలతో,
ప్రసాదాన్ని ముందే తిని...
మళ్లీ మళ్లీ వండించే
మా తమ్ముడి అమాయకతతో
పతంగుల హోరారుతో..॥ఏది॥
అటు పోయే వారినంత
పిలిచి తినమని పెట్టే
మా నాన్న ఆత్మీయతతో ..
ఆనందపు నిధియై,
మమతల మందాకినై
మా మదిని దొంగె ఆపండుగ ....
ఏది...ఆ పండుగ
మల్లెప్పుడు వస్తుంది.

వైద్యో నారాయణా... హరీ...!

"వైద్యో నారాయణా హరి"..! అన్నారు పెద్దలు. భగవంతుడు జీవితాన్నిస్తే, వైద్యుడు ప్రాణాపాయ స్థితి నుండి రక్షించి పునర్జన్మనిస్తాడు.

వ్యాదుల బారినుండి ఉపశమణాన్ని కలిగించి జీవితంపై ఆశను ఆనందాన్ని కలిగిస్తాడు. వీరికి నీవు నేను స్వపర బేధాలుండవు. వృత్తిని దైవంగా భావించి రోగి కళ్లలోని ఆనందాన్ని ప్రసాదంగా స్వీకరించి తృప్తితో వెలిగిపోయే వాడే వైద్యుడు, అందుకే వైద్యున్ని నారాయణునితో పోల్చారు. వైద్యవృత్తి అన్నా...వైద్యుడు అన్న పదం విన్నా మన హృదయాలలో ఎంతో పవిత్రత చోటు చేసుకునేది, ఏమైనా రోగ బాద వస్తే వైద్యుడున్నాడన్న ధీమా వున్నది, అది ఒకప్పటి మాట కాని నేడు ఏ చిన్న రోగం వచ్చిన రోగాని కన్నా ముందు వైద్యునికే భయపడాల్సి వస్తుంది. అమ్మో డాక్టరు దగ్గరికెళ్తే ఏ పరీక్ష లంటాడో, లేని రోగాలు అంటగట్టి ఏవికోసి (ఆపరేషన్) వేస్తాడో... అని వణుకు పుడుతుంది. **"పైసామే హై పరమాత్మ"** అన్న సూక్తిని అక్షరాల నిజంచేస్తూ నేటి వైద్యరంగం అచంలంచెలుగా ఎదిగి కుప్పలు కుప్పలుగా వైద్యశాలలు పెట్టి దోపిడీ దొంగల్లా పీడిస్తూ దోచుకుంటున్నారు. రోగిని భయకంపితులను చేసి ఉన్నవి లేనివి చెప్పి మానసికంగా హింసిస్తున్నారు.

నాడు వైద్యులు నాడి పట్టుకుని చూసి వ్యాధిని గుర్తించి మందు యిచ్చేవారు. నేడు తుమ్మొచ్చిన సవాలక్ష పరీక్షలు రాస్తారు, అవీ వాళ్ళు చెప్పిన లాబరేటరీలోనే పరీక్షలు చేయించాలి, ఈ ఫీజులకు కమిషనులకు కక్కుర్తి పడి వ్యాది గ్రస్తులను, వారికి సంబంధించిన వారిని కర్కషంగా, కఠినంగా, శారీరక, మానసికంగా, ఆర్థికంగా హింసిస్తున్నారు. అంతేకాదు ఒక రూముకు రోజుకు వేల నుండే మొదలవుతుంది. బయట నెల కిరాయి ఇక్కడ రోజుకే చెల్లించాల్సినా... తప్పని పరిస్థితి. ఆత్మీయులను రక్షించుకోవాలన్న తపనతో అప్పుసొప్పుచేసి కట్టక తప్పట్లేదు, ఎందుకిలా జరుగుతుంది. ఇంతగా యీ వ్యవస్థ ఎందికిలా మానవత్వాన్ని మంటకలిపేలా...! దిగజారింది... ఒక్కటే కారణం నాడు వైద్యవృత్తిని శ్రద్ధతో నేర్చుకుని అంకిత భావంతో తృప్తిగా చేసేవారు. నేడు వైద్య వృత్తిని కొనుక్కుని, వ్యాపార ధోరణితో ఎంతొస్తే అంత దండుకుందాం... వాళ్ళు త్రాగే టీ దగ్గరి నుండి అక్కడ అన్నీ రెట్టింపు చేసి ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచి... అందలమెక్కుదాం అని చూస్తూన్నారు.

హరీ హరీ యిదెక్కడి పైశాచికము, శవాలతో అటలాడుతున్నారు. చనిపోయిన తర్వాత కూడా పెట్టుకుని చిచీ ఎంత కక్కుర్తి అంతేకాదు... అవయవాలు అమ్ముకుని... అసలు ముఖాన్ని మూసి ఎవరినిస్తారో కూడా తెలియదు. కొన్ని హాస్పిటల్స్‌లో... మెడికల్ కాలేజీలతో కుమ్మక్కై మనుషులను పరికరాలుగా వాడుకుంటూన్నారు. విద్యార్థుల చేతుల్లో బలి అయిన రోగులెందరో చెప్పాలంటే ఎవరితరం. ఇవన్నీ జగమెరిగిన సత్యాలే కాని అందరం ఎవరికి వాళ్లమే హరీ..! అనుకుని ఊరుకుంటున్నాం.

నాయకులకు పట్టవు సామాన్యుని అవస్థలు, ప్రభుత్వానికి అవసరం లేదు ఈ సామాజిక జాడ్యం, ఆస్పత్రుల దోపిడి. దీని వల్ల మధ్యతరగతి వారి జీవితాలు అయోమయం, గందర గోళం.

కాని పవిత్రమయిన స్థానంలో వుండి రక్షించాల్సిన వైద్యులు విలయ తాండవం చేస్తూ... "**వైద్యో నారాయణ హరి**"మాటలను మార్చి ప్రాణాలను హరించి వారిని దుర్భరస్థితిలో తోసేసే వారైతే మరి ఈ సమాజంలో సంతృప్తిని ఎక్కడ వెతుక్కోవాలి! నూటికి తొంభైశాతం యిలానే వున్నారు. ఓ వైద్య నారాయణులారా... కాస్త మానవత్వంతో **ఆలోచించండి. ఓ విజ్ఞులారా... మీరూ ఆలోచించండి. మన జాతికి... యిది శోభనిస్తుందా..! వైద్యం అన్న పదానికి నిర్వచనం మారదా..!**

నాకే గనుక ధనముంటే...

**నాకే గనుక ధనముంటే...
ఆ పదలో వున్న వారికల్లలో
ఆనంద బాష్పాన్నై మెరిసేదాన్ని
నేనే గనుక చిరునవ్వయితే
ప్రాణమున్న ప్రతి జీవి
అదరాలపై విరభూస్తా...
వైన్నెలైతే నేను..
బారమైన హృదుయాలను
హాయిగా స్పర్శంచి..
అలా అలా.. మధుర జ్ఞాపకాలలో
విహరించేలా చేస్తా...
మెఘమయితే నేను...
ఎండమావులలో
స్వాతి జల్లై కురిసి
నీ కోసం నేనున్నా నని
ధైర్యాన్నవుతా..!**

హృదయ బాషే...మాతృబాష

మధురమైన తెలుగు బాష మనకు తల్లిరా మనమే ఆ తల్లి మమత మరిచి పోదమా..! అమ్మా... అనే మాటలోనే అమృత ముంది.

అని అమ్మా అనిపిలిచే ప్రతి హృదయం ఆక్రోశిస్తుంది. మనం కన్నతల్లి గర్భంలో వున్నప్పుడే మన అణువణులో నిండి అంతరంగంలో కలబోసుకుని పుట్టింది మాతృబాష అదే అందరికి హృదయ బాష. ఏగురువు నేర్పించ కుండానే మనలో అంతర్లీనమై మన హృదయ బావాలకు ప్రతిరూపం మాతృబాష, ఏ బాషలో మాట్లాడినా అంతరంగంలో మొదట మన బావాలు మాతృబాషలోనే కలుగుతాయి, అవి యితర బాషలోకి అనువదించుకుని మాట్లాడుతాము. మరి **స్వంతంలో కన్నా అరువులో ఆనంద ముంటుందా!** మన మనుగడకు ఆదారమైన మాతృబాష మన అంతరాలలోని భావ వ్యక్తీకరనకు ప్రతి రూపంగా బాషిస్తుంది. అనుకరణ కాకుండా అంతరంగం లోంచి వస్తుంది కాబట్టి ఆ మాధుర్యమే వేరు. బాష ఒక మన బావాలనే కాదు మన వ్యక్తిత్వాన్ని, మన సంస్కృతి, సాంప్రదాయాలను కూడ ప్రతిబింబింప చేస్తుంది. తెలుగు వారంటే ఓ రూపం, కన్నడ, మలయాలం, మరాఠి, హింది యిలా బాషస్పురించ గానే వారి, జీవీన విదానం, హావబావాలు, వేషాలు, సంస్కృతి సాంప్రదాయాలు మదిలో మెదులుతాయి. అందుకే మాతృబాష ఏదైనా సరే ఆ బాషలోనే మన జీవన విదానం సాగాలి. వ్యాపారం,ఉద్యోగాల కోసం అందరితో వ్యవహరించుటకు సాదారణంగా ఒక బాషను ఎన్నుకున్నా... మన మాతృబాషే మన జీవన సరళికి వన్నెతెస్తుంది. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో ఆంగ్లంపై మక్కువ ఎక్కువ.

సాదారణంగా ఏ రాష్ట్రంలోకి వెళ్లినా విద్యావిదానం, ప్రచురణలు,పేర్లు అన్నీ వారి వారి బాషలోనే వుంటాయి. కాని మన తెలుగు రాష్ట్రాలలో ఆంగ్లంలో వుంటాయి. కారణం పరబాషపై మనకు ఎనిలేని ప్రేమ మనకు, "**పక్కంటి పుల్లకూర రుచి అన్నట్లు**". కాని ఎన్ని రోజులు తింటాము. మనము సాదారణంగా పిలిచే ఆంటికి, అత్తా అనే మాటకు తేడాచూడండి అత్తా అనగానే ఆ పిలుపులోనే ఆత్మీయత పొంగి పొరలుతుంది. ఆ దగ్గరితనం ఆ మాటలోనే వుంది. పరబాషపై వ్యామోహం మనను పతనం చేసి అమ్మా అని కూడా పిలువ లేక అమ్మా అని పిలుస్తే అసహ్యించుకునే స్థితికి పతనం అయ్యాము మరి ఎందుకు ఇలా... దిగజారాము... ఏమి ఆశించి మనం మన హృదయాలను నలిపేసుకుంటున్నాం.

విద్యాలయాలలో మాట్లాడుతే డబ్బులు కట్టాలట, శిక్షవేస్తారట. యిదేమి ఘోరం. పరబాషలు నేర్పండి కాని మాతృ బాషను విస్మరిస్తే ఎలా!

పరబాషా జ్ఞానం వల్ల ప్రపంచంలోని వివిద నాగరికతల పరిజ్ఞానం... శాస్త్ర సాంకేతికాలలో, వ్యాపారాలలో... అన్నింటిలో ఒకరి గురించి ఒకరు తెలుసుకునే జ్ఞానం వస్తుంది. కాని మాతృబాషలో బోదన వలన వారి మనోభావాలను క్లుప్తంగా వ్యవక్త పరచ గలరు, నేడు ఇంగ్లీషు మీడియంలో చదివితేనే పెద్దపెద్ద ఉద్యోగాలు వస్తాయని అందరిలో బలంగా నాటుకుపోయింది. దీనికి కారణం లేకపోలేదు నేడు మన జీవనం విశ్వ వ్యాప్త మయ్యింది ప్రపంచంపైపు ఉద్యోగాలకై పరుగెడుతున్నాం. అందరితో మాట్లాడాలంటే అందరు మాట్లాడే బాషలో పటుత్వం వుండాలి. అయితే ఆంగ్లాన్ని నేర్పించడి, కాని ఎవరి ప్రమేయం లేకుండా వచ్చే హృదయ బాష అయిన మాతృబాషలోనే విద్యావిదానం సాగాలి అప్పుడు వారు యాంత్రికంగా కాకుండా సహజంగా విద్య సభ్యసిస్తారు. మరియు వారికి కావలసిన పుస్తక పరిజ్ఞానం , సాహిత్యం అంతా మాతృబాషలోనే మనం అందించాలి, అలాగే ఉద్యోగ నియామ కాలలో, ఉన్నత విద్య కూడా మాతృబాషలో వుంటే యింకా బాగా విద్యార్థి పరిణితితో తన భావాలను చెప్పగలడు. మరి తల్లిదండ్రులు, ప్రభుత్వం ఆ దిశలో ఆలోచించాలి కవులు తమ సాహిత్యాన్ని తెలుగులో విరివిగా అందించాలి. పిల్లల్లో పఠనా ఆసక్తిని పెంచే రచనలు రావాలి.

మీరు గమనించండి బాష బావాలను మారుస్తే బావాలు వేషాలను మార్చి మన సంస్కృతిని చిన్నా భిన్నం చేస్తుంది. అందుకే మన ఉనికిని కాలరాచే బాషలపై మోజువద్దు, అవసరానికి వాడు కుందాం. కాని అదే అవసరంగా... ప్యాషన్‌గా కాదు.

ఏదేమైనా ముఖ్యంగా మన తెలుగు మనకు కనుమరుగై పోయే దుస్థితి రాకుండా తేరుకోవాలి ఆ దిశలో ప్రతి ఒక్కరు ఆలోచించాలి. ముద్దు ముద్దు మాటలతో ముచ్చటగా స్పృశిస్తూ మురిపెంగా మదిని తాకి హృదయ లయలో పెనవేసు కుని "దేశ బాషలందు తెలుగు లెస్స" అని కొనియాడ బడిన మధుర బాష మన మాతృబాషను వదిలి మనం మన ఆత్మగౌరవాన్ని కించపరుచు కుందామా... విజ్ఞులారా మీరే ఆలోచించండి.

-జైహింద్

చదువు 'కొనే' దెలా ?

"విద్య లేనివాడు వింతపశువు" అన్న ఆర్యోక్తి విన్నప్పుడు విద్య లేకుంటే వింత పశువు ఎలా అవుతాం? సంస్కారం లేనివాడు కదా వింతపశువు. కానీ సంస్కారాలను, శాస్త్రలోతులను మనకు అందించేది విద్యాభ్యాసమే కాబట్టి ప్రతివాడూ తాను విద్యావంతుడై, తమ పిల్లలను విద్యావంతులను చేయాలని తపిస్తారు. ఇది ఎంతో శ్రేష్టమైన సంకల్పం. ఉన్నతమైన సమాజానికి, దేశ ప్రగతికి సోపానం. విద్యా విషయంలో మనమెంతో అదృష్టవంతులం. ఎందుకంటే ఎంతో శ్రేష్టమైన విశ్వవిద్యాలయాలు మనసొంతం.

దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అత్యున్నతమైన శిక్షణనిచ్చి వివిధ రంగాలలో నిష్ణాతులైన సైంటిస్టులను, ఇంజనీర్లను, డాక్టర్లను, లాయర్లను, ఆఫీసర్లను మరెందర్నో అందించే విద్యా సంస్థలు మన రాష్ట్రంలో కోకొల్లలు. అంతా బాగానే ఉంది కానీ, సంపన్న వర్గాల చదువులకు లోటు లేదు. చిన్నతరగతి వారికి ప్రభుత్వ సహాయం, వసతి గృహాలు, మనసుండాలి కానీ వీరికీ ఏ లోటూ లేదు ఆపై సబ్సిడీలు, రాయితీలు ఉండనే ఉన్నాయి. అయితే ఎటొచ్చీ మధ్య తరగతి వారి చదువే దుర్భరమైంది. చాలీ చాలని జీతాలు, కూరగాయల వాళ్ళు అన్నీ ధరలు పెరిగాయి ఏమొస్తాయమ్మా... అంటారు. పనివాళ్ళు చుక్కలు చూపిస్తున్నారు. ఆటోల వాళ్ళు మీటరు పరిగెత్తిస్తూ పెట్రోలు పెరిగిందంటారు. డాక్టర్లు సరే సరే. మందుల బెడద తెలిసిందే. కరెంటు బిల్లు షాకే కదా! పోవుల డబ్బా పొగల సెగలే... పైసా పైసా కూడబెట్టినది పండుగలు, పబ్బాలు అనుకోకుండా వచ్చిన ఖర్చులకే చాలదు. మరి కాన్వెంటు పాఠశాలల్లో చేర్చేదెలా? పుస్తకాల మోతకన్నా ఈ ఫీజుల మోత భరించేదెలా? బాప్‌రే.. ఇంక ట్యూషన్ ఫీజులు, కాలేజీ ఫీజులు ఇవి తలుచుకుంటేనే మే ఎండల భగ భగలకు మారుగా మా గుండెల్లో దడ దడకే మా రక్తం ఆవిరయ్యేలా వుంది. ఈ మధ్య తరగతి జీవితాలకు ఇక ఎండాకాలం సరదాలెలా? మా పిల్లల్ని ఎంతో పెద్ద పెద్ద చదువులు చదివించి గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తుండగా చూడాలన్న మా కల ఆవిరేనా? అమాయకుల బతుకుల్లో వ్యాపారమైన విద్యను సామాన్యుడు కొనగలడా? చదువు 'కొన' గలడా? ఇలా తలచుకొంటేనే నిద్ర పట్టని పరిస్థితి నేటి సమాజంలో మధ్య తరగతి జీవితాలది! సాధారణంగా మన దేశ జనాభాలో అధిక శాతం మధ్య తరగతి వారే. మరి వీరి మనుగడకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టి, వారి జీవన స్థితిగతులను మెరుగు పర్చాలన్న యోచన లేని

ప్రభుత్వాలు ఉన్నన్ని రోజులు ఈ మధ్యతరగతి బ్రతుకుల్లో మరణమృదంగం తప్పదు. నిత్యావసరాలపై అధికారులు శ్రద్ధ చూపనపుడు ఈ అవక తవక బ్రతుకు చాలీ చాలని జీతంతో నెట్టుకొని చదువుని కొనలేరు... ప్రతిభకు పట్టం కట్టలేరు. అధికారులు ఆలోచించి అందరికీ అందుబాటులోకి విద్యను తెచ్చినప్పుడే, అన్ని వర్గాలకు విద్య అంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారు. దేశ ప్రగతికి తోడ్పడతారు. అప్పుడే అందరూ చదువు కొనలేరు అన్న దిగులును వదిలి ఉత్సాహంతో విద్యాభ్యాసం కొనసాగిస్తారు. మరి ఆ దిశగా ప్రభుత్వం, ప్రజలు అందరూ ఆలోచిస్తే మధ్యతరగతి జీవితాలలో కూడా ఆనందాన్ని నింపవచ్చు!

-జైహింద్.

మహోన్నత పుష్పాలు

పల్లవి: భరతమాత పాదాల పూజ కొరకు పుట్టాము
ఈ భారత భువిలోన విరబూసిన పువ్వులం ॥2॥
జయ భారత భూమికిదే జయహెూ జయహెూ
నవ భారత జాతికిదే నమహెూ నమహెూ ॥2॥

చరణం1: హిమాలయాలంత గొప్ప మనసున్నది మాకులే
సముద్రుని గాంభీర్యపు ప్రతిరూపం మేములే
పట్టుదలకు పరుగులిడే గంగమ్మకు దీటు మేము
ఈ పవిత్ర జనయిత్రికి ప్రియపుత్రులు మేములే
ప్రియ పుత్రులు మేములే ॥భరత॥

చరణం2: సస్యశ్యామల సుందర సుమధుర భారతావనిలో
భవ్యచరిత కలిగిన జాతి రత్నములు మేమే
విజ్ఞానపు కిరణాలను విశ్వానికి అందించగ
వికసించిన తేజోమయ కాంతి పుంజములు మేమే
కాంతి పుంజములు మేమే ॥2॥ భరత॥

చరణం3: భిన్న సంస్కృతులు కలిగిన సుగంధ సుమాలము
ఐకమత్యమనే లతతో పెనవేసుకు పోయాము
భరతమాత గళ సీమలో మాలలోన ఒదిగాము
జాతి గౌరవం పెంచే భావి భారతీయులం
భాగ్యరాశి మా జననీ ప్రియ భారత పుత్రులం
జయహెూ జయ జయహెూ జననీ
నమహెూ నమ నమహెూ భారతావని ॥జ॥ ॥2॥ ॥భరత॥

ఎటుపోయింది సహజ గుణం

సత్యం కోసం శ్రీహరిశ్చంద్రుడు సర్వస్వాన్ని త్యాగం చేసి కాటి కాపరయ్యాడు. మాటకోసం శ్రీరామచంద్రుడు, అనుబంధాల కోసం పాండుపుత్రులు, దానం కోసం రంతిదేవుడు, నలుడు, దమయంతి యిలా వీరందరూ అన్ని బోగ భాగ్యాలు వారి జీవితంలో అనుభవించిన వారే, శౌర్యవంతులే అయినా ప్రతికూల పరిసితుల్లో అవి లేక పోయినా... ఆనందంగా అన్నింటిని ఎదుర్కొని జీవించారు. వీరే కాదు ఇంకెందరెందరో సామ్రాజ్యాలను సైతం త్యజించి జీవన పోరాటాన్ని సాగించారు. ధైర్యంగా ఎలాంటి ఆత్మన్యూనతకు లోను కాకుండా జీవించారు. మనకు మార్గగాములయ్యారు. మన జాతి ఖ్యాతి నిలబెట్టారు. అలాంటి ధైర్య, శౌర్య, దాన, త్యాగధనుల వారసులం మనం. వారి రక్తం మనల్లో వుంది. మరెందుకు ఈ బేలతనం మనలో తాండవం చేస్తుంది. ప్రతి చిన్న దానికి ఆత్మనూన్యతకు గురి అయి ఆత్మహత్యలకు ఎందుకు పాల్పడుతున్నాం.

మరీ.. ఈ మధ్యకాలంలో యువత ప్రతీ సమస్యకు జీవితాన్ని బలిపెడుతున్నారు. "బతికుంటే బలుసాకైనా తినొచ్చు, అని మన పెద్దలు చెప్పిన నానుడిలో ఎంత నిఘూడ రహస్యం దాగివుంది. ఏమి లేకున్నా బలుసాకైనా తిని భగవంతుడు ప్రసాదించిన జీవితాన్ని గడుపు, కాని బ్రతుకును నిర్వీర్యం చేసుకోకు. నీవు సృష్టించుకోలేని ఈ శరీరంని క్షిద్రం చేసేహక్కు నీకు లేదని కొరడా పట్టుకొని మరీ చెప్పాయి మన ఆప్త వాక్యాలు, పురాణాలు, వేదాలు, ఏ విషయంలో నైనా సరే మనస్థాపాలు వేదిస్తే విచక్షనను జోడించి, ఆలోచించి చూడండి మన కన్నా అబాగ్య స్థితిలో వున్న వారిని. మరి ఎందుకింత పిరికి వాళ్లవుతున్నారు, ప్రతీ దానికీ చావడమే శరణ్యమా..? చదవ లేక చావే, ఉద్యోగం లేక చావే, లగ్జరీలు లేక చావే, ప్రేమకుచావే, పెళ్లికీ చావే, అప్పులకు చావే, ఆత్మీయతకు చావే, బోగాలు లేక పోయినా భాగ్యాలు లేక పోయినా చావే అసలు ఏంటిది..? అన్నింటికి పరిష్కారం ఆత్మహత్యే శరణ్యమా..!

ఝూన్సీ లక్ష్మీబాయిని చూడండి పసిబిడ్డను వీపున కట్టుకుని చివరి క్షణం వరకూ బ్రతకాలన్న ఆశతో పోరాడింది. కర్తవ్య నిర్వహణకై తపించింది. అంతటి ధైర్యం కార్యదీక్ష గల మన పూర్వీకుల రక్తం మనలో ప్రవహిస్తుండగా నేటి సమాజంలో ఎందుకు యిలాంటి

మనో దౌర్బల్యం ఏర్పడింది,ముఖ్యంగా ఆలోచించి చూస్తే మనం సాంకేతిక పరంగా ఎంత ఎదిగినా..! ఆత్మీయయతానురాగాలు పంచే మనసహజ గుణంకు తెగులు పట్టింది. యంత్రాలతో గడపడం మొదలు పెట్టి మానవత్వాన్ని మరచి మనసులను దూరం చేసుకుంటున్నాం. నేనున్నానన్న చిన్న బరోసా కూడాఇవ్వలేక పోతున్నాం. అంతరంగాలకు దూరమై ఒంటరి తనాలను పెంచుతున్నాం.

పూర్వం అలా కాదు బంధుమిత్రులు ఎక్కడున్నా నాకోసం వీల్లున్నారన్న సంతృప్తి వుండేది.ఆ తృప్తే కష్టమొచ్చినా నష్టమొచ్చినా అండగా నిలిచేది. ఆయినవాళ్లు ఆదరిస్తారని దీమాతో, ధైర్యంతో ముందుకెల్లేలా చేసేది. మరి నేడు పండుగలు పబ్బుల కంకితమై, బాందవ్యాలు బందీపోట్లై... ఆత్మీయతలు యంత్రాలలో అంతర్లీనమై, స్నేహం స్వార్ధ పూరితమై, మానవ మనుగడ ఒంటరై రోదిస్తుంది, నిరాశా నిస్పృహలతో జీవితాలను అంతం చేసుకునేలా చేస్తుంది. ఎందరున్నా అందకారమే అతలాకుతలం చేసి ఆత్మన్యూనతతో అణుక్షణం రోదిస్తూ బతక లేక... హృదయాలు విలవిల లాడి పిరికితనంతో చైతన్యవంతమైన శరీరాలను వదిలి వెల్లేలా మానసిక దౌర్బల్యం తాండవం చేస్తుంది. అందుకే ఓ విజ్ఞులారా..! తల్లిదండ్రులారా..! స్నేహితులారా..! బందువులారా..! సహోదరులారా..! ఆత్మీయతను పంచండి. అయిన వారితో కాసేపు గడపండి. **మమతల మందాకినీ మన భరతావని ఈ తల్లికి తలవంపులు తెచ్చే దిశకై పయనించకండి. పరిస్తితులేవైనా పోరాడి గెలవడమే మానవ జన్మలక్ష్యం... ఈ విషయంలో అందరం జాగరూకులౌదాం, అభాగ్యులకు చేయూతనందిద్దాం. ఆత్మీయులకు అండగా నిలుద్దాం. ఆత్మనూన్యతా భావాన్ని దగ్ధం చేద్దాం. కుటుంబ, సామాజిక వ్యవస్థలను ప్రేమామృతంతో నింపి భరతావనిని పరిమళింప జేద్దాం. ఆనంద సాగరంలో విహరిద్దాం.**

- జైహింద్.

అంతరంగిక దుర్గంధాలను పెంపొందించే ప్రకటనలను, యువతను పెడదారి పట్టించే పోస్టర్లను, సినిమాలను మనం ఎందుకు చూసి చూడనట్లు పట్టించుకోనట్లు ఉంటున్నాం. వ్యసనాలకు బానిసలను చేసి జాతిని దుర్గంధపూరితంగా మార్చే అస్థవ్యస్థ పరిస్థితులను, కల్లోలపు కల్మష హృదయాలలో పేరుకుపోయిన మలిన దుర్గంధాలను శుద్ధి చేసే కార్యక్రమాలకై ఎందుకు ఈ విషయమై ఆలోచించరు ఎందుకీ మౌనం.

ఇదీ మన బాధ్యతే

“కులం లోన ఒకడు గుణవంతుడుండిన కులం వెలయు వాని గుణం చేత ” వంశంలో ఒకడు గుణవంతుడు వుంటే వాడి కుటుంబమే కాకుండా వాడి బంధువులు, కులంవారు, ఆశ్రితులందరూ బాగుపడుతారు. అదే విధంగా ఊరిలో ఒకడు తెలివైన వాడూ, ప్రజ్ఞా ప్రతిభ కలవాడు వుంటే ఆ ఊరు అంతా బాగుపడుతుంది వెలుగులోకి వస్తుంది. అందుకే బుద్ధిమంతులను, ప్రజ్ఞావంతులను ప్రోత్సహించాలి.

అంతేకాదు **“పుర్రెకో బుద్ధి జిహ్వాకో రుచి అంటారు పెద్దలు”**. అవును ఒకే పదార్థం ఎంత బాగున్నా అందరికీ యిష్టముండదు. ఒక్కొక్కరికీ ఒక్కోరుచి, ఒక్కో రకమైన పదార్థాలు నచ్చుతాయి. అలాగే అందరి బుద్దిలోని ఆలోచనలు కూడా ఒకేలా వుండవు. సృజనాత్మకతలలో కూడా తేడా వుంటుంది. ఏ రాయిలో ఏ రత్నం దాగుందో తెలియనట్లు ఎవరిలో ఏ సృజనాత్మకత వుందో తెలియదు. అయితే ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం దాగి వుంటుంది. అది తెలుసుకొని ఎవరికి వారే పదును పెట్టుకుంటే జీవితం ఆదర్శప్రాయమవుతుంది. సమాజం శ్రేష్టత్వంతో వెలిగిపోతుంది. కొందరు చాలా విషయాలలో శ్రద్ధ, నైపుణ్యతను కలిగి వుంటారు. అయితే దానిని ఎలా నిరూపించుకోవాలో తెలియదు. అన్నీ వచ్చు కానీ ఏమి చేయలేరు. యిలాంటి వారిని మనం గుర్తిస్తే వారు ఎవరైనా సరే మన యింటిలోని వారైనా, కుటుంబలోని వారైనా, చుట్టు ప్రక్కల వారైనా, మనకు తెలియని వారైనా సరే వారిని ప్రోత్సహించి వారిలోని సృజనను వెలికి తీయడం మన కనీసధర్మం, ఈ ప్రకృతిలోని సకలవనరులు, సౌకర్యాలను వాడుకుని, ఆధారపడి జీవనాన్ని సాగించే మనం, మన జాతికి, సమాజానికి మేలు చేసి ముందు తరాల మనుగడను శ్రేష్ఠం, సులభం చేయడం మన కర్తవ్యం. నాకేంవస్తుందన్నది ప్రక్కనపెట్టి, నేనేం చేస్తున్నాను అన్నదిశలో ఆలోచనలు సాగాలి. ఈర్షాద్వేషాలు మానండి ఈ గాలి పీల్చి, కల్మషాలను పంచకండి. ఈ గగనంలో విహరిస్తూ స్వార్ధాన్ని చూపకండి. ఈ గంగను త్రాగి జీవిస్తూ నిర్మలత్వాన్ని మరవకండి... ఈ అవనిపై జీవిస్తూ విచక్షనను కోల్పోకండి.... జ్ఞానాగ్నితో ఈర్ష్యాసూయలను దగ్ధం చేసి, మనలో లేకున్నా సృజన, ఆదర్శాలు వున్న వారిని ప్రోత్సహించండి. చేయూతనివ్వండి. మానవుడు అన్న పదానికి అర్థం తెలుసుకుని, విశాల, వినూతన, ఆదర్శకర సమాజానికి, ఉన్నతమైన జాతినిర్మాణానికి తోడ్పడుదాం... జాతి రత్నాలకు మెరుగు పెట్టి నవభారత నిర్మాణానికి మన వంతు సహకారాన్ని అందించడం మన బాధ్యతగా స్వీకరిద్దాం.

- జైహింద్.

ఎందెందు వెతికినా...

"ఎందెందు వెతికి చూసిన అందందే కలడు విష్ణు సర్వోప గతుడ్" అంటూ నిలదీసిన తన తండ్రి హిరణ్య కశ్యపునికి పూర్ణ భక్తితో అరమోడ్చు కన్నులతో నిస్సందేహంగా, గంటాపథంగా మ్రోగించి చెప్పాడు. కాదు కాదు చూపించాడు భక్త ప్రహ్లాదుడు యిప్పుడు... నిస్సందేహంగా ఎవ్వరినీ నిలదీయకుండా ఎందెందువెదకి చూసిన అందందే మనకు కనిపించే వాళ్లు ఎందరెందరో వున్నారండీ... వాళ్ళులేనిదే ఏ పనీసాగదు. మనలాంటి సామాన్యుల జీవితాలను జలగల్లా పీల్చుకు తింటున్నారు వీళ్ళు, వీళ్లే... బ్రోకర్ నామధేయులు. మన దేశంలో మన జీవన విధానం సాగాలంటే కూరగాయల దగ్గరి నుండి న్యాయస్థానం వరకే కాదు, ఎక్కడ చూసినా వీరి ప్రవేశంలేని చోటేలేదు అంటే ఆశ్చర్యపోవలసిన పనిలేదు. యిల్లు కట్టుకోవాలన్నా బ్రోకరే, పెళ్లి చేసుకోవాలన్నా బ్రోకర్లే కావాలి. ప్రతి పనికి, యింట్లో పని మనుషులు కావాలన్నా వీరే మేమున్నాం అంటూ ప్రత్యక్షం.

ప్రభుత్వ కార్యాలయాల్లో అయితే వీరి స్థానం అమోఘం. లతల్లా అల్లుకుపోయారు. ఏ సంస్థ కెళ్ళినా వీరులేనిది ఏ పనీకాదు, పని చేసేవారు కూడావీరిని చూసి అలవాటు పడిపోయారు. ప్రభుత్వ కార్యయాలలో బ్రోకర్ల ప్రవేశం లేకపోతే పైల్ కదలదు. యిదేమి దౌర్భాగ్య పరిస్థితి యిది ప్రజాసామ్యమా లేక బ్రోకర్ల సామ్యామా..! ఎన్నో ఉద్యమాలు చేస్తూన్నాం... ఎన్నో సమస్యల పరిష్కారానికై నడుంకడుతున్నాం. ఆలోచిస్తున్నాం. ఎన్నింటినో ఎదుర్కొంటు ప్రతిఘటిస్తున్నాం. సమ్మెలు చేస్తున్నాం. మరి మన జీవితాలను నిర్వీర్యం చేస్తు.. మన మనుగడకు మసి పూసి పీడిస్తూ మనకోసం మనం ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ కార్యాలయాలలో మన పనులు మనం చేయించుకోవడానికి కూడా... మధ్యలో యింకొకరికి ముడుపులు చెల్లించు కోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? ఎంతో బాహాటంగా జరిగే ఈ అవినీతి. బ్రోకర్ల సామ్యాన్ని ఎదురించడానికి

మీరెందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు..? ఓ చిన్నపని జరగాలంటే సం॥రాలు గడిచిపోతుంటే అదే బ్రోకర్ ప్రవేశిస్తే వారం లేదంటే 10రోజులు ఇదెక్కడి ఘోరం యింతపెద్ద సమస్యను చూసి చూడనట్లు ఎందుకు వదిలేస్తున్నాం. ఈసమస్య సమాజ అభివృద్ధిని కుంటుపరుస్తుంది. సామాన్యుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తుంది. కార్యోన్ముఖులు కూడా విసిగివేసారి, నీరసించి ముందుకు సాగటంలేదు యిలా అయింతే మన దేశ పరిస్థితి ఏంటి? ఏ రిజిస్ట్రేషన్ చేయించాలన్నా బ్రోకరే. సేవాసంస్థలు స్థాపించాలన్నా, తమ సేవలను అందించాలన్నా. బ్రోకర్లను ఆశ్రయించాల్సిందే! వీరి సంస్థలు బ్రోకర్లే, ఎన్నని చేస్తాం అసలు ఎటుపోతుంది ప్రభుత్వం కార్యాలయాల ధర్మనిరతి, ప్రజాస్వామ్య ప్రభుత్వమా యిది బ్రోకర్ల ప్రభుత్వమా. గల్లీ నుండి ఢిల్లీ వరకూ యిదే తరహా, మరి సామాన్యుల మనుగడ ఎలా!

ఓ విఘ్నులారా కాస్త ఆలోచించండి. ఈఅక్రమాలను కూకుటి వేళ్లతో పీకివేయండి, ప్రజల పనులను ప్రభుత్వాధికారులు చిత్తశుద్ధితో చేసేరోజు వచ్చినప్పుడే ఈ దేశ భవిష్యత్తు దేదీప్యమానం అవుతుందని స్ఫూర్తితో నూతనోత్తేజంతో అందరూ వివిద కార్యక్రమాలతో సమాజాన్ని సుసంపన్నం చేయడానికి ముందుకు వస్తారని ఎందుకు అన్పించడం లేదు మనకు, ఈ సమస్యకు కారణమైన వారిని తరిమేసినప్పుడు దర్జాగా నిరక్షరాస్యుడు సైతం ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లి పనులు చేయించుకుంటారు నూతన కార్యాచరణాలకై పూనుకుని దేశాన్ని సుసంపన్నం చేసే దిశలో యోచిస్తాడు,ప్రజలకు అందుబాటులో ఉండే పతకాలు ప్రవేశ పెట్టి ఖచ్చితంగా అమలు లోకి తెస్తే సామాన్యునికి చేయూత నందిస్తే, మనదేశ సంపదను పెంచుకుని ఎన్నో రంగాలలో విజయ పతాకాలను ఎగురవేయవచ్చు.

–జైహింద్.

ప్రతి ఫలాపేక్ష లేని, నిస్వార్థమైన ప్రేమలో
నువ్వు మునిగినప్పుడే దైవత్వం పొందుతావు.

తప్పెవరిది......?

రామరాజ్యం వర్ధిల్లాలి... రాముడి లాంటి రాజు కావాలి అని భారత జాతి హృదయ విదారకంగా తల్లిడిల్లే రోజు ఏర్పడింది అని చెప్పకనే చప్పొచ్చు... ఎందుకు మరి రామ రాజ్యం..? రాముడు లాంటి రాజు... ఎందుకంటే... సృష్టిలోని ప్రతి ఒక్క తల్లితండ్రి తమ బిడ్డలందరు కడుపునిండా తినాలి.... ఆనందంగా జీవించడానికి అన్నిసౌకర్యాలు వుండాలి అని, అంటే మంచి ఉద్యోగం కావాలి దీనికి కావలసిన అర్హత కలిగి వుండాలి. అంటే మంచి ఆశించిన విద్యా వంతుడై వుండాలి, కీర్తివంతుడై వుండాలి అంటే... నలుగురు ఆచరించిన దారిలో నడిచే సద్గుణాలు తమ బిడ్డలలో తొణికిసలాడాలి అని కోరుకుంటారు. తమ వంశచరిత్ర యుగ యుగాలు వెలుగాలని ఆశిస్తారు. యిది తల్లి తండ్రులుగా ఉత్తమమైన బిడ్డను పొందాలని తపించడం ప్రకృతి ధర్మం. అలాంటి బిడ్డలకోసం అహర్నిశలు శ్రమిస్తూ తమ జీవితాన్ని సర్వస్వం ధారపోస్తారు. సాధించి మురిసిపోతారు.

ప్రతి ఒక్క బిడ్డలో ఇలాంటి లక్షణాలుంటే యింకేముంది దేశంలోని ప్రతి బిడ్డకు ఏ విషయంలో కొదవ వుంటుంది? కనీస అవసరాలకు తపించాల్సిన అవసరమే ఉండదు. విద్యా బుద్ధులు నేర్చుకోవడానికి అరకొర ఏర్పడదు,తమలోని సృజనకు పట్టం కట్టడానికి ఏ అవరోధాలుండవు. తమ ప్రతిభా పాటవాలతో స్వేచ్ఛాజీవనంతో, ఉత్తమ సంస్కారాలతో, సిరి సంపదలతో సమాజం తుల తూగుతుంది. యిలాంటి సమాజంలో నివసించే పౌరునికి అసంతృప్తి ఎక్కడుంటుంది. యిలాంటి సమాజాన్ని పరిపాలించే రాజు రాముడు కాకపోతే మరి ఎవరూ..? ఆ రాజ్యం రామరాజ్యం కాకపోతే మరి యింకేంటి... మరి మనకు యిలాంటి లక్షణాలున్న రాజులున్నారా..? అదే ప్రజాసామ్యంలో మనం ఎన్నుకున్న పాలకులున్నారా... అని, రాజరికంలో అయితే మన అదృష్టం కొద్ది వంశపారంపర్యంగా పరిపాలకులు వచ్చేవారు, ప్రజాసామ్యంలో వున్న మనము మనను పాలించే వాడిని ఎన్నుకునేముందు, ప్రజలను కన్న బిడ్డల్లా చూసే పాలకులను ఎన్నుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాం? పరిపాలనా దక్షత లేని వారికి పట్టం కట్టి పడరాని పాట్లెందుకు పడుతున్నాం, సమాజాన్ని అల్లకోల్లాలతో నింపి అలజడుల దుమారాలలో అనునిత్యం గందరగోళంగా ఎందుకు మారుస్తున్నాము ,అసలు తప్పెవరిది? పక్షపాతంతో, బంధుప్రీతితో, ధనదాహంతో డాబు డంబాలతో, కుట్రకుతంత్రాలతో... కుళ్లిపోయే నాయకులకు పట్టం కట్టి దేశం సుభిక్షంగా వుండాలంటే

ఎలా...! ఒక చిన్న వస్తువు కోనడంలో ఎంతో జాగ్రత్త వహించే మనం మన భవిష్యత్తును , దేశ భవిష్యతును , మన జాతి ఔన్యత్వాన్ని వెలిగించే విషయంలో ఎందుకింత నిర్లక్ష్యం..? లొంగుబాటుతనంతో వ్యవహరిస్తున్నాము, భారతీయులారా మన..మెందుకింత భాద్యతా రహితంగా ప్రవర్తిస్తున్నాం , మందబుద్ధులమై మన మనుగడను మనమే ఎందుకు నిర్వీర్యం చేసుకుని మనజాతికి మచ్చ తెస్తున్నాం. తప్పెవరిదీ? పాలనాదక్షత లేని పాలకునిదా..!అలాంటి వారికి పట్టంకట్టిన ప్రజాసామ్య ప్రభుత్వంలోని ప్రజలదా..! కాస్త ఆలోచించండి , భవిష్యత్ తరాల భవిష్యత్తు... మీ చేతుల్లోనే వుంది. -జైహింద్.

సింధూరపు చీరకట్టే

పల్లవి: సిందూరపు చీర కట్టె
మాతూరుపు గగనము
ఆ సింగారాలెన్నో సృష్టి అందాలను మెరుగుదిద్దె
సుధా రసధారలై
శుభతేజమై॥సిందూరపు॥

చరణం1: బంగారపు కాంతి వెలిగె
మా హృదయ సీమలో
మంధారపు పూలు విరిసే మా పెరటీ తోటలో
రంగవల్లి అల్లికలో మునిగి మగువలు
ఝుమ్మనె తుమ్మెద సన్నాయి స్వరాలలో
తేలి తూగసాగే
ఓలలాడసాగే ॥సిందూరపు॥

చరణం2: డుం డుం అని బుడ బుక్కల వాని నాదమును విని
పాలుతాగే లేగదూడ గెంతులేని స్వరము కలిసి
కిలకిలమనె పక్షుల మంగళ వాద్యాలతో
మా ఊరు మేలుకుంది మధు మంజుల సమతేజమై
మంజుల సుమతేజమై ॥ సిందూరపు ॥

నేటి భారతం

మహిళకు మనసుంటే దానిని చంపుకోవాలి.
మమత వుంటే దాచుకోవాలి.
ప్రతిభ వుంటే ప్రక్కన బెట్టాలి.
పైసాలయితే సంపాదించాలి.
దానం చేయాలన్నా అడుక్కోవాలి.
యుగాలు మారినా మా చరిత్ర మారలేదు.

సుంధర భరతావని, సుమధుర సస్యశ్యామల సుదాధారలతో తడిసి వేదమాత ఒడిలోన ఓలాలాడి, గలగలమని పారేటి గంగమ్మతో పులకరించి, పురాణ పురుషుల పదస్పర్శతో పవిత్రమైన ఈ జనినిపై ఎందరో వీరులు త్యాగమూర్తులు, ముముక్షువులు, కవులు, పండితులు, గాయకులు, విద్వాంశులు, విదుషీమణులు జన్మించారు. వారి ఉనికితో ఈ అవని పులకరించి మనజాతి ఖ్యాతి అనంత తేజస్సుతో వెలుగొందింది. మరి అలాంటి మనదేశంలో మన మనుగడకు ఆదారమయిన నారీమణుల ఆక్రందన ఏమిటి?

అశాంతి అలజడులతో అలమటిస్తూ... అణుక్షణం ఆదుర్దా పొగమంచులో ఊపిరి పీల్చుకోలేక ఆవేదనా సుడిగుండంలో పడిరోదించాల్సిందేనా పురిటి కందు నుండి పుడమిలో కలిసే వరకు ఏమిటీ మాజన్మ వింతజన్మ అని కన్నీటి సంద్రములో, కలిమిలేములతో, కర్కష హృదయాల మధ్య కలవర పడుతూ... ఈసడింపులు, ఏవగింపులనే ఆభరణాలుగా యిచ్చేటి ఈసమాజంలో కుములాల్సిందేనా అంటూ ప్రతిక్షణం భారత స్త్రీ భయంతో బాదతో బీతిల్లుతుంది. జాతి నిర్మాణానికి, జాతి రత్నాలను తీర్చిదిద్ది ఖ్యాతి పెంచడానికి ఆధారమైన స్త్రీజాతి అణుక్షణం అవమానం, ఆవేదనతో అలమటిస్తుంటే భావి భారతం ఎలా వుంటుంది.

స్త్రీ జాతిని కట్టుబాట్లతో కట్టేసి కొందరు, విచ్చల విడితనంతో ఊరేగిస్తూ...సంతలో వస్తువుగా అశ్లీలంగా అర్ధనగ్నంగా ఆంతర్యాలను కించపరుస్తూ యిలా అంగట్లో పెట్టి వ్యాపార వస్తువుగా... పనిచేసే యంత్రంగా... విలాసాల ఘణిగా చూస్తు అణుక్షణం ఈసడించేస్తుంటే... ఆనందం ఎక్కడి నుండి వస్తుంది.

మహిళకు మనసుంటే దానిని చంపుకోవాలి,

మమత వుంటే దాచుకోవాలి,
ప్రతిభ వుంటే ప్రక్కన బెట్టాలి,
పైసాలయితే సంపాదించాలి.
దానం చేయాలన్నా అడుక్కోవాలి(యింట్లో వాళ్లను)

యుగాలు మారినా మా చరిత్ర మారలేదు, కంచే చేనుమేస్తుందా! తమ గుండెలపై ఎత్తుకుని ఆ పద స్పర్శతో మురిసిపోయి ఆడించే తండ్రే కాస్తపెరిగి పెద్దయ్యేవరకు చూసి ఓర్వలేక చిదిమేస్తుంటే... కనురెప్పే కంటిని పొడిచేస్తుంటే ఈ ఆక్రందన ఎవరు వింటారు? యావత్ మానవ జాతి సిగ్గుతో తలవంచుకోవలసి వస్తుంది. ఎటు దిగజారి పోతున్నాయి విలువలు, ఏది స్త్రీజాతికి రక్షణ శాస్త్రసాంకేతిక రంగంలో దూసుకెళ్తున్నా మేము శాపగ్రస్తులమే ఎందుకు? దేనిలో మేము తీసిపోయాము, ఏమిటీదుర్గంద కుటిల కుళ్లు నీతి పురుషాదిక్య సమాజం.

ఏమిటి వీరి జులుము? స్త్రీ జాతిపై ఎందుకు ఈ వివక్ష ?

స్త్రీ జాతిని కించపరుస్తూ తమ కర్కష, కఠిన భావనలతో అణచివేస్తుంటే యింటికి దీపంయిల్లాలన్న ఆర్యోక్తి కొడి గట్టి సమాజం అందకార బందురమవుతుంది. భావి భారతం అలమటిస్తుంది. **ఏదేశ చరిత్ర చూసిన ఏమున్నది గర్వకారణం. స్త్రీ జాతిని చీత్కరించే చరిత్రా ఓ చరిత్రేనా..! ఆలోచించండి ఓ విజ్ఞులారా ఎటు పోతుంది ఈ సభ్య సమాజం.ఏమౌతుంది భావి భారతం..?**

-జైహింద్

మన విజయం అందరికీ అమృత
ఫలమవ్వాలి
నీడనిస్తూ అసహాయులకు
ఆశ్రయమివ్వాలి
ఎన్ని వున్న ఎంతెదిగిన గంభీరంగా వున్న
శాఖల్లా మనమంతా జీవించాలి...
వృక్ష శాఖల్లా మనమంతా జీవించాలి.



ఆలోచించండి ఇలా ?

ఏ దేశ చరిత్ర చూసిన... ఏ కాలంలోనైనా సరే మనకు సాధారణంగా కన్పించేవి. ప్రేమ సన్నివేశాలు అదే విధంగా.. స్పర్థలతో కూడిన సన్నివేశాలు, తిరుగుబాటుతనం దీనినే మనం యుద్ధం అని అన్నాం.

వ్యక్తపరిచే విధానాలేవైనా, దాని పేరేదైనా, మనుషుల అంతరంగాల నుండి పెల్లుబికిన వ్యతిరేకతలకు, సంఘర్షణలకు ప్రతి రూపమే ఈ యుద్ధాలు, వర్గపోరాటాలు, సమ్మెలు ఏది ఎలా ఉన్నా వీటి వెనుక దాగున్నది మాత్రం ఒకటే అదే కావాలనుకున్నది సాధించుకోవడం, దీనిలో ఒకరికి మంచి అన్పించింది ఇంకొకరికి కాకుండా ఉండడమే. ఒక ఇంట్లో కలసి ఉన్నవారి మధ్యలోనే మనస్పర్థలు, నీది, నాదనే భావన ఉంటుంది. అలాంటిది ప్రాంతాల వారి మధ్య ఉండడంలో ఆశ్చర్యమేమి లేదు. అయితే సాధించుకునే విధానాలలో కాస్త మార్పు రావాలి. లేకపోతే సమాజంపై దాని ప్రభావం కోలుకోలేని దెబ్బగా మారుతుంది. దాని ఫలితం సామాన్యుడు విలవిలలాడతాడు.

ఈ బందులు, సమ్మెలు, అనాలోచితన చర్యలు, ఆవేశాలు పెల్లుబికి నేటి మన సమాజంలో సామాజిక జీవనం పై కోలుకోలేని దెబ్బ అని చెప్పవచ్చు. బందుల ప్రభావంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడి పన్నుల రూపంలో ప్రజలపై భారం పడుతుంది. నిత్యావసరాలు నింగిలో కూర్చుని సామాన్యుని జీవితం దుర్భరమవుతుంది. ముఖ్యంగా రేపటి సమాజ నిర్మాతలైన చిన్నారులు బలైపోతున్నారు. కల్మషాలు, కాఠిన్యాలు, ఎరుగనివారి నిర్మల మనసుల్లో ద్వేషభావాలు నింపడం ఎంత వరకు సమంజనం..! విద్యాలయాలు మాటిమాటికీ మూసివేయడం వలన వారిలో తీవ్రమైన మానసిక ఒత్తిడి ఏర్పడుతుంది. వారి విద్యా విధానంలో ప్రణాళిక దెబ్బతింటుంది.

అంతే కాకుండా చిన్నారి వారి మనసుల్లో ద్వేష భావాలు నింపకండి. వారి విద్యార్జనకు ఆటంకం కలిగిస్తే ఎలా? అయినా మన సమస్యలను వారెలా పరిష్కరించగలరు. విరిసే సుమాలయిన వీరి మనసులు అర్థం చేసుకోగలవా. ఆలోచించండి... మనది ప్రజాస్వామ్య ప్రభుత్వం ఓట్లువేసి మనమే మన ప్రతినిదులను

ఎన్నుకున్నాం కదా..! మరి మన సమస్యలు తీర్చే బాధ్యత వారిపైనే ఉంది. కాబట్టి ముందు వారిని నిలదీసి చర్చించి ముందు కెళ్లాలి. కానీ ఓట్లను అమ్మేస్తే ఈ సడరాని పాట్లు మనకే తప్పవు. కూటి కోసం కోటి విద్యలు నేర్వచ్చు. ముక్కోటి పనులు చెయ్యోచ్చు కానీ వ్యక్తిత్వాన్ని అమ్ముకో వద్దు. ఇది మనను మనమే పాలించుకోవడానికి పాలకులను నియమించుకున్న ప్రజాస్వామ్య ప్రభుత్వం మనది, మన యోగక్షేమాలు సమాజ ప్రగతికి కాంక్షించే పాలకులు మనకు కావాలి.

అలాంటి వారినే మనము ఎన్నుకోవాలి. అంతే కానీ ఒక్కపూట గడపడానికి పనికి వచ్చేవారిని కాదు. ఏ సమస్య పరిష్కారానికైనా చేసే పద్ధతి సమాజానికి ద్రోహం చేసేది, నిర్వీర్యం చేసేది అయి ఉండవద్దు. అర్థిక వ్యవస్థకు గండిపడితే సామాన్యుని బ్రతుకు భారమవుతుంది నిత్యావసరాలు చుక్కల్లో చేరి అందని పండవుతాయి,జీవనం కుంటుబడుతుంది. **పన్నుల మోత మ్రోగుతుంది. సమాజం స్తబ్దతగా మారుతుంది. అందుకే ఓ సామాన్య భారతీయ సోదరులారా...బంద్‌లు, సమ్మెలు, సభలు, ర్యాలీలు అని పిలుస్తే వందనోట్లకై పరిగెత్తకండి. కాస్త ఆలోచించండి..!**

-జైహింద్

ఆహో! ఏమి సుగంధం

పల్లవి : ఆహో ఏమి సుగంధం
ఈ అవని మాత గంధం ॥2॥
అలా వరుణుని పన్నీటి
చిలకరింపులో పరిమళించు వేళ ॥ఆహో॥
చరణం1: ఉరుముల వాద్యాలతో..
మెరుపుల దివిటీలతో ॥2॥
మేఘుని సందేశం అందుకునీ
దేవేంద్రుడు పంపిన
సప్తవర్ణ హారంతో
తన్మయంతో తరువులే
సుమాభిషేకం చేయగ
ఆనంద పరవశముతో
ఆదిత్యుడు దీవించే ఆ వేళ ॥ఆహో॥
చరణం2:చినుకు చినుకుతో ఈ ధరణి
చిత్రంగా పులకించే అందాల భరణి
ఋత్విక్కుల ఆత్మబలం
త్యాగధనుల యశోబలం
ధీరుల, వీరుల ఖ్యాతిని
ఆస్వాదించండి అంటూ
అలా వరుణ దేవునితో కలిసి
ముచ్చటించు వేళ ।ఆహో॥

ఎవరుంటే ఈ యిలలో
మనుగడ మసిబారదో
ఎవరుంటే దీమాగా
జీవన మజిలీ సాగునో
ఎవరుంటే... మన యింట్లో
మమతల మంధారాలు పూయునో
ఎవరి ఒడిలో ఆనందం
ఒదిగి అంబరమై వుండునో
ఎవరి అలనలో హాయియో
ఎవరి తోడు మైమరపో
ఎవరి ప్రేమ అనంతమో...
ఎవరున్నా లేకున్నా
ఎవరుంటే నిశ్చింతో
ఆ దేవతే ఇల్లాలు
ఆమెనీడే స్వర్గము
ఆమే జీవన జ్యోతి.

జీవన జ్యోతి

"ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి ఇల్లాలే ఈ జగతికి జీవన జ్యోతి" అంటూ మహాకవి వేటూరి సుందరరామమూర్తి ఎంత గొప్పగా స్త్రీ మూర్తి ఔన్నత్వాన్ని వర్ణిస్తూ ఆమె మహొూత్కృష్టమైన ప్రేమను, త్యాగాన్ని ప్రతి క్షణం ఏదో రూపంలో మన జీవితాలలో ఆమె మనకు ప్రాణవాయువులా వ్యాపించి మన జీవితాలలో నిత్యవసంతాన్ని పూయిస్తుందో వివరించారు.

ఎవరి తోడు లేకుండా బయటకు వెళ్లలేని అమ్మాయి ఎంతో ధైర్యంతో కొత్త కొత్త మనసుల మధ్య తన మనగడ సాగిస్తుందంటే ఆమేలోని సహనంతో వేటిని పోల్చలేము అసలు ఎవరు చేయగలరు యింత త్యాగం,ముక్కు మొహం తెలియని ఓకుటుంబాన్ని ఉద్ధరించడానికి... అమ్మానాన్నల ఆలనలో విరభూసిన నునులేత ఆ సుమం అనుబందాన్ని పెనవేసుకుని అత్తింటిగారింటితో కలల సౌదాన్ని నిర్మించు కుంటుంది... వారి ప్రతి కదలికలో, కష్టాల్లో, సుఖాల్లో, సంతోషాల్లో, సంబరాలలో భాద్యతల్లో, అన్నింట్లో తానే అంతర్లీనమై వుంటుంది. మనయింట్లో పండుగైతే కునుకుండదు తనకు... ఆవేళ మనకు అన్నీ సమకూర్చి ఆలయంగా యింటికి శోభ తేవాలని తపిస్తుంది. మన ఒంట్లో ఎవరికైనా బాలేక పోతే తన హృదయంలో సుడిగుండమే తిరిగి అవి తన కన్నీటి దారలై, ఏరులై పారుతాయి. మన అవసరాలు తీర్చుటకు తాను కొవ్వొత్తై వెలుగుతూ కరుగుతుంది.

సేవలో తను దాసి కానే కాదు, పనివాళ్లు ప్రతి ఫలాన్ని ఆశించి చేస్తారు తాను మాత్రం ఏమీ ఆశించుకుండా ఆ సేవలో ప్రేమామృతాన్ని నింపి మనకు సమర్పిస్తుంది. కేవలం మన చిరునవ్వునే ప్రసాదంగా స్వీకరిస్తుంది. ఈ స్వార్థపూరిత నేటి సమాజంలో స్త్రీ కుటుంబ జీవితం ఎలా దిగజారిపోయిందో చెప్పడానికి ఎవరి హృదయం సరిపోతుంది? కుటుంబంలో ఎన్ని ఆరల్లు, ప్రతికూల పరిస్థితులు వున్నా తనకు తానే కుమిలిపోతు క్షణం ఒక యుగంగా గడుపుతూ ఓర్పుగా భరిస్తూ అందరికీ భరోసాగా నిలుస్తుంది వుట్టెడు కన్నీరును కంటిలో దాచుకుని కన్నవారికి, ఇంట్లో వాళ్ల కడుపు నింపే అన్నపూర్ణ స్త్రీ మూర్తి, ఎన్ని అవమానాలనైనా భరిస్తూ, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అయినాసరే తన పుట్టినింటి గౌరవాన్ని నిలబెట్టాలని, తనను కన్నవారి కళ్లల్లో సంతోషాన్ని చూడాలని, తాను కన్న వాళ్ల భవిష్యత్తుకు అవరోదాలు కలుగకూడదని, శారీరక, మానసిక హింసల నెన్నెంటినో గుండెల్లో దాచుకునే సహనశీలి స్త్రీ మూర్తి, తన సంతానం నిత్యం సంతోషంగా వుండాలని ఆశిస్తూ బాద్యతలకై తపిస్తూ, భందాలను పట్టిష్టం చేస్తూ నిరంతరం తన ప్రేమ అనే జ్యోతి వెలుగులో తన వారికి ఉనికిని యిచ్చే ప్రేమ మూర్తి స్త్రీ మూర్తి. నా అన్న ఒక్క బావతరంగం కోసం తన జీవితాన్నే దార బోసే అమృత హృదయం ఇల్లాలుది. కుటుంబంలో అందరు తలా ఓ స్థానాన్ని స్వీకరించి బాధ్యతలు పంచుకుంటే తాను మాత్రం అన్నీ తానే అయి అందరికీ ఆలంబనగా మారుతుంది. చిరునవ్వనే భూషణంతో అందరి హృదయాలలో చిరుజల్లులు కురిపిస్తుంది. కుటుంబం అందరిలోని లోపాలను చక్కదిద్దుతూ సర్ది చెప్పుతూ ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పి తమ వారిలోని ప్రతిభను వెలికి తీసి సమాజానికి,జాతికి ఖ్యాతిని తెచ్చే జ్యోతులను అందిస్తుంది. ఎన్ని ఒడిదుడుకుల నైనా ఎదుర్కొని ఎడారిలో కూడా విరజాజులు పూయించే నేర్పరి,ఆలన,పాలనలో అమ్మగా, బాధ్యతను నిర్వర్తించడంలో నాన్న అయి, మన యింటికి ఆమే కాపలా, అమే ఓ దాసి, ఆమే ఓ వైద్యురాలు, సరి పుచ్చడంలో ఓగుమస్తా, సర్ది చెప్పడంలో ఓమంత్రి, సంస్కారాలు నేర్పడంలో ఓ గురువు, పుణ్యకార్యాలలో పునీత, తన కోసం ఏమీ ఆలోచించని యజ్ఞజీవనం ఆమెది.ఎంత అల్పసంతోషి అంటే తను వీటన్నింటికి బదులుగా కోరుకునేది ఓ చిన్నఆత్మీయపు పలకరింపు మాత్రమే. యిదే ఆమెకు కనకాభిషేకమై పులకరింపజేస్తుంది.ఆమె ప్రేమతో అందించే ప్రసాదమే మన జీవితం, ఆమెలేని జీవితం ఓ అందకారమే... అయోమయమే అందుకే ఆమే మన జీవన జ్యోతి.

అలుపెరుగని సూర్యునిలా తన ఆయుష్యును మనకోసవే దారబోస్తూ, అఖండజ్యోతియై... మన జీవితాలను వెలిగించే జీవన జ్యోతే యిల్లాలు, ఏమిచ్చి ఆమె ఋణం తీర్చుకోగలం చేతులెత్తి శతకోటి నమస్కారాలు సమర్పించడం తప్ప, ఆమే త్యాగానికి వందనం, సహనానికి జోహార్లు, ఓర్పుకుప్రణామం, అణుకువకు అభిషేకం,ఆత్మార్పనకు నీరాజనం.

ఆమె పాదాలకు పదే పదే నమస్కరిస్తూ... కృతజ్ఞతా పూర్వక హృదయంతో...

-జైహింద్

సంబరాలలో మనము

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా...
తొలి పూజలందుకునే ఓ బొజ్జగణపయ్యా.
నీ బంటు నేనయ్య, ఉండ్రాళ్ళమీదికి దండు పంపయ్యా..!

అంటూ ఊరూరా, వాడ వాడలా మండపాలు కట్టి పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టి పిల్లలూ, పెద్దలూ, తేడా లేకుండా సంబరాలు అంబరమంటేలా వినాయక చవితి ఉత్సవాలు చేస్తున్నాం... జాతీయ సమైక్యతను చాటి చెబుతున్నాం. మన సంస్కృతిని తారాపథంలో నడిపించేలా చేయాలన్న మన తపన ఎంతో గొప్పది. కానీ... మితిమీరిన అతి మన ఉనికినే దిగజార్చి అన్యులు నిందించే స్థాయికి తీసుకెళ్తున్నాం నేడు. అర్థంకాలేదా, అనాదిగా వస్తున్న మన భారతీయ విశిష్టత, భక్తితత్వాన్ని నలుదిశలా చాటి చెప్పడం మన కర్తవ్యమే కాని దీనిలో అన్య సంస్కృతులను మిళితం చేసి అడిపాడి,తాగి,తూగి మన సంస్కృతీ సంప్రదాయాలను అభాసుపాలు చేయడమే అమానుషం. అంతేకాకుండా భారీ విగ్రహాలతోనే భక్తి అన్నట్లు పర్యావరణ కాలుష్యాన్ని పెంచి ముందు తరాలకు శూన్యం మిగిలించే నాందికి పండుగల్లో కూడా పునాది వేస్తున్నాం.

యింకాస్త ముందుకెళ్తే పవిత్రంగా అందరికీ పంచి తినాల్సిన ప్రసాదాన్ని వేలం వేసి భక్తికి కూడా వ్యాపార రంగు వేస్తున్నారు. వింత వింత నృత్యాలతో భారీ ప్రదర్శనలతో విగ్రహాల నిమజ్జనంలో కూడా అలసత్వమే... సగం సగం మునగక ముందే గంగలో కరగక ముందే ధ్వంసం చేసి వాటిలోని ముడిసరుకుల కోసం శివ శివ.. ఎలా వివరించగలం ఈ అకృత్యాలను. మరింకా ముందుకెళ్తే... కొందరు కాలనీలలో ఆచారంగా పద్ధతి ప్రకారం నిమజ్జనం చేయవలసిన ఈ పవిత్ర మహా గణనాథుని మూర్తులను పెద్ద పెద్ద గుంతలు తవ్వి గుంతలో నీటిని నింపి సరిపోకపోతే పగులగొట్టడం... అసలు ఎటుపోతోంది మన సంస్కృతి, ఈ వికృత పోకడలేంటి? మన వేద సంస్కృతికి ఎవ్వరికి తోచినట్లు వారి వెర్రిని పులుముతారా! మనది ధర్మ ప్రదేశం. మనకో దారి,మార్గదర్శకాలు వున్నాయి. కాస్త వాటిని అనుసరించి నడవండి.

ధూమపానాలతో, మత్తు మందులతో కాదు నృత్యాలు చేసేది. భక్తిపారవశ్యంతో నృత్యం చేయండి, కాని, ట్రూప్స్ అనేవి కూడ వెలిసాయి కొత్తగా... అమ్మాయిలకు అశ్లీల దుస్తులు వేసి వారితో కలసి చేసే కార్యక్రమం ఏంటి? మీరు చేస్తున్న పనేంటి? వీధిపాలు చేస్తున్నారు మన వేద సంస్కృతిని అని ఏడుస్తోంది మన తల్లి భారతి. మాలాంటి బిడ్డల గుండెల్లో రోదిస్తూ విన్నవిస్తూంది. దయచేసి వినాయక చవితి ఉత్సవాల ప్రాశస్త్యాన్ని తెలుసుకుని భక్తితో చేయండి. ఆరోగ్యాన్ని, అష్టైశ్వర్యాల నిచ్చి విఘ్నాలను తొలగించి మనకు విజయాన్ని ఆనందాన్ని ప్రసాదించే వినాయక నవరాత్రోత్సవాల పూజా విధానాలను తెలుసుకుని భక్తి శ్రద్ధలతో చేయండి. కాలుష్య కారకాలయిన పదార్థాలతో తో రసాయనాలతో తయారు చేసిన, రంగులు వేసిన వినాయక భారీ విగ్రహాలను పెట్టి, పర్యావరణ కాలుష్యాలను పెంచకండి.

రేగడి మట్టితో చేసిన విగ్రహాలను పెట్టి... పూజించడం అనాదిగా వస్తున్న మన సంస్కృతి, ఆకులు, పుష్పాలు, వివిధ చెట్ల రసాలతో చేసిన రంగులు వేసి, మనకు ఆరోగ్యాన్ని ప్రసాదించే వివిధ పత్రాలతో, పుష్పాలతో బొజ్జగణపయ్యను పూజించి బెల్లంతో చేసిన ఉండ్రాళ్ల నైవేద్యం పెట్టి ఈ ఋతువులో వచ్చే వ్యాధుల నుండే కాకుండా... అనేక రోగాల నుండి విముక్తిని పొందుదాం. మరియు రకరకాల టపాకాయల చప్పుళ్ళతో వాతావరణ కాలుష్యాన్ని పెంచి వివిధ కనిపెట్టలేని రోగాలను కొని తెచ్చుకోవద్దూ సమాజంలో జీవిస్తున్నందుకు అందరికీ పంచియివ్వద్దు. **మన సంస్కృతిని దిగజార్చే పనులను చేయకండి. మత మార్పిడులకు అవకాశం కల్పించకండి. ఉత్సవాల వరకే కాకుండా నిమజ్జనంలో కూడా శ్రద్ధ వహించండి. మన జాతి గౌరవాన్ని నిలబెట్టండి.**

– జైహింద్... జై...జై...గణేశ.

యువశక్తే,,, నిజసంపద

యువశక్తే దేశానికి నిజమైన సంపద ఏ దేశంలో అయితే యువత ఎక్కువగా వుంటారో ఆ దేశమే నిజానికి సంపన్నమైన దేశం అని విజ్ఞుల అభిప్రాయం.

ఆ విషయానికొస్తే ప్రపంచంలో అత్యదిక సంపన్న దేశం మనదే అని చెప్పొచ్చు ఎందుకంటే ప్రపంచ దేశాలన్నింటిలో కంటే మనదేశంలోనే యువత ఎక్కువగా వున్నారు. మరి అభివృద్ధిలో ఎందుకు వెనుక బడ్డాము... ఏమైపోయింది మన శక్తి సానపట్టని వజ్రంలా ఎందుకు వెలవెల పోయింది. అరాచకాలు, అల్లకల్లోలాలు, అఘాయిత్యాలతో సతమతమవుతుంది.

బద్ధకం, వ్యసనాలు, దుర్గుణాలు, ప్యాషన్లు, అనే దుమ్ము దూళితో కప్పి వేయబడింది. నిరాశా నిస్పృహలతో నీరసించి జీవనంతో కొంత, బ్రతుకు పోరాటంలో ఆరాట పడుతూ అణగారి పోతుంది. మేదస్సు వున్నవాడు తన మోదాశక్తిని పరదేశాలకు తాకట్టు పెడితే, సంపద వున్న వాడు మనసంస్కృతిని చిదిమేస్తూ ప్రాచ్యాత్య పోకడలలో పడి దొర్లుతూ కాలయాపన చేస్తే, నిరుద్యోగులు జీవన బృతికై అయోమయంలో పడి తమ తెలివి తేటలను నీరసం చేసేస్తే.. చేయాలన్న తపన వున్నవారికి చేయూత నిచ్చేవారు లేక నిస్పృహతో దారి తెలియని బాటసార్లుల్లా కూలబడతున్నారు. బాద్యతల మద్య కొంత, బందాలతో బందించబడి మరి కొంత శక్తి అంతర్లీన మయితే, నేటి తరం వెలవెల బోయి, భవిష్యత్ తరాలకు శూన్యం మిగలక యింకేం మిగులుతుంది. ప్రపంచాన్ని శాసించగల శక్తివున్న మన యువత బాద్యతను మరచి కాలయాపనలో కలి కల్మషాలలో మునిగి తేలితే మనజాతి ఔన్నత్వాన్ని చాటి చెప్పేదెవరు..? త్యాగం, శౌర్యం, సహనం, శాంతం, అన్నింటిని నరనరాలలో నింపుకుని మానవజాతిలో మేటి అయిన భరత జాతి వారసులం మనం మరి మన బిడ్డలు యిలా... వారసత్యంగా వచ్చిన మహెూన్నత లక్షణాలను దాచి... తేజోహీనులుగా తిరుగుతుంటే మార్గగాములమై అమోఘమయిన వారి శక్తి సామర్థ్యాలను వెలికితీసి అఖండ జ్యోతులను వెలిగించ వలసిన బాద్యత మనకు లేదా..! ఓ విజ్ఞులారా ఆలోచించండి! తెలియని తనంతో వారు వెలవెల పోతుంటే వారిని జాగృతంచేసి మన జాతి ఖ్యాతి కెరటాలను రెపరెపలాడించడం మన కర్తవ్యం కాదా..! అందుకే మహాత్ములారా... యువతలో నిద్రాణమై వున్న శక్తిని జాగృతం చేసే స్ఫూర్తి దాయక కార్యక్రమాలను చేపట్టండి, వారిలో దాగివున్న భక్తిని, దేశభక్తిని, సామాజిక స్పృహను వెలికితీసే మహెూత్కృష్టకార్యాలకు నాంది పలుకుదాం వారి హృదయ వీణను మీటి భరతమాతకు అమృతాంజలి సమర్పిద్దాం. నిజసంపద మాదే అని గర్విద్దాం.

– జైహింద్.

యం.మంగళ

కలుపు మొక్కలను పీకేద్దాం

బిజీ షెడ్యూల్డ్... తిరిగి చూడగానే రోజులు అయిపోతున్నాయి, వారాలు, నెలలు, వెనక్కి తిరిగి చూసేలోపే సంవత్సరాలు అట్టే గడిచిపోతున్నాయి. ఏం చేద్దాం కార్యమలాంటిది. అమ్మను చూసి చాలా రోజులయింది. ఓ గంటయినా తనతో గడిపొద్దామని ఊరు వెళ్లాను, నన్ను చూసి ఆమె ముఖం నిండుపౌర్ణమిలా వికసించింది. ముందేచెబితే అవి యివి వండుతూ...వుంటుందని అలా చెప్పకుండానే వెళ్లాను. అయితే కాసేపయ్యాక పొలం దగ్గరికెళ్లి చూసిరా బిడ్డా కలుపు తీస్తున్నారా..! లేదా అంది. ఎందుకమ్మా యింత ఆరాటపడుతావు హాయిగా వుండు అవన్ని మనసులో పెట్టుకుని ఎప్పుడు ఆదుర్దా పడుతా వెందుకని అన్నాను, కలుపు తీయక పోతే మనం వేసిన పంట పండదు నాన్న...ఎక్కడి నుండి పెరుగుతుందో కాని ఇదో పెద్ద పరేషాన్ కూళివాల్లు కూడా దొరకరు అంది.

అవును కదా మనం వేయక పోయినా కలుపు ఎలా అయితే పక్కవాటి నుండి పోషకాలను తీసుకొని ఎదుగుతుందో అలానే ఈ జన్మలో కొచ్చిన ప్రతి వ్యక్తికి పాప పుణ్యాలు, శుభాశుభ సంస్కారాలు నిఘూడంగా వుంటాయి. ప్రతి వ్యక్తికాని, తల్లిదండ్రులు కాని నా బిడ్డ మంచి సంస్కారాలతో అందరి మన్ననలను అందుకొని, సత్యగుణ సంపన్నుడై...ఆనందమయ జీవితం సాగించాలను కుంటారు. దాదాపు అందుకు కావల్సిన విదంగానే పెంచుతారు. వారికి మంచి సంస్కారాలు నడవడిక నేర్పిస్తారు. అయితే ఒక్కోసారి సీన్ రివర్స్ అవుతుంది. ఎందుకంటే మనం వేసిన పంటతో పాటు కలుపు మొక్కలు ఎలా అయితే పెరుగుతాయో జన్మాంతరాలలో నిఘూడంగా దాగివున్న చెడు సంస్కారాలు కూడా పెరుగుతాయి. ఎలా అంటే వారి పరిసరాలు కావచ్చు సావాసాలు కావచ్చు, ఆహార,విహారాల ప్రభావం కావచ్చు, వీటి బలం ఎక్కువయిందను కోండి గమనించక పోతే అసలు పంటకన్నా కలుపు ఎలా పెరుగుతుందో మనలో కూడ పరిసరాలను ఆదారం చేసేకుని దుర్గుణాలు..వాటి వాసనలు,సావాసాలు ఒకదాని వెంట ఒకటి అల్లుకుపోయి విజృంచిస్తాయి మనలోని మానవత్వంకు ,మంచికి మచ్చుతెచ్చి... మన మనుగడను నిర్వీర్యం చేస్తాయి. కాబట్టి మనని మనం గమనిస్తూ... అదేవిదంగా మన పిల్లల సహావాసాలను వారిలోని సంస్కారాలను గమనిస్తూ, దుర్గుణాలను పోషించే పరిసరాల నుండి దూరం చేయాలి. కొన్ని కుటుంబాలలో చూస్తాం...అందరు ఎంతో సంస్కార వంతంగా పద్దతిగా వుంటారు. ఒకడు మాత్రం విరుద్దం... అందుకే "**తులసీవనంలో గంజాయి మొక్కలా**" వీడెలా ఆ యింట్లో పుట్టాడనే సామెతలా వుంటారు.

కారణం ఒకే యింట్లో అందరి బుద్దులు, నడవడిక బాగుండి ఒక్కడే ఎందుకిలా అంటే స్వతహాగా అతనిలో నిఘూడమై వున్న దుర్గుణాలనే కలుపు మొక్కలను పీకివేయక పోవడం ఒక కారణం, అయితే అవి బలంగా పెరగడానికి అతని సహవాస దోషాలు మరోకారం. అందుకే ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలకు మంచిని నేర్పుడమే కాదు. చెడును నిర్మూలించాలి..వారి సహచరులను, గమనిస్తూ మంచి స్నేహాలను, పరిసరాలను వుండేలా చూడాలి. అంతే కాదు ప్రతి వ్యక్తి నిరంతరం తనను తాను గమనిస్తూ మనసులో కలిగే ఆలోచనలను విచక్షణతో శోదిస్తూ మన ప్రగతికి అడ్డంకులు గలిగించే వాటినిర్మూలిస్తూ.. వాటిని నిరోదిస్తూ ముందుకు సాగినప్పుడే ఆశయాలు నెరవేరుతాయి. అందరికీ ఆనందాన్ని సంతోషాన్ని పంచి ఆదర్శవంతమయిన ఆనందకరమయిన జీవితాన్ని పొందాతాం.

రైతు ఆశించిన పంటను కలుపు తీసి ఎలా అయితే పొందుతాడో మనము మనలోని దుర్గుణాలు అనే కలుపును అణుక్షణం నిర్మూలిస్తూ...సద్గుణాలు అనే పంటను సక్రమంగా పెంచినపుడే, అంటే వాటికి కావలిసిన పరిస్థితులు, వాతావరణాన్ని ఏర్పరుచు కొన్నప్పుడే మన జీవితం సార్థకం అయి, జీవన ఫలం మనకు అందుతుంది. మరి ఈ విషయమై ఆలోచిద్దామా..!

-శుభం

గృహదేవత

పల్లవి : వరాల పుష్పమా...
స్వరాల సవ్వడా...
తరాల... అంతరాలు కలిపే,
కాంతి పుంజమా..కార్తీక దీపమా...
చరణం1:ఏ వంశపు తోటలోనో విరబూసింది
మా యింటిలో పరిమళాలు వెదజల్లింది
మా మనసులు పెనవేసుకుంటూ అల్లుకుపోయింది.
ప్రేమ భాండమును నింపి
ప్రాణ జ్యోతుల్వెలిగించిన
దివ్య కాంతి పుంజమే -
గృహ దేవతా -ప్రాణ దేవతా - కోడలూ -
ప్రతి యింటి వేలుపే - ॥వరాల॥
చరణం2: మా గుండెలో - తా స్పందన -
మా కంటిలో - పాపగా -
మా యింటిలో వికసించిన మమతల మందారం
గృహ దేవతా -ప్రాణ దేవతా - కోడలూ -
ప్రతి ఇంటి వేలుపే -
॥వరాల॥



ఋణం తీర్చుకుందాం

రమణీయపు సంస్కారం
కమనీయపు జీవితం

సుందర ప్రకృతిలో... ఆనందంగా... ఆరోగ్యంగా... హాయిగా ప్రకృతి మాత ఒడిలో పరవశించి జీవించిన మన పూర్వీకుల జీవనం గుర్తు చేసుకుంటే నిజంగా హాయిగా, ఆహ్లాదంగా... మనసులో అదో మనోహరత నిండి పోతుంది. యిది నిజం వాళ్లెప్పుడు ఆనందంగా వుండేవారు, అంతేకాని సెలవులు ఎప్పుడొస్తాయో ఆనందాన్ని కొనుక్కొవడానికి ఎప్పుడెల్దామా... అని చూసే వారు కాదు. ఎందుకంటే వారు ఆహ్లాద కరమయిన ప్రకృతి రమణీయతలో జీవించేవారు. వాళ్లెప్పుడు పరిసరాలకు హాని కలిగించే విధంగా జీవించ లేదు, కాలుష్యకర వస్తువులతో సావాసం చేసి ప్రకృతిని మలిన పరిచి ముందు తరాల మనుగడకు నష్టం, కష్టం వాటిల్లే విధంగా వారి జీవన విదానం లేదు, అందుకే వారు ఆహ్లాదకర ప్రకృతిలో ఆనందంగా ఆరోగ్యంగా వున్నారు.

మరి మనమెందుకలా వుండలేక పోతున్నాం..? "చదివేస్తే వున్న మతి పోయిందనట్టు" శాస్త్ర సాంకేతిరాలను మనవాళి అభివృద్ధికి, ఆనందకరమయిన జీవనానికి ఉపయోగించాలి. కాని మనమేం చేస్తున్నాం..?

ప్రాశ్చాత్య సంస్కృతుల మత్తులో పడి సాంప్రదాయ జీవన విదానాన్ని వదిలి నిద్రలేచి నప్పడి నుండి రాత్రి వరకు పరిసరాలను కాలుష్యానికి గురిచేస్తూ కలుషితాలతో జీవనాన్ని సాగిస్తున్నాం.

మీరు గమనించండి మన పూర్వీకుల జీవన విదానం మన జీవనం ఏలా వుందో ఒక్కసారి గమనించండి. నాడు జీవిన విదానం..

1. ఉదయాన్నేవేప, ఉత్తరేణి లాంటి ఔషద గుణాలు గల పుల్లలతో పళ్లు తోముకునేది,

2. స్నానానికి, సున్నిపిండి, తైల మర్థన చేసుకుని, మరియు తలస్నానానికి కుంకుడు, సీక కాయలు లాంటి ప్రకృతి సిద్ధమైన వాటిని వాడేవారు.

3) ఉదయాన్నే ఆవుపేడతో కల్లాపి చల్లి పసుపు, కుంకుమలతో, బియ్యం పిండితో ముగ్గు వేసి... ఆవరణాన్ని ఆహ్లోదంగా వుంచడమే కాకుండా... హానికర కీటకాల బారి నుండి రక్షణ పొందేవారు.

4. గృహాల్లో, ప్రకృతిలో లభ్యమైన వస్తువులతో వైద్యం

ఫలితం: యిలా చేయడం వలన నోటిలో వున్న సూక్ష్మ క్రిములు నశించి ఔషధ గుణాలవలన ఆరోగ్యం, వ్యాధి నిరోధకత పెరుతుంది గొంతు, ముక్కు సంబంధించిన వ్యాదులు రావు దానివలన చర్మం పొడి బారకుండా చర్మవాదులు రాకుండా వుంటాయి. జుట్టు ఒత్తుగా నల్లగా నిగనిగలాడుతు వుండేది.

ఆవుపేడ, పసుపు యివన్నీ క్రిమి సంహారకంగా పని చేస్తాయి.

చిట్కావైద్యం ఆయుర్వేదం వలన రోగ ఉపశమనం కలిగి శరీర దారుడ్యం పెరిగేది, హానికలిగేది కాదు.

నేడు జీవన విధానం:

రసాయనాలు కలిపిన పళ్లపొడితో తోమి, సగం మ్రింగి కడుక్కుంటాము. రసాయనాలతో తయారు చేసిన శాంపూలు, సబ్బులు, వివిధ రకాల, లోషన్‌లు వాడకం మన ప్యాషన్.

ముగ్గులు వేసే ఆ అలవాట్లు యిప్పుడు అరుదు వేస్తే గనుక రసాయనాలతో కూడిన సుద్ద ముక్కలు, రంగుల వాడకం వీటి వలన ప్రకృతిలో కాలుష్యం... సరికొత్త వ్యాదులకు స్వాగతం పలుకుతున్నాం.

అల్లోపతి మందులకై పరిగెత్తడం ప్యాషన్.

ఫలితం: గొంతుకు సంబందించిన వ్యాదులు, శిరో వ్యాదులు రావడం కాయం, చర్మం పొడి బారిపోవడం, వివిధ రకాల చర్మ వ్యాదులు రావడం, జుట్టు రాలి పోయి, చుంద్రు తదితర వ్యాదులకు ఆహ్వానం పలుకుతున్నాం.

మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కుంటున్నాం వాతావరణంలోని కాలుష్యకాల సంఖ్య పెంచి ముందుతరాలకు ముప్పుతెస్తున్నాం. మన మనుగడకు హానితెచ్చుకుంటున్నాం ఒక రోగంకు స్వస్తి చెప్పే విషయంలో మరో రోగానికి స్వాగతం పలుకుతున్నాం.కాలు బయట పెడితే మనకు కార్లు, మోటారు వాహనాలు కావాలి వీటితో పొగ వాతావరణ కాలుష్యం, శరీర కదలికలు తగ్గి పొంచి చూసే రోగాలు, మన పూర్వికులు ఎంత దూర మైనా నడిచే వారు, ఆరోగ్యంగా వుండేవారు. నాడు వారికి అది వరం నేడు మన సుఖాలు మనకు శాపం.

యిలా చెబుతూ పోతే ఎన్ని పేపర్లైనా సరి పోవుకాని, మనం ముందు తినేఆహారం గురించి ఆలోచిస్తే... అసలు ఏం తింటున్నాం మనం (మందులు) క్రిమిసంహారక మందులు చల్లి క్రిమి కీటకాలను చంపి... ఆ తరువాత అదిక దిగుబడులంటూ మురిసిపోతూ కలుషిత మైన ఆహారాన్ని వండుకుని రోజుల తరబడి దాచుకుని తిని,

కనిపెట్టలేని రోగాలతో సతమత మవుతూ మన ఆ యుష్షును హరించడానికి మనమే నాంది పలుకు కుంటున్నాం. పరిసరాలను కలుషితం చేస్తున్నాం, మరి నాడు మన తాతలు సహజ ఎరువులతో పండించిన తాజా ఆహారాన్ని తీసుకుని వందేండ్లు చకచకా నడుస్తూ అల్లంత దూరం వారిని కూడ అట్టే గుర్తిస్తూ ఆరోగ్యంగా అనందంగా మునిమనుమలతో ఆడుతూ... పాడుతూ ప్రకృతి మాతను ప్రేమిస్తూ... పరవశిస్తూ ఆనందంగా గడిపారు.

మనం కలుషితాలతో కాపురం చేస్తూ నాగరికత పేరుతో నానా విదాలుగా ప్రకృతిని కాలుష్య పరస్తూ ప్లాస్టిక్ వాడకాలతో ప్రపంచానికి ప్రళయం వచ్చేలా చేస్తున్నాం. జీవజాతుల ఉనికికి హానికర పదార్థాలను మనమే సృష్టిస్తే మరి మన మనుగడ ఆనందంగా ఏలా సాగుతుంది. చివరకు రాత్రి ప్రశాంతంగా నిద్ర పోయే ముందు కూడా గుడ్‌నైట్ అంటు ప్యాషన్‌గా చెబుతూ... గుడ్‌నైట్‌లను వెలిగించి మన జీవితంలోకి రకరకాల వ్యాదులతో బ్యాడ్‌నైటును ఆహ్వానిస్తూ నిద్రపోతున్నాం. ప్రశాంతమయిన ప్రకృతిమాతను యిలా కాలుష్య పరిచి, నియతిని కల్లోల పరుస్తే మరి మనకు ఆనందం ఎక్కడినుండి వస్తుంది. **అందుకే నిస్వార్థంగా మననుండి ఏమి ఆశించని మన మనుగడకు ఆధారమైన ప్రకృతి మాతను కలుషితాలతో కలవరపెట్టకుండా మొక్కలను పెంచి, సాంప్రదాయ జీవనాన్ని సాధ్యమైనంత వరకు పాటిస్తూ ఈ తల్లి ఋణం కొంతైనా తీర్చుకుందాం. మాతా మేమూ కృతజ్ఞతలు తెలిపే వారమే అంటూ ప్రతి ఒక్కరము ప్రతిజ్ఞ చేద్దాం. కాలుష్యకాలకు దూరంగా వుందాం.**

-జైహింద్

తరువులు - జీవన సిరులు

తరువులు - జీవన సిరులు విరులు - పరిమళ జరులు
ప్రకృతి అంటేనే - పచ్చని చెట్లు
పచ్చని చెట్లంటేనే - ప్రాణాధారం అందుకే
ఆశయాన్ని బీజంలా మదిలో నాటాలి
ఆ ఆశయం(సంకల్పమై) మొలకెత్తి వృక్షంలా పెరగాలి
పూవులాగ మన జ్ఞానం వికసించాలి
సంస్కారాలే మఖరందమై విరజిమ్మాలి
జీవన మఖరందమై విరజిమ్మాలి.

తర్వాత ఏంటి ?

చిన్నీ... ఏమయింది ఇంకా తయారవ్వలేదు రెడీ అవ్వటైం అయింది... లెవ్వు అంటూ తన వైపు చూసా... ఏమో దిగులుగా కన్నించింది. ఏంటిరా..! తాతయ్య వాళ్ళింటికి అనగానే అందరికన్నా ముందే ఎగిరి గంతేస్తావు అసలు ఈ రోజు ఏమయ్యింది మా బంగారానికి అంటూ దగ్గరి కెళ్ళాను.

అమ్మా... అమ్మా... ప్లీజ్ నేను రాను మీరు వెళ్ళండి, అంది, ఏం ఎందుకని? అయినా నువ్వు రాకపోతే ఎలా అన్నాను. ఏమయ్యింది అసలు అని ఆరా తీయగా అప్పుడు ఓ... తెగ బాధపడుతూ... నాకు ఎంతో ఇష్టమమ్మా..! కానీ ఈ టెన్త్ క్లాసు వల్లే రాలేకపోతున్నాను ఎలా చదువుతున్నావు అంటారు. చెప్పిన తరువాత ఊరుకుంటారా..! నెక్స్ ఏంటి అంటారు. చెబితే అమ్మో... అమ్మో మెడిసినా... అది సెటిలవ్వడానికి చాలా టైం పడుతుందని ఒకరు..! అమ్మో జీవితాంతం కష్టపడాలి అని యింకొకరు... ఈ మెడిసినేం చదువుతావని ఏప్పుడూ పుస్తకం పరుగులా, వామ్మో... సీటు రావాలంటే కష్టం అని దానికి తోడు నాన్న,ఎవ్వరి తీర్మాణాలు వాళ్లవేనా నాయిష్టంతో సంబంధం లేదా..? అంటూ... ఆగకుండా చెబుతూనే వుంది. సరేసరే తర్వాత మాట్లాడుదాం అంటూ ఫంక్షన్‌కి వెళ్లాలి తయారవ్వు అని వెళ్ళాం. షరామామూలే... వారం తర్వాత నా ఫ్రెండ్ కూతురు కాల్ చేసింది. ఆంటీ చూడండీ ఎలా అంటున్నారో డబ్బుల కోసమే అయితే ఇంజనీరింగే చదవాలా... ఇంజనీర్లే సంపాయిస్తారా..? నాకు ఆ యంత్రాలతో గడపడం యిష్టంలేదు. ఆంటి నేను పబ్లిక్ సర్వీస్‌లోకి వెలుతాను అంది...

ఏమైందమ్మా అంటూ కూల్‌గా అడిగాను. మీకు అర్ధమయ్యిందనుకుంటాను... 15నిమిషాలు తనూ ఆపకుండా... అలాగేచెప్పింది.

ఓకే ఒకే ఏంలేదండీ ఈ రోజు రేపు మనపిల్లలకు ఏంకావాలో అన్నీ వాళ్ల యిష్టప్రకారమే ఇస్తున్నాం మనము. మరి వారి అంతరంగంలోని అభిరుచులను ఎందుకు పట్టించుకోవడం లేదు... అలా అని వారి మీద ప్రేమ లేదని నేను అనడం లేదు కాని వారి అభిరుచులను గౌరవిస్తూ వారికి తృప్తిని కలిగించే జీవితాన్ని అందించే దిశలో మనం మార్గగాములము కావాలి.దీనికి తోడు కోచింగ్ సెంటర్లు, కార్పోరేట్ కాలేజీ వాళ్లు రోజుకోసారి మీ అమ్మాయి 10వ తరగతి అయిపోయింది కదా..! ఏగ్రూపులో జాయిన్ చేస్తారు. ఫీజు తగ్గిస్తాం మేము కలవచ్చా అంటూ రోజూ గుర్తుచేస్తూ కలవర పెడుతారు. ఎందుకండీ యింత ప్రయాసలు ముందు పిల్లల్ని చదువుకోనివ్వండి. చదువడానికే వాళ్ల చిరు హృదయాలు ఆరాటంతో అలిసిపోతుంటే మళ్లీ.. తర్వాత చదువు కోసం, ఆశయాల కోసం ఎందుకు వాళ్లను తికమక పెట్టి వారి హృదయాలను కుదిపేయడం... ఒక్కసారి ఆలోచించండి ఓ శ్రేయోభిలాషులారా మీప్రేమ అపురూపమయినది. మీ ఆత్మీయతానురాగాలే వారి భవిష్యత్తుకు దివిటీలు... ఆనందపు తారాజువ్వలు. కానీ ఇంట్లో ఒకరికి నచ్చిన వంటకమే ఇంకొకరికి నచ్చదు కదా..! అది అంతరంగానికి సంబంధించింది అలాగే ఎవ్వరి అభిరుచులకు తగినట్లు వారుంటేనే ఆనందంగా వుండగలరు. అవి ఆచరించదగినవి అయితే వారిని ప్రోత్సహించి ఆయా రంగాలతో తీర్చిదిద్దుదాం.కానివి అయితే ఆ మార్గంలోని లోటు పాట్లను వివరించి మార్గగాములమవుదాం. అంతేకాని ప్రతిదానికి సంపాదనను ముడిపెట్టి మన ఇష్టాయిష్టాలను వారిపై రుద్దకండి, పసిహృదయాలు తల్లడిల్లుతాయి.

-జైహింద్

చిన్ని చిన్న ఆశ

ఆశ ఆశ ... చిన్ని చిన్న ఆశ...
ఒక ఆశే చిగురుస్తే
చేయూతను మనమిస్తే
మహా వృక్షమవుతుంది
ఫలాలనందిస్తుంది
పరిమళాలు వెదజల్లుతుంది

పాలబుగ్గల పసిడి చేతులు
పని కోసం కాదు
పలకా బలపం చేతబట్టుకుని
పాఠశాల కెళ్ళాలి
ప్రతిభను చాటాలి
ప్రపంచాన్ని గెలివాలి

పలుకరిద్దాం ఇలా...

జీవితం నిజంగా ఓ సాగరేమే! ఎన్నో బాధ్యతలు, బరువులు, చింతలు, చికాకులు... అప్పుడుప్పుడు సంబరాలు, చిన్న చిన్న ఆనందాలు... ఎన్నో కలబోసుకున్న సంద్రం యిది... ఎన్నున్నా.. ఏమున్నా అలసిన మనసుకైనా... ఆనందంతో పొంగే మనసుకైనా ఆత్మీయుల సన్నిది ఎంతో ఊరట కల్పిస్తుంది. ఉత్సాహాన్ని తెస్తుంది. అదేంటో కాసేపు అయినవారితో మాట్లాడితే అదో చెప్పలేని సంతృప్తి. అందుకే ఎంత పనిలో ఉన్నా... కాసేపు అలా స్నేహితులతోనో ఆత్మీయలుతోనో మాట్లాడాలనిపిస్తుంది. అప్పుడు గబగబా మనం ఫోన్ తీసుకుని కాల్ చేస్తాం. అప్పుడు వాళ్ల ఆదరణతో మాట్లాడితే... నిజంగా అదో అమృతం తాగిన అనుభూతి. కానీ వారు నీరసంగా... ఆ... చెప్పు... అంటే ఇంకేం చెబుతాం. బాప్‌రే ఫోన్ ఎందుకు చేసామా! అనిపిస్తుంది. అవును కదా! ఏం లేదండీ ఈ మధ్య నేను చాలాసార్లు గమనించాను. కొందరిని, వారికి ఫోన్ చేయకపోతే ఈ మధ్య అసలు ఫోనే చేయట్లేదంటారు. కాస్త రిలాక్సుగా ఎప్పుడైనా మాట్లాడుదామంటే కాల్ లిఫ్ట చేయగానే ఆ... చెప్పు... ఏంటి అంటూ మొదలు పెడతారు. అది ఎవరు చేసినా సరే... ఇదే ధోరని ఏమో.. ఆత్మీయతో ఫోన్ చేసినప్పుడు ప్రేమగా ఎలా ఉన్నావు? బాగున్నారా? అందరూ...అంటూ ప్రేమగా పలుకరిస్తే ఒకటి కాదు నీతో ఎన్నో మధురానుభూతులు పంచుకుంటారు. తర్వాత అడిగే మాటలను ముందే ప్రేమగా అడిగితే కదా! వాళ్లు నీకు చెప్పేది, ఇది వాళ్ల అలవాటు మాత్రమే కావచ్చు కానీ అవతలి వ్యక్తికి విరక్తి కలుగుతుంది. ఎందుకు ఫోన్ చెసామా? అన్పిస్తుంది. అవునా! కాదా! మీరే చెప్పండి. ఎవరైనా ఫోన్ చేస్తే వారిని మధురమైన వచనాలతో పలుకరించండి నీకోసం నేనున్నానన్న మోరల్ సపోర్ట్ ఇవ్వండి. ఈ సందర్భంలో నేను ఓ విషయాన్ని చెప్పకుండా ఉండలేకపోతున్నాను. నిజంగా కొందరి పలకరింపులు మనలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. ఎంతో ఆత్మీయంగా మన అంతరంగాన్ని స్పృశిస్తాయి. వారి భాషణం మనకు స్వాంతన చేకూర్చుతుంది. ఇలాంటి భాషణతో అందరికీ బందువైన మా పద్మతో, నిజం ఒక్క నిమిషం కన్నా ఎప్పడూ ఎక్కువగా మాట్లాడుకోము. అదీ నెలకు ఒకరోజు, రెండురోజులు. కానీ ఆమే మధుర భాషణ నాలో ఎంతో మధురిమను నింపుతుంది. తన ఆత్మీయ పలుకరింపులో ఎంత మహోన్నత దాగి ఉందంటే తనకు సర్జరీ అయి అసుపత్రిలో ఉన్నప్పుడు కూడా తొనక లేదు. అవూసే రాలేదు. ఎంతో

గంభీరతను దాచారు. నేను ఇంటికి వెళ్తే కానీ తెలియలేదు. తను ఆరోజు ఆసుపత్రిలో ఉన్నారని. అరే... మాటలో ఇంత మధురిమను దాచుకుని పలుకరించే వీరు నిజంగా మహాత్ములే... పలుకరింపుతోనే మనసు పులకరింపజేసి అందరిలో ఆనందాన్ని నింపే ఆత్మీయులను చూసాక అన్పించింది. ఇలా మట్లాడాలని,అందరినీ పలుకరించాలని మరింకేం.. మనమూ... మధురంగా మాట్లాడుదాం. అంతేగానీ నీరసంగా మాట్లాడితే అవతలి వ్యక్తికి నిజంగా... అప్పుడున్న దానికన్నా ఎక్కువ విరక్తి కలుగుతుంది.

అందుకే మన పలుకరింపు... ఎదుటి వారికి పులకరింత కావాలి సుమా..!

పెలుసుగా వున్న చెట్టు వంగదు

సాదారణంగా మీరు గమనించే వుంటారు ఎదురుగడ, సొప్పగడ (సజ్జలచెట్టు బెండు) దాదాపు ఒకేలా అన్పిస్తాయి... కాని వాటి ఉపయోగాలలో ఎంతో తేడా కన్పిస్తుంది.ఎదురుగడ విషయంలోకి వస్తే దండించే దగ్గరి నుండి దండం పెట్టే పల్లకి, కుటీరాలు ఎన్నో అద్భుత కళాకందాలు, గృహోపాలం కారాలు, కొన్నిచోట్ల దేవతా మూర్తులను కూడా తయారు చేస్తారు. ఎందుకో తెలుసా చూడ్డానికి కరుకుగా గట్టిగా కన్పించిన ఎట్టైన వంగే గుణం దానికుంది కాబట్టి యితరులకు (వాడేవారికి)నచ్చిన విదంగా ఉపయోగపడుతుంది. అదే సొప్ప బెండుని చూడండి అది పెలుసుగా వుంటుంది. కాబట్టి యిలా అనగానే విరిగిపోతుంది. దేనికీ పనికిరాదు. అలాగే అహంకారుల మది కూడా అంతే డాబు డంబాలతో ఊరేగడం తప్పా ఏమి సాదించలేరు.ఎవ్వరినీ గౌరవించలేరు.నేను నాకే తెలుసన్న కరుకు తనంతో తన చుట్టూ ఎవ్వరినీ మిగిల్చుకోలేరు, చిటపటలతో ఊరేగుతారు.మరి వినయ విదేయతలతో అలరారే వారు ఎంతటి ఎత్తుఎదిగినా వారు అందరికీ అనుకూలురుగా ఎదురుగడ లాగా వంగి వుంటారు. అద్భుత మయిన కార్యాలు చేస్తూ అందరి హృదయాలలో శాస్వతస్థానాన్ని పొందుతారు.వినయ విదేయతలే నిజమైన అలంకారాలు యిలాంటి మహోన్నత సంస్కారవంతులను భగవంతుడు సమాజశ్రేయస్సుకై ఉపయోగపడే పవిత్ర కార్యాలకై సాదనంలా వాడుకుంటాడు. వీరుకూడా ఎలాంటి కార్యక్రమాలు చేసిన తాము పనిముట్టు లాగానే బావించి నిరహంకారులై శోభిస్తారు. అందరి హృదయాలను వెన్నలా స్పృశిస్తూ వెన్నెలలా నవ్వేస్తూ... జాతి మనగడకు, శ్రేయస్సుకు వారధిలా నిలుస్తారు. ఏమున్నా లేకున్నా అందరి గుండె గుడుల్లో కొలువై శోభిస్తారు. పూజింప బడుతారు. అందుకే మన ఉనికిని అణచివేసే అహంకారాన్ని వదిలి, వినయ విదేయతలతో అందరికీ ఆత్మీయుల మవుదాం. సరేనా..!

హ్యాట్సాఫ్ ...టెక్నాలజీ

‘జనని జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరియసీ”

కన్నతల్లి, పుట్టిన దేశం స్వర్గంతో సమానమన్నారు మన పెద్దలు. అంటే అమ్మ ఎక్కడున్నా. అది పూరి గుడిసె గానీ, రాజకోటగానీ, చివరకు అది ఎడారి అయినా పరవాలేదు. అమ్మదగ్గర ఉంటే అది స్వర్గమే... ఆమె ఒడియే ఆనంద ధామం.. సృష్టిలోని ఏ బిడ్డకయినా తన కన్నతల్లి చెంతన కలిగే హాయి నిశ్చింత, ఆనందం మరెక్కడా లభించవు. అందుకే జననీ జన్మభూమిని స్వర్గతుల్యంగా భావించాము అలాంటి జీవనం భారతీయులది కాబట్టే, అనుభందాలకు పొదరిల్లుగా, యజ్ఞభూమియై శోభించింది. మన ప్రేమానురాగాల తన్మయానికి అన్నిదేశాలూ పరితపిస్తున్నాయి.

మరి అమ్మంటే ! ఆమె ఆకలి తన బిడ్డకోసమే, తనకలలు, కలవరింతలు, ఆవేదనలు, సంబరాలు, సంతోషాలు అన్నీ తనకడుపు తీపికే ధారపోస్తుంది. కాలాన్ని మరిచిపోతుంది. నాన్నంటే..! అతనూ అంతే... ఆచి తూచి నడుచుకోవచ్చు. బాధ్యతల భారంలో బయట పడక పోవచ్చేమో కానీ అమ్మకు ఏమాత్రం తీసిపోని అమరప్రేమ వీరిది. అయితే పిల్లలు రెక్కలు వచ్చాక గూటిని వదిలి వెళ్లే పక్షుల్లా కన్నవారిని అనాధలను చేసి, వీరి భవిష్యత్తుకై వారిని అప్పులపాలు చేసి, పరాయి దేశంలో తిష్టవేసి, గుణపాల్లాంటి మాటలతో వారి గుండెలలో పొడుస్తూ తల్లిదండ్రులను అనాద శరణాలయాలకు పంపించే తనయులను కూడా ఏమీ అనలేక తల్లి మనసు తల్లడిస్తుంది కదా..! అయినా కాస్త నిబ్బరం చేసుకుందేమో ఈ అమ్మ... అవునండీ, ఈ మధ్య మా బంధువుల ఇంటికి మా అమ్మమ్మ సంవత్సరీకానికై వెళ్లాను. సాంప్రదాయ బద్ధంగా బ్రాహ్మణులను పిలిచి చేయిస్తున్నారు. నాకన్పించింది. ఇలాంటి బిడ్డలున్న తల్లిదండ్రులు అదృష్టవంతులు కదా అని, అంతలోనే ఒక పేపర్‌లో పండ్లువుంటే తీసి ఇస్తూ పేపర్ వైపు చూసా, ఒక్కసారిగా నా హృదయం చివుక్కుమంది. అ పేపర్‌లో వున్న ఒక వార్త చూసి, అదేమంటే... “**నా పిల్లల పై కేసు వేయవచ్చా.**” అదేంటని ఎంతో ఆశ్చర్యం, బాధతో చదివా ఆ తల్లి ఎంతో

మనోవేదనతో, భారమైన హృదయంతో, ఎంతో సిగ్గుపడుతూ అడగలేక మరీ లాయరుగారూ...మాకు ముగ్గురు పిల్లలు మాది మధ్యతరగతి కుంటుంబం ,మా వారు చాలా కష్టపడి పిల్లల్ని చదివించారు. అమ్మాయి డాక్టరు, ఇద్దరు అబ్బాయిలు అమెరికాలో వున్నారు. మా వారు ఈ మద్యే చనిపోయారు. ఆ తరువాత పిల్లలు ఇళ్లు అమ్ముకుని యిద్దరూ తీసుకున్నారు. నేను వృద్ధాశ్రమంలో వుంటున్నాను. మా వారికి వచ్చే పింఛను సరిపోవడం లేదు. నాకు షుగర్ ,బి.పి వుండడం వలన ఆ మందులకు కనీసం నెలకు చెరో వెయ్యి రూపాయలు పంపించమని ఎన్నిసార్లు బ్రతిమాలినా వారి సమాధానం లేదు. ఉన్నదాంట్లో సరిపెట్టుకో, వయసొచ్చాక రోగాలు రావా..! అంటున్నారు అమ్మాయిని అడిగితే ఉన్నదంతా కొడుకులకిచ్చి నన్నెందుకు అడుగుతున్నావని అంది. దాంతో నాకు బ్రతుకు భారమనిపించింది. ఇలా నా పిల్లల గురించి చెప్పాల్సి వస్తున్నందుకు నేను సిగ్గు పడుతున్నాను. కానీ మా ఆశ్రమంలోని తోటివారి ప్రోద్బలంతో, ఇంకెవ్వరూ నా పిల్లల్లా అవసరం తీరాక తల్లిదండ్రులను అనాధలుగా చేసి ఈసడించుకొని, పనికి రాని వస్తువుల్లా విసిరేయ కూడదనే ఉద్దేశ్యంతో అడుగుతున్నాను. మీరు అన్యంగా భావించకుండా నాకు తగిన సలహా ఇవ్వండి లాయరు గారు... అని న్యాయసలహాకై ఓ అమ్మ ఆవేదనా భారంతో రాసింది. ఇది చదివాక నాకు కన్నీళ్లు ఆగలేదు. ఎంత ఎత్తుకు ఎదిగింది మన సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలతో సహవాసం చేసిన మనసు మొద్దుబారి, మమత కుళ్లిపోయి, సాటి మనుషులనే కాక, కన్నవారిని కూడా యంత్రాల్లా, పనిముట్లలా వాడుకుని పైసాకై పరుగెత్తించిందా... కన్నవారే లెక్కలేని వారికి, జన్మభూమి అంటే... అదేంటి అన్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదేమో.. !

హ్యాట్సాఫ్ టెక్నాలజీ... నీకు నీవే సాటి నా భారత జాతి రూపురేఖలను మార్చేస్తున్నావుగా... హ్యాట్సాఫ్. **-జైహింద్**

మరి అమ్మంటే ! ఆమె ఆకలి తన బిడ్డకోసమే, తనకలలు, కలవరింతలు, ఆవేదనలు, సంబరాలు, సంతోషాలు అన్నీ తనకడుపు తీపికే ధారపోస్తుంది. కాలాన్ని మరిచిపోతుంది. నాన్నంటే..! అతనూ అంతే... ఆచి తూచి నడుచుకోవచ్చు. బాధ్యతల భారంలో బయట పడక పోవచ్చేమో కానీ అమ్మకు ఏమాత్రం తీసిపోని అమరప్రేమ వీరిది.

వృద్ధాప్యం శాపమా !

నేను ఆఫీసునుండి యింటికి వస్తుండగా మాపక్కవీదిలో వుండే ఆంటి మెల్లిగా నడుస్తూ వస్తుంది. నేను చూసి కారు అపి అంటీ ఎక్కడికెల్తున్నారు. డ్రాప్ చేయనా అన్నాను. నీ దగ్గరికే నాన్న అంటూ అదోలా కన్పించింది. రండి అని డోర్ తీసాను స్టార్ట్ చేసి రోడ్డు వైపు చూస్తు ఎలావున్నారు. అంటీ చాలా రోజులయింది చూసి అన్నాను. బోరున ఏడుస్తున్న శబ్దం విన్పించింది. చూసేసరికి నా గుండె పగిలింది ఎప్పుడు హుషారుగా నవ్వుతూ వుండే ఈవిడ యిదేంటి అని ఏమైంది. ఆరోగ్యం బాలేదా అంటూ ఆరా తీస్తూనే కాళ్లనొప్పులెలా వున్నాయి. అందరూ బాగున్నారా అన్నాను ఆమె కాసేపు ఆపుకోలేక గుక్కపట్టింది.

నేను నీకోసం నిన్నకూడా యింటి కొచ్చాను, నీవు లేవు తల్లీ, అంది ఎందుకు ఆంటీ అనగానే నీకు తెలిసిందే కదా! పోయిన సంవత్సరం చిన్నోడి పెళ్లికూడా చేసాం. అయితే పెద్దోడికి అంకుల్ జాబ్ వచ్చింది. అమ్మాయి పెళ్లి చేసాను. చిన్నోడికి కూడ ఓ ప్లాట్ కొనిచ్చాను అయితే వీడిపెళ్లి అయ్యాక నెల నుండి వేరుకాపురం పెడదాం అని ఆ అమ్మాయి ఒక్కటే పోరు. నెల రోజుల నుండి అమ్మ గారింట్లోనే వుంది పైగా నిన్న పోలీసు కేసు పెట్టింది. అందుకే వచ్చాను అంది. అదేం అని అడిగితే కలిసి వుండదట వేరే కాపురం పెడుతుందట వాడేమో ససేమిరా ఒప్పుకోవడం లేదు. అమ్మను ఒదిలి వెళ్లనుంటున్నాడు నేను చెప్ప లేక పోతున్నాను ఎందుకంటే వాడిజీతం చాలా తక్కువ అంకుల్ పించను డబ్బులతో నేను యిలా యింటిని నెట్టుకొస్తున్నాను పెద్దవాడేమో అసలు పట్టించుకోడు. అమ్మాయేమో అర్థం చేసుకోదు, వాళ్లమంచి కోసమేగా మేము చెప్పేది నెలరోజులుగా కాళ్లు యిలా వాచిపోయాయని కనీసం డాక్టరు దగ్గరికెళ్తే డబ్బులు కావాలని మానేసాను, అంటూ ఎక్కి ఎక్కి ఏడుస్తూ నీవైనా కాస్త చెప్పు ఆ అమ్మాయికి లేదంటే వేరేగా వెళ్లి హాయిగా, కలిగిన దాంట్లో వుండమను యింటి పరువు యిలా తీసేస్తే ఎలా... అంటూ వెక్కి వెక్కి ఏడుస్తుంది. నేను యింట్లోకి తీసుకెళ్లి కాస్త కుదుట పడ్డాక సరేఆంటి మీరు కుదటగా వుండండి. నేను మాట్లాడుతాలే అని ఆలోచించి ఆరాతీసా అసలేంటంటే నేను ఆ అమ్మాయితో, యిక చిన్నాతో మాట్లాడాను. నేను మా అమ్మను వదిలేసి రాలేదా... నా కోసం అతనెందుకు రాడు బయటకొస్తేగాని నేను రాను అని తను, ఈ రోజు రేపుపెళ్లయ్యాక కలిసెవరుంటారమ్మా వాళ్లకు సరదాలు సంతోషాలుండవా

చెప్పు, ఎప్పుడు వాళ్లసంతే అయితే ఎలా హాయిగా బయటకొచ్చి వుండమను అని వాళ్లమ్మ అంటున్నారు, అదేంటక్క ఎంతో కష్టపడి మా కోసం తపించే మా అమ్మను వదిలి యిప్పుడు వచ్చినామెకోసం నేనెందుకు వెళ్లాలి తనెంత ముఖ్యమో నాకు అమ్మకూడా అంతే ముఖ్యం నేను అమ్మను వదిలి ఎక్కడ వెళ్లను ఆమెకు ఏం తక్కువ చేస్తున్నామని... అనుభందాలను యిలా తెంచుకోవాలా నేను, అని ఆ అబ్బాయి, వీరిని చూసి ఆ తల్లి తల్లడిల్లి పోతుంది. వీడైనా వినాలి కదా నాకు జీవితం మీద విరక్తి కలిగింది మా అమ్మ బాద్యత నాకులేకుంటే నిజంగా నేను ఎక్కడైనా... వెళ్లి పోయేదాన్ని ఈ వయసు లో ఆమెను చూసేవారులేరు, అని ఆంటీ వాళ్లమ్మను చూస్తూ ఏడుస్తుంది, ఏంటిది, పెళ్లికాగానే భర్త తరుపువాళ్లు అయిష్టమా యిన్నిరోజులు వారిని పెంచి పెద్ద చేసి, ఒక స్థాయికి తెచ్చి మీకో జీవితాన్ని ప్రసాదించిన వారిని అసహ్యించు కుంటారా..! ఎవరైనా చిన్న సహాయం చేస్తే కృతజ్ఞత చెప్తామే మరి ప్రతిక్షణం పిల్లలకోసమే తపిస్తూ జీవించే తల్లిదండ్రులు పిల్లలకు భారమా... వృద్ధాప్యమం వారికి శాపమా..!

అవగాహన, అనుభందాలకు అర్థం తెలియని పెంపకాలలో పిల్లలని పెంచ కండి, యిలా హృదయాలను క్షిద్రం చేసి విలువైన సమయాన్ని జీవితాన్ని నాశనం చేసుకోకండి, ఆలోచించండి. మనుషులవిలువ తెలుసుకొండి, జీవితమంటే.. బొమ్మలాట కాదు, మనకు నచ్చినట్లు ఆడడానికి ఆత్మీయుల కన్నీరు ఉప్పెనై ముంచుతుంది అది తెలుసుకొని మసులు కొండి.

-జైహింద్



అమ్మను మరుస్తామా...

నా చిన్నప్పుడు అంటే 6వ,7వ, తరగతి చదువుతున్నప్పుడు ఒకసారి టివిలో బదిరులు వార్తలు చూస్తున్నప్పుడు నుదురు భాగంలో చూపుడు వేలుతో గుండ్రంగా తిప్పి చూపిస్తూ... మాటి మాటికి హిందుస్తాన్ అన్నప్పుడల్ల అలాగే చూపిస్తున్నారు నాకేం అర్థం కాలేదని కాదు కాని సంశయమెందుకని మా పెద్ద నాన్నగారిని అడిగాను ఆమె ఎందుకలా చూపిస్తుందని అప్పుడతను ఏం లేదు యివి మూగ చెవిటి వారి వార్తలు కదా... హిందుస్తాన్ అంటే మన సంస్కృతి ముఖ్యంగా బొట్టు పెట్టుకోవడం కాబట్టి భారతీయతను గుర్తించటానికి, వాళ్ళు వినలేరు కదా... అలా చూపిస్తున్నారు అని చెప్పారు.

ఓహ్...నా ఊహ సరి అయినదే అని ఎంతో సంబర పడ్డాను, ప్రతి రోజు కుంకుమ బొట్టు పెట్టు కొవడాన్ని ఎంతో పవిత్రంగా భావించే దాన్ని, అయితే యిప్పుడు యిదంతా ఎందు కనుకుంటున్నారా..! ఏం లేదండీ మొన్నీమధ్య నాకు తెలిసిన ఒక ఆంటీ ఫోన్ చేసారు. ఎప్పుడు చలాకీగా మాట్లాడేది, ఎమైవుంటుదబ్బా అనుకుంటూ మెల్లిగా ఆరాతీసాను ఏమైంది ఆంటీ, అందరు బాగున్నారా పండగకి అక్కవాళ్ళ వచ్చారా! అని అడగ్గానే తను భోరున ఏడ్చేసింది, అసలు ఏమైందో చెప్పండంటూ కాస్త నిదానంగా అడిగాను. కాదు నాన్న నీకు తెలుసు కదా..! నేను ఎంత సాంప్రదాయబద్ధంగా వుంటానో మన సంస్కృతి సాంప్రదాయాలను ఎంత గౌరవిస్తానో... అంటూ ఏడుస్తునే చెబుతుంది. అది సరే యిప్పుడేం జరిగిందో చెప్పండి... కాస్త నిదానించండి అన్నాను.

శ్రావణ మాసంలో వరలక్ష్మీవ్రతం చేస్తాం కదా... ప్రతి సంవత్సరం అందరు ముత్తైదువులను పిలిచి వాయనాలిచ్చి, అలాగే అక్కలు వచ్చారు. వారికి చీరలు తెచ్చి బట్టలు పెడుదామని పెడుతుంటే చిన్నక్క బొట్టు పెట్ట నివ్వలేదు ఎంత అడుక్కున్నా వినలేదు అదేమంటే నాకెంతో బాధనిపించింది. ఆడపిల్ల ఎంతో పవిత్రమయిన పసుపు, కుంకుమలను తోసి పుచ్చింది. ఎలాటి సంస్కృతి మనది ఈ బాధను భరించలేక పోతున్నాను అంది ఏడుస్తూ. అదేం అని అడిగితే ఆమె ఈ మద్యే ఒక (ఫ్లాట్) అపార్టుమెంటు కొనుక్కుని అక్కడే వుంటుంది. అయితే అక్కడ మిగతా యిండ్లలో (ఫ్లాట్స్‌లో) అందరూ వేరే మతస్తులు వుంటారట. అయితే వాళ్ళు ఏం చెప్పారో ఏమో తెలియదు కాని అయితే

వాళ్ళు ఒకటి రెండు సార్లు ప్రేయరు మీటింగని పిలిచి తీసు కెళ్లారట. అసలు ఏం జరిగిందో తెలియదు నెల రోజుల్లో బొట్లు గాజులు తీసేసి మతం మార్చుకుంది, ఆ పిల్ల ఎంత చెప్పిన వినట్లేదు. ఎంతో సంస్కారవంతగా నిత్యం పూజలు చేసే తను యిప్పుడు యింట్లో వాళ్లందరిని మత మార్పిడి చేయించింది. భారతీయులు అతి పవిత్రంగా భావించే ఈ అలంకరణలు తీసేసి యిలా చేస్తుంది నాన్నా..! అంటూ బోరున ఏడ్చేసింది. అసలు అది విన్న తర్వాత నాకు ఆ రోజంతా నిద్రరాలేదు, అందేంటి చిన్నప్పటి నుండి ఎంతో సాంప్రదాయంగా పెరిగిన చిన్నక్క యిలా ఎలా చేసింది.

జన్మతో వచ్చిన మతం మనకు అమ్మకన్నా ఎక్కువ కదా..! ఏదో ఒక సారి అమ్మ మన అవసరాలను, బాధను తీర్చులేదని పక్కింటి వాళ్ళు అది తీరిస్తే వాళ్ళు అమ్మయిపోతారా..!మనకు సహాయం చేసిన వారికి కృతజ్ఞులమే కాని అమ్మ స్థానాన్ని వారికిచ్చి అమ్మను మరిచిపోతామా..? అదే విధంగా మన అవసరాలను భర్త తీర్చలేదని అవి యింకెవరైనా తీరుస్తే వారిని భర్తగా స్వీకరిస్తారా..? యిదెక్కడి ధర్మం ? ఏమైంది మన ఆత్మగౌరవం ఆ దేవుని దగ్గరికెళితే నాకంతా మంచిగయింది అందుకే ఆ మతంలోకి మారామని చెబుతారు. అంతేకాకుండా బొట్టు, గాజులు తీసేయించి దరిద్ర దేవతల్లా మార్చితేనే కోరికలు తీరుస్తానంటాడా దేవుడు? దైవత్వం అంటే యిదేనా..? మనకు నచ్చిన వస్తువు ఎవ్వరైనాయిస్తే వాళ్లుకు మనం బానిసలం అవుతామా... ఎటు పోయింది. మన ఆత్మగౌరవం... స్వార్థపరుల చేతుల్లో కీలుబొమ్మల్లా మారి కన్నవారిని ఏడ్పిస్తూ, అయిన వారి హృదయాలను కలతలతో నింపి మన భరతమాత చింతించే విధంగా చేయటం ధర్మమేనా? భగవంతుడే సాక్షాత్తు అవతరించి కర్మఫలాలను విశదీకరించి భగవద్గీతను అందించిన పవిత్ర దేశం మనది. జీవన్ముక్తులుగా జీవించిన వారెందరో ఈ ధరణిపై జీవించారు.

ఎన్నో మార్గగాములు, విదానాలు మన ఋషులు మన కందించారు. సాధనలతో కర్మల ప్రభావం తగ్గించు కోవచ్చు యివెన్నో వుండగా, ఈ విధంగా మత మార్పిడులకు పాల్పడితే ఎలా పూజా మంధిరంలో పవిత్రంగా నిత్యపూజలాచరించే ప్రతిమలను చెట్ల గుట్టల పాలు చేస్తారా..? మీ తల్లిదండ్రులను కూడా యిలానే విస్మరించే కృతజ్ఞులామీరు? ఆలోచించండి ఎటుపోతున్నాం మనం, మన సంస్కృతి. ఏం చేస్తే ఈ దౌర్భాగ్య స్థితి నుండి బయట పడగలమో కాస్త ఆలోచిద్దాం. మన జాతి గౌరవాన్ని నిలబెడుదాం.

-జైహింద్

అమ్మా..! నన్ను కనొద్దు

భరతావని క్షమించు

(ఓ గర్భస్థ శిషువు.. ఆవేదన)

ఎంతో పుణ్యఫలం వుంటే కాని భరతావనిలో జన్మించే అవకాశ ముండదు వేదాలు పురాణాలు, ఉపనిషథ్‌లు, మహానీయులు, త్యాగధనులు, ఎందరో వెలసిన యజ్ఞప్రదేశం అనుబందాల లతలతో అల్లుకుపోయి ఆత్మీయుల ప్రేమామృత దారలలో తడుస్తూ నిత్యం పులకిస్తూ వుంటుంది. జనని, భగవంతుడే సాక్షాత్తు అవనిలో పుట్టి, ఆడి, పాడి అమ్మ చేతి ముద్దలు తిని గీతామృతాన్ని పంచాడు అదృష్ట మంటే నీదే భరతావనిలో పుట్ట బోతున్నావు అని పలికిన ఆకాశవాణి మాటలు విని పులకించి పోయానమ్మా..! అమ్మా! భారతి నా బుచ్చి చేతులతో కాకుండా నాసుతి మెత్తని శిరస్సుతో. నిన్ను సృశియించి పరవశించాలనే తపనతో మా అమ్మ గర్భంలో ప్రవేశించాను అమృత మయమైన ఆకాశవాణి పలుకులు పదే పదే మారు మ్రోగుచుండగా... ఎప్పుడెప్పుడా నేను నిన్ను నా చిట్టి కళ్లతో చూసేదని ఆతురత పడ్డాను. నేను తన గర్భంలో ప్రవేశించానని తెలియగానే మా అమ్మ తన్మయంతో తన కరములతో ఉధరాన్ని సృశించి నప్పుడు ఆమె హృదయంలోని అమృత ప్రేమ స్పర్శ నన్ను తాకి మైమరపించింది... ఆ ప్రేమలో తడిసి నేను హాయిగా పరవశిస్తుండగా " ఓ మురిసింది చాలులే మళ్లీ ఆడపిల్లే అయితే అప్పుడు చెబుతా నీ పని" అంటూ గట్టిగా ఓ బెదిరింపు. తొలకరి చినుకుల పులకరింత మద్య ఆకస్మికంగా ఉరుము ఉరిమినట్లు అనిపించింది.

కంగారు భయంతో ఒక్కసారి జలదరించిన ఆ కంపనంలో తల్లడిల్లి పోయాను అమ్మా... వణుకు నన్ను అయోమయంలో పడేసింది...వణుకు పుట్టిందమ్మా... అమ్మో ఇదేంటి ఈ భరతావనిలో ఆడపిల్లలంటే ఇష్టం లేదా అనుకుంటుండగానే "అదేంటి అత్తయ్య గారు అలా అంటారు అని అమ్మ వెక్కి వెక్కి ఏడుస్తుంది. "ఏంటా ఏడుపు ఎప్పుడు యిదో దరిద్రం చాల్లే వంటచేయిపో" అన్న కసిరింపు, అంతలోనే మీ అమ్మ మాటలు విన్నారుగా... మీరూ అలా కసురుతారేంటి అంటూ యింకా... వెక్కి వెక్కి ఏడుస్తున్న అమ్మ "అవును తప్పేముంది.. నా మాట అదే అంటూ టక టకా వెళ్లిన శబ్దం" అదేంటి యిల్లాలును దేవతలా చూస్తారు, ఆడపిల్లలను మహాలక్ష్మిలా... బావించి ఆమె అడుగుల క్రింద అరచేతులను వుంచి పెంచుతారని ఈ అవనిలో అందరి హృదయాలు ప్రేమసాగరాలు, ప్రేమ కోసం ఏమైనా చేస్తారని విన్నాను... మరేంటి యిలా అమ్మ ఏడుస్తుంటే నాన్నగారు అలా వెళ్ళిపోతున్నారు కనీసం ఓదార్పు కూడా లేదు. **అమ్మా... నీ గర్భంలోకి నేనిలా అడుగు పెట్టానో లేదో నీ కళ్లలో కన్నీళ్లా నా రాక నీకు దుఃఖాన్ని తెచ్చిపెడుతుందా! ఎందుకమ్మా ఆడపిల్లగా పుడితే ఎం...స్త్రీయే అంటకదా సృష్టికార్యానికి నాంది... ఏమో అంతా అయోమయం.** అమ్మో వీళ్ల మాటలే యిలా వున్నాయి. మరి చూపులెలా వుంటాయో ఆ ఆలోచనల లోనే నిద్రపోయాను.

పాపం మా అమ్మ అలసిపోయిందేమో... పైగా నేను అటూ యిటూ కదులుతుంటాను ఏం చేయను ఏవో కుడుతుంటాయి కదా ప్రాణం పోతుంది. ఆరుబయట కూర్చున్నట్లుంది అమ్మ. బయటనుండి ఏవో శబ్దాలు "అన్నయ్య కయితే అన్నీ అడగ్గానే కొనిస్తారు, మరి నన్నేమో తిడుతారు." అంటూ ఏడుపు...! వాడు మగపిల్లవాడు పెద్దయ్యాక సంపాయిస్తాడు " గరుగ్గా కసిరింపు, అదేంటి నేను సంపాయిస్తానుగా బాగా చదువుకుంటా.

ఆ...సంపాయించావులే.. నీ పెళ్లికే... ఎట్లా అని చస్తుంటే... యింక చదువు కూడానా అయినా నిన్ను కాదు... చీ చీ ఆడపిల్లను పెంచడం ఎలాగో నేర్చుకో అన్న విదిలింపు, ఊరుకో నాన్న నా బంగారు తల్లికదా! నేను కొనిస్తాలే... అంటూ ఆడజన్మ ఎత్తినపుడే ఈ అవమానాలను వెంట పెట్టుకుని వచ్చాము అని ఏడుస్తుంది పాపం మళ్లీ మా అమ్మ... అదేంటి అమ్మాయి వేరే, అబ్బాయి వేరేనా ఎవరమైనా మీ బిడ్డలమేకదా! అమ్మా రేపు నావల్ల కూడా ఇంత యిబ్బంది పడుతావా! అమ్మా

నాన్నల్లారా! నిజంగా నేను మీకు భారమవుతావా! అయ్యో ఎలా చెప్పను.

“ ఎంటత్తా ! కంగారుగా వున్నావు” అన్ని అమ్మ ఎవర్నో అడుగుతుంది, అమ్మాయి కాలేజీకి వెళ్లింది యింకా రాలేదు, ఈ రోజుల్లో ఆడపిల్ల బయటకెళితే ఇంటికొచ్చేవరకూ గుండెలు అరచేతిలో పట్టుకొని బ్రతకాల్సి వస్తుంది. టివిలు, పేపర్లలో చూడట్లే కిడ్నాపులు, అత్యాచారాలు, యాసిడ్ దాడులు అమ్మో తలుచు కుంటేనే వణుకు పుడుతుంది. సమాజం చెడిపోయింది అంతా కీచకులే అయ్యారు “అవునత్తా మీరు చెప్పింది నిజమే సమాజం చెడిపోయింది” అంది అమ్మ, ఆడపిల్ల అంటేనే గుండెల మీద కుంపటిలా తయారయ్యింది... తినక చేయక కూడబెట్టి,కూడబెట్టి కట్నకానుక లిచ్చి నిండు నూరేళ్లు సంతోషంగా వుండాలని పెళ్లి చేస్తే ఏం లాభం, ఏదో ఆవిడ నిట్టూర్పు...

ఏం అత్తా! ఏమయింది మీ అల్లుడు బాగా చదువుకున్నాడుగా అన్న అమ్మ ఆరాలు! ఏం లాభం అమ్మా... లేని అలవాట్లు లేవు దాన్ని కంటికి పుట్టెడు ఏడ్పిస్తాడు... వేదిస్తాడు ఎప్పుడు ఏ వార్త వినాలో అని ప్రాణాలు అరచేతిలో బెట్టుకుని బ్రతుకు తున్నాం. ఆడ జన్మ కన్నా బండరాయిలా పుట్టడం మేలేమో అంటూ ఏడుస్తుంది. అంతలోనే టి.విలో చూడత్తా ఏదో బ్రేకింగ్ న్యూస్ అంటుంది అమ్మ లోపలికి వస్తూ... సామూహిక అత్యాచారం ఛీ! దోంగ సచ్చినొళ్లు వీళ్లను పెట్రోల్ పోసి తగలపెట్టాలంటుంది ఆ పెద్దావిడ అదేంటో నాకర్థమే కాలే... అంతలోనే అమ్మగారు మీ కిది తెలుసా అన్న మాట దానికి ప్రతిమాటగా ఏంటది అన్న అమ్మ... ఆ లక్ష్మమ్మ గారిని వాళ్ల కొడుకు కిందకు నెట్టిండంటమ్మా ఆమె కాలు విరిగింది... యింకెన్ని రోజులు బ్రతుకుతవు సావు అంటూ కొడుకు కోడలు గొడవంటా, ఎప్పుడు కసుర్తరూ..! ఎడికోవాలమ్మా ఆమె యిప్పుడు, పాపం బిడ్డ గూడ చూస్తలేదు ఆమె గోస చూడ బుద్దయిత లేదు మస్తు సంపాయించి యిచ్చింది... ఏం లాబం అంటూ చెబుతూనే పోతుంది.

అమ్మా భరతమాతా... కడుపులో పడగానే ఈ దరింపులకు గురైన నేను, నీ ఒల్లోకి రాగానే వీల్లు నాపై కురిపించే చీదరింపులను నేను తట్టుకోలేనమ్మా! అవి విని తల్లడిల్లే నా తల్లి హృదయ రోదన చూసి భరించే శక్తి నాకు లేదమ్మా!

నేను పెరుగుతూ వుంటే పరవశించాల్సిన నా వాళ్లు గుండెల మీద కుంపటిలా

నన్ను బావిస్తే ఆ కుంపటిలో నేను కాలలేనమ్మా, కాలు బయట పెడితే నరరూప రాక్షసుల కోరలు నన్నెక్కడ చీల్చుతాయేమెానని భయభ్రాంతులతో వణుకుతున్నానమ్మా...! నా జన్మ కారకులకు నావల్ల ఎక్కడ తలవంపు వస్తుందో ఏమో అని నా హృదయం తల్లడిల్లి పోతుందమ్మా! అమ్మా భారతి ఆడపిల్ల పెళ్లి అంటూ ఆదుర్దాపడే నా వాళ్లకు నేను భారంకాలేను... అన్ని దాటిన అత్తింటి వారి ఆరళ్లకు... వారి గుణపాల్లాంటి మాటలకు అమ్మా... నా మనసు చలిస్తే... నేను భారమయ్యా నన్న భావన వస్తే నా కన్న వాళ్లకు తీరని శోకం మిగులుతుంది, కడుపు తీపి చంపుకోలేక అన్నీ తట్టుకున్నా నేను కన్న వారికి భారమయి... వారి కసిరింపులు నాకు కానుక లయితే... ఓ భారత మాత నేను జన్మించడం ఎందుకు? నీ యశో కీర్తులకు మచ్చ తేవడానికా? ఈ కుతంత్రపు ప్రపంచంలో పడి పరిగెత్తే ప్రతిక్షణం... నా ప్రతి అడుగు ఇలా భయంతో వేసేకంటే “అమ్మగర్భంలో ఆ మల మూత్రాలలో ముడుచుకొని ఉండడమే మేలమ్మా? ఈ క్రిములు పెట్టేబాద కన్నా ఈ ప్రకృతి లోకి వచ్చి స్వార్థపూరిత సమాజంలోని విషజ్వాలల వల్ల కలిగే బాదే ఎక్కువ అందుకే అమ్మా నాకొద్దమ్మా... ఈ జన్మ, నిన్ను చూడకుండానే మళ్లీ నింగిలోకి వెళ్లిపోతానమ్మా, ఎన్నో శోభలతో వెలుగొందిన నీ కీర్తికి మళ్ళీ మెరుగు పెట్టమని అంతరిక్షంలో వున్న మన మహాత్ములకు చెబుతానమ్మా..! మీ కోసం భారత మాత ఎదురు చూస్తుందని కలికల్మష దోషాలను కడిగేయగ రమ్మందని వీరులయిన, త్యాగ ధనులయిన నీ బిడ్డలకు చెబుతానమ్మా... అదృష్టముంటే... ఆ సమయంలో నీఓడిలో ఓలలాడడానికి వస్తాను... లేదంటే... బండరాయిగా నైనా ఈ పుడమిలో పుట్టి పునీతమౌతను కాని ఆడపిల్లగా రాలేనమ్మా, అమ్మా భారతి వందనమమ్మా...అమ్మా భరతమాత నీ ఒడిలో పుట్టిన ఎవరైనా అదృష్టవంతులే కాని ఆడపిల్ల కాదమ్మా ఆడపిల్లగా రాలేనమ్మా ,అంతరిక్షంలోకి నిరాశతో వెలుతున్న ఈ పసి ప్రాణాన్ని అర్థం చేసుకుని క్షమించమ్మా భరతావని... చెప్పమ్మా మా అమ్మకు నన్ను మన్నించమని **“ఓ పంచభూతల్లారా మా అమ్మకు చెప్పండి” అమ్మానన్ను కనొద్దూ... అని, భరతావని క్షమించూ..!చెబుతావుగా ఈ అబాగ్య శిశువు రోదన,కన్నీటితో వెలుతున్న ఈ పసిప్రాణం ఆవేదన అర్థం చేసుకుని అమ్మానన్ను కనొద్దూ..!**

ఇట్లు,

ఆవేదనతో తిరిగి వెలుతున్న గర్భస్థ శిశువు

మీకిది తెలుసా ! కర్మేయజ్ఞం

యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ॥
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచ న్త్యాత్మకారణాత్ ॥

యజ్ఞ శేషమును ఆరగించే సత్పురుషులు సర్వ పాపాల నుండి విడిపడు తున్నారు. అలా కాక, ఎవరైతే, కేవలం తమ కొరకే వండు కొంటున్నారో, అట్టి పాపాత్ములు పాపాన్నే ఆరగిస్తున్నారు.

భూమినుండి ఖనిజలవణాలను, సూర్యరశ్మిని, నీటిని స్వీకరించి వృక్షాలు అవి యిచ్చే పుష్పాలు, ఫలాలు... కలప...నీడ, ప్రాణవాయువు... వీటన్నింటిని మనం స్వీకరిస్తాము...వాటికి నీరు పోస్తాము అవి ఒక దగ్గరి నుండి స్వీకరించి మరొకరికి సమర్పి స్తుంది. నీరుపోసి పెంచిన వాడు ఫలాలు తింటాడు పెంచనివాడు తింటాడు, ఏదోరకంగా సమర్పిస్తాడు. అందుకే ఈ ప్రపంచం ఒక "ఆదాన-ప్రదాన శాల" అంటే స్వీకరించడం, సమర్పించడం.

ఎక్కడ గమనించిన యిదే కన్పిస్తుంది. పంచ భూతాలనుండి చైతన్యమున్న ప్రతి ప్రాణీవరకు యిదే, ఒకరిని ఒకరు తృప్తి పరచుకోవడమే జీవనం, కుటుంబం నుండి సమాజం నుండి స్వీకరిస్తున్నాం, మనకున్నది సమర్పిస్తున్నాం. ప్రపంచమనే ఈ నాటకశాలలో ఆగమనం నుండి నిష్క్రమన వరకూ మనం యిదే చేస్తున్నాం గమనిస్తే మనం పాత్రదారులం భగవంతుడు సుత్రదారి, నేను యంత్రమయితే భగవంతుడు యంత్రి, అయితే యిలా కర్మలు చేయంది జీవనాన్ని సాగించలేము, ఈ కర్మలు యజ్ఞంగా మారుతే అవి మనకు ప్రసాదంగా అందుతాయి. అంటే మనం స్వీకరించేవి. కృతజ్ఞతా బావంతో సమర్పించేవి యజ్ఞబావంతో సమర్పిచాలి. కృతజ్ఞత చెప్పకుండా తీసుకునే వాడిని చోరుడు అంటారు. సూర్యుని వెలుగువల్లనే సృష్టిఅంత సాగుతుంది. అందుకే ఆయన రాకకన్న ముందే

మనం లేచి నమస్కరించాలి. అలాగే వాయువు, జలం, అగ్ని, భూమి, ప్రకృతితో అనుసందానమై మనం జీవనాన్ని సాగిస్తున్నాం మరి వీటికి మనం ఏమీ...బదులుగా యిచ్చిఋణం తీర్చుకోలేం, అందుకే కృతజ్ఞతా భావంతో నమస్కరించడం వలన ఋణ విముక్తులమవుతాం... అంతేకాకుండా అన్నింటిలో అంతర్యామి అయి నిలిచే భగవంతుడికి సదా వినమ్రులమై వుండాలి. అంతేకాక యజ్ఞాల ద్వారా మనం దేవతలను తృప్తి పరిస్తే, దేవతలు మనకు సానుకూల పరిస్థితులను ఏర్పరచి సంతోషాన్ని కలిగిస్తారు. ఈ యజ్ఞాలు ఐదు రకాలుంటాయి అవి.

1. దేవయజ్ఞం **2. ఋషి యజ్ఞం**
3. పితృయజ్ఞం **4. మనుష్యయజ్ఞం**
5. భూత యజ్ఞం

1 దేవయజ్ఞం: భగవతుండు మనకు యిచ్చిన దానికి కృతజ్ఞతగా ఏమియిచ్చిఋణం తీర్చుకోలేం.. మన తినే ఆహారాన్ని రక్తంగా ఎవరుమార్చారు మన శరీరంలోని వ్యవస్థలు సమన్వయంగా ఒక దాని కొకటి సహకరించు కొంటూ నిరంతరం సాగిపొమ్మని... ఎవరి ఆదీనంలో... కాలగమనం జరుగుతుందో అతనికి పూజలు, అర్చనలు, ధ్యానం, వ్రతాలు, నోములు యిలాంటి దైవ సంబంద మయిన కార్యక్రమాలు, కైంకర్యాలు చేయడం వల్లఋణవిముక్తులమౌతాం.

ఋషియజ్ఞం : వేదాలు, పురాణాలు, మార్గగాములైన శాస్త్రాలను అందించి మనం సంతృపిగా జీవనాన్ని సాగించే విధంగా మార్గాన్ని ఎర్పరిచిన ఋషుల ఋణాన్ని శాస్త్రాధ్యయనం వలన, వేదపఠనం వలన స్తోత్ర పారాయణ వలన తరతాలకు ఈ సంస్కృతి మనం అందించి ఋషి ఋణాన్ని తీర్చుకోవచ్చు.

3.పితృయజ్ఞం: మన సుఖ జీవనానికి వారు శ్రమిస్తూ మన వంశాభివృద్ధికి, కీర్తిప్రతిష్టలకై తపించి జీవనాన్ని సాగించే మన పితృఋణం తీర్చుకోవాలంటే శ్రాద్ధం, తర్పణాది క్రియలతో వారికి కృతజ్ఞత చెప్పుకొని ఋణవిముక్తులం కావాలి.

4.మనుష్య యజ్ఞం: మన శరీరంలోని వ్యవస్థలు ఎలాఅయితే పరస్పరం సహకరించుకొని సమిష్టిగా వుంటున్నాయో సమాజంలోని వివిద వర్గాల వారిపై ఆదారపడి మన జీవనం వుంటుంది. వీరి ఋణం తీర్చుకోవాలంటే మనం తినే ఆహారం పండించిన రైతుకే మనం మూల్యం చెల్లించట్లేదు కదా! అలాగే మనం యితరులకు సహాయం

చేస్తూ అతిథి, అబ్యాగతులను ఆత్మీయతో ఆదరించాలి వారిని తృప్తిపరిచే విధంగా మర్యాదలు చేసి మనష్యఋణం తీర్చుకోవాలి.

5. భూతయజ్ఞం: మన జీవనం పశుపక్ష్యాదులపై జంతువులపై... వృక్షాలు, నదులు సరోవరాలు, మేఘాలు, సముద్రాలపై కూడా ఆదారపడి వుంటుంది. వీటి ఋణం తీర్చుకోవాలంటే, పక్షలకు గింజలు వేయడం, చీమలకు చక్కెర, పెంపుడు జంతువులకు ఆహారం నీరు అందించడం యిలా చేయడం వలన భూతఋణం తీర్చుకోగలం అంతే కాకుండా పంచసూన పాపాలు అంటే కోయడం, కడగడం, వండడం, ఋబ్బడం, చిమ్మడం... యిలా నిత్యం మనం అత్యవసరంగా చేసే కర్మల వలన ఎన్నో సూక్ష్మ జీవులు నశిస్తాయి వీటి వలన వచ్చే పాపాల నుండి విముక్తి పొందాలంటే అథితులను ఆదరించడం, దాన ధర్మాలు చేయడవే శరణ్యం ఏమి చేసినా కృతజ్ఞతా భావంతో చేయాలి సమర్పణ, యివ్వడంలోనే ప్రశాంతత, ప్రవహించే చోటే పవిత్రత వుంటుంది. ఏమి ఆశించకుండా సమర్పన చేసే కర్మలే యజ్ఞాలు యిలాంటి కర్మల వలన దేవతలు తృప్తిచెందుతారు. యిలా యజ్ఞభావంతో జీవించే వారే మహాత్ములు వీరున్న చోట దేనికి లోంటుడదు సకాల వర్షాలు పడతాయి, యజ్ఞాలు చేయకపోయినా వర్షాలు పడుతాయి, కాని అవి నష్టం కలిగించే అకాల వర్షాలు అయివుంటాయి. కర్మ చక్రం భగవంతుని ఆదీనంలో తిరుగుతుంది. కాలాలు, ఋతువులు, మాసాలు యిలా ఒక్కటేమిటి కర్మలన్నీ ధర్మరూపంలో వుంటాయి. దైవం ధర్మరూపంలో వుంటాడు, యిలా ధర్మ చక్రాన్ని తిప్పేవాడే చక్రపాని.

ఎవరైతే పరమేశ్వరుడు తిప్పే ఈ చక్రాన్ని అనుసరిస్తూ జీవనాన్ని సాగిస్తారో వారు అమృతాన్ని భుజించిన పుణ్యచరిత్రులు.. ఎవరైతే అనుసరించక చేయకూడని యితరులకు హాని కలిగించే యిబ్బంది పెట్టే కర్మలు చేస్తారో వారు పాప జీవనాన్ని జీవిస్తారు. వీరికి సుఖ సంతోషాలుండవు. విచక్షణతో సృష్టిని అర్థంచేసుకుని మన పాత్రయేంటో తెలుసుకుని మన మనుగడ సాదించాలి పరమాత్ముడు యిచ్చిన ప్రసాదం ఈ జీవితం, యిదే మనకు వరం, కృతజ్ఞత చెప్పని వాడు చోరుడు. అందుకే ప్రతి నిత్యం పరమాత్ముని పూజిద్దాం, పంచభూతాలకు నమస్కరిద్దాం, పితృదేవతలను స్మరిద్దాం, సాటివారికి సాయం చేద్దాం, అతిథులను ఆదరిద్దాం, పశుపక్ష్యాదులను ప్రేమిద్దాం. ప్రేమతో జీవిద్దాం... అమృత స్వరూపులమై వెలుగుదాం.

-జైహింద్

పుణ్యభూమి నాదేశం

పుణ్యభూమి నాదేశం ఈమాట వింటూనే అంతరంగంలో ఏవో ఆనంద తరంగాలు సుతిమెత్తగా తట్టిలేపుతూ తన్మయంలో ముంచేస్తాయి. వేద గానాలనే అమృత దారలతో తడిసి యజ్ఞయాగాది క్రతువులతో పవిత్ర మైన మన తల్లి పుణ్య చరిత్ర కాక పోతే మరేంటి? నాజాతి భారత జాతి అని గొప్పగా గుండెల మీద చేయి వేసుకుని చెప్పేంత మహెూన్నత చరిత్ర కలిగిన జాతి మనది ఎందుకంటే ప్రపంచంలో ఎక్కడా నాగరికత కనులు తెరువక ముందే విజ్ఞాన కిరణాలతో ప్రకాశించింది మన చరిత్ర. ఈ ధరిత్రిలో నివసించే మనమంతా ఒకే జాతి అదే భారత జాతి బిన్నత్వంలో ఏకత్వంగా ఆత్మీయతాను రాగ బందాలతో పెనువేసుకున్న అమృత హృదయులను కన్న తల్లి పుణ్యభూమికాక మరేమిటి. ఈ అవని పై పుట్టిన వారు సహనానికి నిజరూపంగా, శౌర్యానికి ప్రతిబింభమై, సామరస్యాన్ని కూడ బెట్టుకుని ధర్మానికి కట్టుబడి, దేశ భక్తికై ప్రాణాలను అర్పించి, జ్ఞానంతో శోబించే అపురూప అమూల్య రత్నం మన జాతి యశస్సు, అన్నపూర్ణ మన తల్లి రత్నాలను రాసులుగా పోసి అమ్మిన ఘణత మనకుంది. అథితులను దైవసమానంగా బావించి అడిగిన వారు ఎవరైనా చివరకు ప్రశుపక్షులైనా సరే...తమ శరీరాన్ని సయితం కోసి యివ్వడానికి వెనుకాడని త్యాగశీలత మన రక్తంలో యిమిడి వుంది దానికి శిబిచక్రవర్తే నిలువుటద్దం. అంతెందుకు బ్రతుకు దెరువుకై వచ్చి మనను రక్తపిశాచాల్లా పీల్చిపిప్పి చేసి వారిని సహనంతో తరిమి వేసినాము ఐకమత్యంతో. ఐతే ఆ తర్వాత బ్రిటీష్ రాణి అథితిగా వస్తే... ఆమెకు మన జాతి అమూల్య రత్నమైన కోహినూరు వజ్రాన్ని బహుమానంగా యిచ్చిన భారతీయుల ఆత్మీయతను ఎవరూ వెల కట్టలేరు అని చాటి చెప్పారు. మెన్నటి మాట ఒకప్పుడు మన పి.ఎమ్ నరేంద్రమోడీకి వీసా యివ్వని అమెరికా ప్రసిడెంట్ ఇండియాకు వస్తే... వేలకోట్ల ఖర్చుతో అథితి మర్యాదలు చేసిన అమృత హృదయం మనది యింతకు మించిన సంపన్నులు ఎవరున్నారు ఈ లోకంలో, రోడ్డుపై వెలుతూ ఎవరికైనా తట్టు తగిలింది అనుకోండి, విల విల లాడే హృదయంతో వారిని లేవదీసి సపర్యలు చేస్తాం. యిలాంటి హృదయం, మానవతా భారతీయులకే సొంతం మాతృదేవోభవ పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అథితి దేవోభవ అంటూ... జన్మనిచ్చిన, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను, విద్యాబుద్దులు

చెప్పిన గురువునే కాకుండా అథితులను కూడా దైవంగా బావించి ఆత్మీయంగా ఆదరించే సంస్కృతి మనది, అంతేకాదు బిక్షగాడికి బిక్షవేసి నమస్కరించే శుభ సంస్కారం మనది, ప్రకృతిని పంచభూతాలను ఆరాదిస్తాం, కుటుంబం కోసం దేశం కోసం ప్రాణలైనా యిచ్చే బిడ్డలను కన్న తల్లి మన దేశమాత, స్త్రీని గౌరవించి పూజించే సంస్కృతి మనది నేటి పరిస్థితులెలా వున్నా యిది మన నరనరాల్లో జీర్ణించుకు పోయింది.

ఆడది అబల కాదు సబల అంటూ ఝాన్సీ లక్ష్మీబాయి రుద్రమదేవి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ యిలా అన్ని రంగాల్లో వారిసత్తా చాటి చూపారు, నేడు చూపుతూనే వున్నారు. అవతార పురుషులు వెలసిన పుణ్యభూమి మనది.

ఒకమానవుడు ఎలా జీవించాలి అని జీవించి ఆచరించి చూపించాడు శ్రీరామ చంద్రుడు... ప్రజల కోసం సర్వస్యాన్ని త్యాగం చేసిన రాజులెందర్నో చూసాం మన చరిత్ర పుటల్లో, మొన్నటికి మొన్న మన స్వాతంత్ర్య సమరంలో సర్వస్యాన్ని త్యాగం చేసి పోరాడిన వీరులెందరో... గాందీజీ, నెహ్రూ,భగత్ సింగ్,శుభాశ్ చంద్రబోస్ అయితే దేశం వెలుపల వుండికూడా జపాను సహాయంతో భారత యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలతో సైన్యాన్ని ఏర్పరచి "అజాద్ హింద్ అనే రేడియో స్థాపించి మన దేశ సైనికులలో స్వాతంత్ర్యయ కాంక్షను పెంచి బ్రిటీష్ వారి గుండెల్లో గుబులు పుట్టించి పరిగెత్తించాడు మన నేతాజీ... మనకున్న పురాణాలు, యితిహాసానాలు ఉపనిషత్తులు.గౌతముని న్యాయశాస్త్రం,అగస్త్యుని నాడి శాస్త్రం, జోతిష్యాస్త్రం, ప్రపంచానికే ఆరోగ్యజీవనాన్ని ప్రసాదించిన ఆయుర్వేదం, యోగ యివన్నీ మన ఋషులు వారి వారి దివ్య దృష్టితో రాసి మనకు ప్రసాదించినవే... యివన్నీ మన వేద గర్భ ఘణత కాదా..!

మహాత్ముడైన ఋష్యశృంగుడు అడుగిడితే వర్షాలు పడ్డాయట, విశ్వామిత్రుడు ఏకంగా త్రిశంఖు స్వర్గాన్నే సృష్టించాడు. యింతటి మహత్తర శక్తిగల మహాత్ములను కన్న తల్లి మన భారతమాత యిలా అఖండచరిత్ర కలిగిన మన పుణ్యభూమి ఘణత చెప్పుడం ఆదిశేషుని తరమే కాదు,నా ఈ చిన్న హృదయం ఎలా సరిపోతుంది అయిన మనం చెప్పడమేంటి స్వాతంత్ర్యానంతరం మనవాళ్లు **"ఆర్నాల్డ్ జోసప్ టోమ్నబీ"** అనే బ్రిటీష్ పౌరున్ని మన రేడియోలో ఒక మహ్మదీయుడు చనిపోతే... సంతాపం చెప్పడానికి పిలిచారు అయితే అతను ఏం చెప్పారో తెలుసా "భారతీయులు కల్మషంలేని వారు, వారికి పగలు ప్రతీకారాలు వుండవు. అందుకు నేనే నిధర్శనం... ఎందుకంటే నిన్న మొన్నటివరకు మా

దేశం వాళ్లు వీరిని ఎంతో బాదపెట్టారు మరియు ఈ దేశంపై ఎన్నో దండయాత్రలు చేసి కొల్లగొట్టిన ముసల్‌మాన్‌కు చెందిన అతను మరణిస్తే నన్ను సంతాపం చెప్పడానికి పిలిచారు. ఎంత గొప్ప సహృదయులు వీరు అని ఉద్వేగ పూరితంగా తన ప్రసంగంలో చెప్పాడు. యింకేం కావాలి యిలాంటి సహృదయం కాదా మన సంపద,యిలాంటి పుణచరిత్రులను కన్న మన దేశం పుణ్య భూమికాదా చెప్పండి.

కళలకు కాణాచి మనదేశం... మన కట్టూ మన బొట్టూ... మన జీవనం ప్రతి కదలికలో అంతరార్థం వుంది, మనశ్రేయస్సుకై యివన్నీ సోపానాలుగా మారాయి. జన్మనిచ్చిన వారికై తన జన్మలనే అర్పించిన బిడ్డలున్నారు... ఎంత ఎదిగినా ఉదిగి వుండడంలో మనకు మనమేసాటి దీనికి నిదర్శనం సర్వేపల్లి రాదాకృష్ణ స్వాతంత్ర్యానంతరం తను చెప్పిన పాఠశాలలో మస్టర్‌గా పనిచేసారు.దేశ ప్రదానిగా వున్న లాల్‌బహదుర్ శాస్త్రి ఎంత నిరాడంబరంగా వున్నారు కనీసం సొంత యిల్లు కూడా లేకున్నది అతనికి యింత నియమబద్దంగా జాతికి అంకితమైన బిడ్డలను కన్నది మన భరతావని ప్రపంచ దేశాలలో బాహ్యంలో ఏముందా యింకా అని వెతుకుతే ఉన్నచోటనే అంత రంగంలోకి ప్రవేశించి అనంతాన్ని ధర్శించే శక్తిని కలిగిన ఋషులు, మునులు నడయాడిన ప్రదేశం మన అవని, ఆది శంకరుల అద్వైతామృత దారలలో తడసి ఓలలాడిన మనం జీవన పరమార్థాన్ని తెలుసుకుని పరబ్రహ్మ తత్వానికై ప్రయత్నిస్తున్నాం.

నేడు ప్రాచ్చాత్య సంస్కృతి అనే గాలి దుమారం వీచి ఆ సుడిగాలిలో పడి తిరుగుతున్నాం మనం కుటుంబ వ్యవస్థలు కుదించుకు పోయాయి నేటి తరం ఆప్యాయత కోసమై అలమటిస్తూంది యంత్రాలకు బానిసై అయోమయంతో రోదిస్తూంది.... కాని సుడిగాలి ఎంత సేపుంటుంది మన సహజ లక్షణాలు ఎక్కడికి పోతాయి నరనరాల్లో యిమిడివున్న మన సంస్కృతి త్యాగం, శౌర్యం, దైర్యం, ప్రతిభ, ధానం, దయ, ఆత్మీయత.... యిలా ఎన్నెన్నో సంస్కారాలు... సంబరాలు... ఈ గాలిలోని ప్రతి అణువులో నిండివున్నాయి ఎవరూ... మన స్వబావాన్ని మార్చలేదు. విశిష్ట చరిత్ర కలిగిన మన యశస్సుకు భంగం చేయలేరు కాని సుడిగాలి ఎంతసేపుంటుంది కాసేపట్లో తగ్గిపోతుంది. ఈ ప్రాచ్చాత్య సంస్కృతి సుడిగాలి కూడ అంతే అయితే సుడిగాలి వస్తే వున్నదున్నట్లు గాకుండా అన్నీ చెల్లా చెదరుచేసి... అతలాకుతలం చేసినట్లు... మన సంస్కృతి సంప్రదాయాలు... జీవన విదానం కూడా చిన్నాభిన్నమై చెదిరి పోతాయి కదా! వీటన్నింటిని

మళ్లీ సరి చేసుకుని పూర్వ వైభవాన్ని పుణఃస్థాపించదానికి మనమందరం ముందుకు రావాలి... మన జాతి ఔన్నత్వాన్ని చాటి చెప్పాలి.

నేటి సమాజంలో మనం నిజంగా సంతోషంగా జీవనాన్ని సాగిస్తున్నామా మన దేశంలో ఉమ్మడి కుటుంబాలు, అనుబందాల లతలతో అల్లుకుపోయిన జీవన విధానం మనది. నేడు ఉద్యోగాలు మెరుగైన జీవనానికై దూరప్రాంతాలకు వెళ్లవలసి వస్తుంది. కుటుంబాలు కుదించుకు పోయాయి, కుటుంబంలో నలుగురుంటే ఎవరి లోకం వారిదే తల్లిదండ్రులు పనిమీద వున్నా పిల్లలకు నీతికథలతో, మంచి సూక్తులతో పద్యాలు చెప్పే మన పెద్ద వాళ్లు లేరు... యిప్పుడు ఉన్నా టెక్నాలజీ పెరిగి టి.వి సీరియల్స్ రూపంలో వారిని బందించేస్తుంది. ఆత్మీయతలకు దూరం చేసింది, నేటి తరం అలమటిస్తుంది బండెడు పుస్తకాలతో కుస్తీపడి, యంత్రాలతో దోస్తీ చేసి పిల్లలు అయోమయంలో పడిపోతున్నారు. అప్యాయతకై అలమటిస్తున్నారు.

వీరు యిలా అయితే ముందు తరం ఎలావుంటుందో ఆలోచించండి. సౌకర్యాలు ఎన్నివున్న నిజమైన ఆనందం రాదు మంచి సంస్కారాలుంటేనే సంతోషం తద్వార మంచి సమాజ నిర్మాణం జరుగుతుంది మరి యివన్ని యింటినుండి, బడి నుండి జరగాలి మరి నేటి సమాజంలో యింటి వాతావరణాలు మారాయి. బడిలో అయితే మార్కుల కోసం పోరాటంలా అయిపోయింది మరెలా! ఆనందకరమైన జీవితమెలా...ఒకప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలు... మంచి విద్యావంతులై, సంస్కారవంతులై శ్రేష్టమయిన జీవితాన్ని మహోత్కృష్ట మయిన సుఖసంతోషాలను, కీర్తిప్రతిష్టలతో జీవనాన్ని సాగించాలని అహర్నిషలు తపించేవారు అందుకోసం ఎన్నో త్యాగాలు చేసేవారు. మరి నేడు పైవాటి అన్నింటితోపాటు... ముందు ముందు వృద్ధాప్యంలో మా జీవితం ఎలా? ఎవరు తీరుస్తారు మా అవసరాలు అన్న ఆలోచనలు వస్తున్నాయి వాటి ఫలితమే ఇన్స్యూరెన్స్ కంపెనీల రిటైర్మెంట్ పాలసీలు అంటే తల్లిదండ్రులకు పిల్లమీద అంతనమ్మకం వుందన్న మాట, తల్లిదండ్రులను పరాయి వాళ్లను చేసి పలాయనం చేసే, అంటే రెక్కలొచ్చాక ఎగిరిపోయే పక్షుల్లా జీవనాన్ని సాగిస్తున్నాం మనం, ఎందుకిలా మార్పు వచ్చింది మన అంత రంగాలలో... మంచి సంస్కారాలు, ఆత్మీయ అనుభందాల విలువలు తెలియక పోవడం నాది నేను అని కుదించుకుపోవడమే కారణం, నాడు బామ్మతాతలు,పెద్దవాళ్లు నీతికథలు, సూక్తులు, పాటలు,పద్యాలు చెప్పేవారు, నేడు వాళ్లు మనతో లేరు... మరెలా మన

తరం యిలా అయ్యింది, వచ్చేతరం ఆప్యాతా అనురాగాల కోసం అలమటిస్తుంది తల్లిదండ్రులు పనులలో తీరిక లేకుండా వున్నా, చెప్పే సంస్కారాలు వారికి లేకపోవడం, యంత్రాలకు అంకితమై జీవనాన్ని సాగిస్తున్నారు.

కనీసం ప్రభుత్వమే చొరవ తీసుకుని విద్యావిదానంలో మార్పుతీసుకురాలి ఎన్ని సదుపాయాలున్నా మంచి సంస్కారాలే నిజమైన ఆనందాన్నిస్తాయి శ్రేష్టమయిన సమాజానికి పునాది ఏర్పడుతుంది. అందుకే తరగతి గది సంపాదన పొందే శిక్షణ శిబిరంగా కాకుండా మంచి సంస్కారాల నిచ్చే కథలు, సూక్తులు, మన జాతి యొక్క ఔన్నత్వాన్ని ఉత్తమ విలువలను నేర్పించే ఆలయాలు కావాలి.మానవుడు ఎలాజీవించాలో, ఎలాంటి ఆహరం తీసుకోవాలో, ఎక్కడ ఎలా విహంరించాలో, వ్యవహరించాలో అన్ని కూర్చి భగవంతుడే మనకు ప్రసాదించిన ప్రసాదం భగవద్గీత ఈ గ్రంథాన్ని మించిన పర్సనాలటీ డెవలప్ మెంట్ కోర్సు ఏదీ లేదు, అలాగే పురాణాలు, ఉపనిషత్తులు వేదాలు ఒక్కటేమిటి ఎంతో జ్ఞాన సంపద మనకుంది... ఎన్ని ఒడిదుడుకులున్నా ఓర్పుగా ఓర్చుకుని చిరునవ్వుతో జీవనాన్ని సాగించే మహోత్కృష్ట సంస్కృతి మనది.

ముఖ్యంగా స్త్రీ సంస్కారవంతురాలయితే ఆకుటుంబమంతా ఆనందంగా... సుఖసంతోషాలతో వుంటుంది. ఆనందకర కుటుంబాలు శ్రేష్టమయిన సమాజం ఏర్పడుతుంది, యిలాంటి సమాజాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలై జ్యొతి ఔన్నతిని, ఖ్యాతిని ప్రపంచం నలుమూలలా వ్యాపింపజేస్తుంది కుటుంబములో ఎన్ని ప్రతికూల పరిస్తుతులున్నా ఓర్పుగా తానే భరిస్తూ అందరికి భరోసాగా నిలుస్తుంది. నేటి సమాజంలోని దురాచారాలను,గృహ హింసలను సహిస్తూ తన పుట్టినింటి గౌరవాన్ని నిలబెట్టాలని మెట్టినింటిలో ఎన్ని మానసిక, శారీరక హింసలున్నా భరిస్తూ గుట్టుగా తన గుండెల్లోనే దాచుకుని జీవనాన్ని సాగిస్తూ తమ సంతానానికి తన వల్లా ఎల్లాంటి యిబ్బందులు కలుగకూడదని వాళ్ల భవిష్యత్తుకై తన సంతోషాన్ని.. జీవితాన్నే పణంగా పెట్టే అమృత మూర్తి యిల్లాలు.క్షణ క్షణం త్యాగంతో, సహనంతో జీవనాన్ని సాగించే బిడ్డలను కన్న మనతల్లి అన్నపూర్ణ, రత్నరాశి,వేదగర్భ అయిన ఈ దరిత్రి పుణ్యచరిత్ర... పుణ్యభూమి నాదేశం.

-జై హింద్.

ప్రపంచాన్ని ప్రేమిద్దాం...

ఆనందంగా జీవిద్దాం!

జీవరాసులన్నీ తమ జీవనాన్ని ప్రతిక్షణం ఆనందంగా, సానుకూలమయిన పరిస్థితులలో సాగిపోవాలని ఆకాంక్షిస్తూంటాయి. అందుకే అహర్నిషలు ఆరాట పడుతుంటాయి. ఏద్దైమైనా మాతృగర్భంలో ప్రవేశించి ఈ అవని పై తొలి అడుగును మోపి, శ్వాస పీల్చి నప్పటినుండి ఆ వూపిరి ఆగేవరకు అందరి ఆరాటం ఒక్కటే దేశ కాలాలు వేరైనా..! అవనిపైన వుండే జీవులలో వైవిద్యం కన్పించిన పీల్చే శ్వాస ఒక్కటే, మనుషులు ఎక్కడుండిన వారి మనో బావాల స్పందనలో ఆలోచన సమహారాలే... బాషలెన్ని వున్నా భావాలొక్కటే విద్య ఎలావున్నా అది యిచ్చేది జ్ఞానమే, ప్రతిభ ఎక్కడుండినా... దాని ఫలితం అభివృద్దే, మమత లెన్ని వున్న అంతర్లీనంగా అందులో వున్నది ప్రేమే...ముఖ్యంగా మానవ జీవన విధానంలో కొన్ని నిబద్ధతలు, బందాలు, అనుబందాలతో యింటా బయటా పెనవేసుకుని పోయాయి. తల్లి పొత్తిల్లలోకి వచ్చిన మనం ప్రకృతి, అమ్మ నాన్న మన కుటుంబంలో వున్న వారి మీద పరస్పరం ఆదారపడి వుంటాం.

ఆ తర్వాత సమాజం, పర్యావరణం, దేశం, ప్రపంచం, యిలా మనయోగ క్షేమాల మీద ప్రతి అంశం ప్రబావితం చూపుతుంది. యివి కొన్ని మానసిక సంబందాలు, యింకొన్ని ఆర్థిక సంబందాలు, మరి కొన్ని ఆరోగ్య పరమైన సంబందాలు. యింకా కొన్ని మన కీర్తి ప్రతిష్టలను యినుమడింపజేసే సంబందాలు, యిలా ఒక్కటేమిటి మన ప్రతి కదలిక మన ముంటున్న ఈ ప్రపంచానికి, ముడిపడి వుంటుంది. మరి మనం ఆనందంగా వుండాలంటే మన కుటుంబంలోని అనుబంధాలను పటిష్టంగా వుంచుకోవాలి,బాద్యతలను పంచుకోవాలి మన పూర్వీకులు మన కిచ్చిన అమూల్య సంపద మన సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ సంస్కారవంతమైన జీవనాన్ని సాగ్గించాలి, కలతలు కన్నీళ్లను ఆవిరిచేయాలి.

మరి మన కుటుంబాలన్నీ సమాజంలో వున్నాయి కదా! మనం మన సమాజం నుండి సమిష్టిగా కొన్ని సౌకర్యాలను పొందుతూ నియమ బద్ధంగా జీవనాన్ని

సాగిస్తున్నాం.మరి యిలా మనం పొందే సమిష్టి సౌకర్యాలను స్వార్థంతో కాకుండా... ధర్మయుతంగా స్వీకరించాలి. ఎలా అంటే మన శరీరం లోని అవయవ వ్యవస్థలు పరస్పర సహకారంతో ఒక్కో వ్యవస్థ ఒక్కో పని చేస్తూ ఎలా అయితే సహకరించి కలిసి వుండి మనకు వునికిని యిస్తున్నాయో... మనం కూడా పటిష్టమయిన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి, శరీర రుగ్మతలు తొలగించి నట్టు అధర్మం అవనీతి, అక్రమాలు, దురాచారాలు, అలజడులు, అసాంఘికాలు, అనే ఋగ్మతలను తరిమి వేయాలి. అప్పుడే అందరం ఆనందంగా వుండగలం, ఎలాంటి,కల్లోలాలు కలవరాలు లేకుండా.

యిలాంటి సమాజాలు వున్న దేశం అన్ని రంగాలలో రాణిస్తుంది. అయితే ప్రతి దేశం ప్రపంచంలోనే వుంటుంది కాబట్టి ప్రపంచ దేశాలన్నింటితో సత్సంబందాన్ని పెంచుకుని అభివృద్ధికి ఒకరికొకరు సహకరించుకుంటూ... ప్రగతి పథం వైపు సాగి పోవాలి. మనమంతా ముఖ్యంగా పర్యావరణంపైన ఆదారపడి ప్రకృతి మాత ఒడిలో ఓలలాడుతున్నాం కాబట్టి మన వనరులను కాపాడుకుంటూ కలుషితం చేయకుండా, వృదాకానీయకుండా ముందు తరాలకు అందించాలి. మన జీవనానికి శ్రేయస్సును కలిగించే విషయాలను, సంస్కృతులను ఆయాదేశాల నుండి గ్రహిస్తూ... ప్రకృతిని, ప్రపంచాన్ని ప్రేమిస్తూ... సమాజాన్ని ఉద్ధరిస్తూ... అనుబందాలను పెంచుకని ఆత్మీయతలను పంచుతూ మనను నమ్ముకున్న వారికి మన జీవితం వరమై...మనమున్న సమాజానికి గౌరవమై... మన దేశానికి ఖ్యాతియై, ప్రపంచానికి మార్గగామియై శోభించాలి. అందుకే ప్రపంచాన్ని ప్రేమిద్దాం.

-జై హింద్

రచనాసక్తి గలవారికి ఇదే మా ఆహ్వానము **స్వర్ణపుష్పం**

విలక్షణ సామాజిక మాసపత్రిక 'స్వర్ణపుష్పం' నందు ప్రచురించుటకు ఈ క్రింది శీర్షికలకు రచయి(త్రి)తలకు ఆహ్వానం పలుకుతున్నాం.కథలు,కథానికలు, కవితలు, పాటలు,శీర్షికలు, సామాజిక స్పందనలు,స్పెషల్‌స్టోరీస్ పండుగలు,ఆలయాలు, జాతీయ దినోత్సవాలు, కార్టూన్స్, జోక్స్, సూక్తులు, మనఆటలు తదితరాలు.

మరియువ్రాయగలిగే నేర్పు ఉండి తమ రచనలను పుస్తకరూపంలో చూసుకోవాలని తపించే వర్ధమాన రచయి(త్రి)తలను మేము ప్రోత్సహిస్తాం. రచనలు బాగుంటేచాలు.మీ రచనలు ఎడిట్ చేసి పుస్తక రూపంలో మేము ప్రచురిస్తాం.ఆసక్తికలవారు సంప్రదించండి.

3-10-21/C,గోకులేనగర్,రామంతాపూర్,హైదరాబాద్. సెల్ : 9666545202, 9848302972

ఈలోకం చిరునామా

స్వార్థపరుల నమూనే ఈలోకం చిరునామా
మాటలోను కల్మషమే మనసులోన మలినమే
పలకరింపులోస్వార్థం... పరిచయాలలో బేదం
ఆత్మీయతలో వెలితి, ఆదరణలో కలితి
ఈగాలిని పీలుస్తూనే అభేదాన్ని మరిచారు.
ఈ గంగతో జీవిస్తు కల్మషాలు పెంచారు.
ఈ అంబరంలో విహరిస్తూ... హృదయాన్ని కుదించారు
ఈ అగ్నితో ప్రజ్వలిస్తూ... నిజానికి పాతర వేసారు.
ఈ అవనిలో చరిస్తూ... అమ్మను కూడ విస్మరించారు.
మాటల్లో విషాన్ని నింపి మనుగడను మసి చేసారు
వ్యసనాలకు భానిసలయి జీవితాలను అదోగతి చేసారు
బాద్యతలను విస్మరించి బ్రతుకును భారంగా మార్చారు
సామాజిక సృహను మరిచి ముంధుతరాలకు శాపంగా మారారు
సభ్యతను వదిలేసి జాతిని నిర్వీర్యం చేసారు
సంస్కృతులను చిదిమేసి సంఘవిద్రోహులుగా మారారు
సంస్కారాలను కాలరాసి పిశాచాల్లా ఎదిగారు.
ఇక సమాజం,దేశమా... ఇదంటే ఎమిటో...
తెలియని తనమే వీరికి
అందుకే...
ఓ.. సహృదయమా...
నీ అవసరం..నీ జాతికి అత్యవసరమైయ్యిందీ
మేలుకో... ఏలుకో..
కడిగేసెయ్.. ఈ కల్మశ చరిత్రను.
నీకొసమే నీ జాతి నీరీక్షణలో వుంది.

మా నూతన ప్రచురణలు





9848302972

స్వర్ణపుష్పం పబ్లికేషన్స్

ఇం.నెం: 3-10-21/సి, గోకుల్‌నగర్, రామంతాపూర్, హైదరాబాద్ - 500 013.